# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 2 - సంచిక 4 జనవరి 2024 వెల : రూ.15



కొత్త సంవత్సరం.. ప్రజా రాజకీయం

మోదీ హ్యాట్రిక్‌ను.. అడ్డుకోవడమెలా?

రామ మందిరం సరే, రామరాజ్యం ఎక్కడ ?

మలుపు తిరిగిన రామాలయ వివాదం

సైద్ధాంతిక పోరాటమే కాంగ్రెస్‌కు శరణ్యం

అయోధ్యలో రామకథ చుట్టూ ఆలయాలు

వాల్మీకి రామాయణంలో రాముడు

ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ మహాసభలు

కేంద్ర పెత్తనంలోకి ఎన్నికల కమిషన్

భారతీయ శిక్షాస్మృతిలో ప్రమాదకర మార్పులు

మానవేతిహాస మహాకావ్యం కమ్యూనిస్టు ప్రణాళిక

లెనినిజం - వర్గ చైతన్యం

సోషలిజంతోనే ప్రగతిశీల సమాజం

కమ్యూనిస్టు ఉద్యమం ఒక ఫీనిక్స్ ఉద్యమం

మతం ఒక అబ్నార్మల్ జెనిటికల్ మ్యుటేయన్

ఆదర్శ కమ్యూనిస్టు - అరుదైన కార్మికనేత కపర్దీ

సనాతన ధర్మం మర్మం విప్పిన కొడవటిగంటి కథలు

పాలగుమ్మి సాయినాథ్ ఆఖరి పోరాటయోధులు

ఖమ్మం ఈస్తటిక్స్ 2023 కథల సంపుటి

నల్లి ధర్మారావు నవల.. వీర గున్నమ్మ కళింగ సివంగి

పారదర్శక ఎన్నికల కోసం 'సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ

జనవరి - 2024

# దారి దీపం

మాసపత్రిక

సంపుటి : 2 - సంచిక : 4


**డీవీవీఎస్ వర్మ**
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1) కొత్త సంవత్సరం.. ప్రజా రాజకీయం
- సంపాదకీయం 3
2) మోదీ హ్యాట్రిక్‌ను అడ్డుకోవడమెలా?
- యోగేంద్రయాదవ్ 4
3) రామ మందిరం సరే, రామరాజ్యం ఎక్కడ ?
-ఎ.కృష్ణారావు 6
4) మలుపు తిరిగిన రామాలయ వివాదం
- ఎం.కోటేశ్వరరావు 8
5) సైద్ధాంతిక పోరాటమే కాంగ్రెస్‌కు శరణ్యం
- అశుతోష్ 9
6) అయోధ్యలో రామకథ చుట్టూ ఆలయాలు
- సరోజ్‌మిశ్రా 11
7) వాల్మీకి రామాయణంలో రాముడు
- డాక్టర్ దేవరాజు మహారాజు 12
8) ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ మహాసభలు 14
9) కేంద్ర పెత్తనంలోకి ఎన్నికల కమిషన్
- తెలకపల్లి రవి 15
10) భారతీయ శిక్షాస్మృతిలో ప్రమాదకర మార్పులు -ఎ.నర్సింహారెడ్డి 17
11) మానవేతిహాస మహాకావ్యం కమ్యూనిస్టు ప్రణాళిక - ఎన్.వేణుగోపాల్ 21
12) లెనినిజం - వర్గ చైతన్యం - ప్రభాత్ పట్నాయక్ 23
13) సోషలిజంతోనే ప్రగతిశీల సమాజం - ఆర్.రఘు 26
14) కమ్యూనిస్టు ఉద్యమం ఒక ఫీనిక్స్ ఉద్యమం - సురవరం సుధాకర్‌రరెడ్డి 28
15 మతం ఒక అబ్నార్మల్ జెనిటికల్ మ్యుటేయన్ - విరించి విరివింటి 30
16) ఆదర్శ కమ్యూనిస్టు - అరుదైన కార్మిక నేత - డి.వి.వి.యస్.వర్మ 32
17) సనాతన ధర్మం మర్మం విప్పిన కొడవటిగంటి కథలు - కాత్యాయనీ విద్మహే 33
18) పాలగుమ్మి సాయినాధ్ ఆఖరి పోరాటయోధులు - ఆర్వీ రామారావ్ 37
19) ఖమ్మం ఈస్తటిక్స్ 2023 కథల సంపుటి - ఎస్.కాంతారావు 39
20) నల్లి ధర్మారావు నవల.. వీర గున్నమ్మ కళింగ సివంగి - వి.విజయకుమార్ 40
21) పారదర్శక ఎన్నికల కోసం 'సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ' 41
22) కార్టూన్స్ 43 23) కొత్త పుస్తకాల స్వీకారం 44




కార్టూన్ : సతీష్ ఆచార్య

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : **DVVSVARMA.COM**

**దారి దీపం**

**మాసపత్రిక**

**మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి**

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను..
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
నంబరుకు విధిగా
వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495



# కొత్త సంవత్సరం.. ప్రజా రాజకీయం

కొత్త సంవత్సరం వచ్చింది. కేలండర్ మారింది. సుఖ సంతోషాలు కలగాలంటూ మిత్రుల ఆకాంక్షలు సోషల్ మీడియాను ముంచెత్తుతున్నాయి. ఇది అందరి ఆకాంక్ష. కేవలం ఆకాంక్షలతోనే జీవితాలు ఆనందమయం కావు. ఈ ఆకాంక్షలు కార్యరూపం ధరిస్తేనే జీవితాలు మారతాయి. ప్రజా స్వామ్యంలో ప్రజల ఆకాంక్షలకు గొప్ప విలువ వుంది. అవి ప్రజాభిప్రాయంగా మారితే రాజకీయం మారుతుంది. ప్రభుత్వాలు మారిపోతాయి. మరోమాటలో చెప్పాలంటే క్రియాశీలమూ, చైతన్యవంతమూ అయిన పౌరసమాజం వుంటేనే రాజకీయం సజావుగా సాగుతుంది.

ఈ కొత్త సంవత్సరానికి మరో అదనపు ప్రత్యేకత వుంది. ఇది ఎన్నికల సంవత్సరం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఎన్నికల పరీక్షలు రాయాల్సిన సంవత్సరం. తమ సమస్యల ప్రశ్న పత్రాలు ఇవ్వాల్సింది ప్రజలు. వాటికి స్పందించాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలది. పార్టీలు ఇచ్చే సమాధానాల ఆధారంగా తీర్పు ఇచ్చేది ప్రజలే. ఓటుతో తమ తలరాతను తామే రాసుకునే అవకాశం ప్రజాస్వామ్యం మనకు కల్పిస్తుంది. కొత్త సంవత్సరం మ తలరాతలను మార్చదు. మన ఓటే ఆ పని చేస్తుంది. మన దేశం బహుళత్వంగల దేశం. ఎంతో వైవిధ్యం గల దేశం. దీనికితోడు ఎన్నో ప్రజా సమస్యలున్న దేశం. అంటే ఈ వైవిధ్యంలో ఏకత్వాన్ని సాధించే రాజకీయం కావాలి. ప్రజల సమస్యలకు పరిష్కారాలు సాధించే విధానాలు గల రాజకీయం కావాలి. ప్రస్తుతం దేశంలో రాజకీయం తల్లకిందులుగా నడుస్తున్నది. మోదీ ప్రభుత్వం కేవలం ఓట్లు కోసం మత విద్వేషం చుట్టూ తిరుగుతున్నది. మెజారిటీ జాతీయ వాదం పేరుతో ఓట్లు దండుకోవాలని చూస్తున్నది. దానికోసం అయోధ్య రామాలయం ఒక అస్త్రం. ఇందులో భక్తికంటే ఓట్లు ద్యాసే స్పష్టంగా కనిపిస్తుంది. మత రాజకీయం కేవలం స్వమతం మీద ఆధారపడదు. అది పరమత విద్వేషం మీద ఆధారపడుతుంది. హిందూ రాష్ట్రాన్ని సాధిస్తామనడం అంటే మత రాజ్య స్థాపన. ఏ మత రాజ్యంలోనైనా ప్రజాస్వామ్యం వుండదు. రాజ్యాంగం వుండదు. పౌర స్వేచ్ఛ, హక్కులు వుండవు. మత రాజ్యంలో కేవలం మైనారిటీలకే కాదు మెజారిటీ ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కోల్పోతారు. మరోపక్క ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడానికి బదులు ఓట్ల కోసం ప్రలోభ రాజకీయం చేస్తున్నారు. ప్రజల్ని కేవలం లబ్ధిదారులుగా మారుస్తున్నారు. ఇది ప్రజా రాజకీయం కాదు. పార్టీలు ఓట్ల కోసం సృష్టించిన జనాకర్ష రాజకీయం.

నిజానికి దేశం మీద హక్కుదారులు ప్రజలు. ఈ దేశ సంపద మీద సహజ వనరుల మీద పూర్తి హక్కులు ప్రజలవే. మన రాజ్యాంగం ప్రజలందరికి జీవించే హక్కును కల్పించింది. అంటే నివాస హక్కు, ఆహార భద్రత, విద్య ఆరోగ్యం ప్రజలకు హక్కుగా దక్కాలి. ఈ దేశ సంపదలో సృష్టికర్తలైన శ్రామికులకు వాటా హక్కుగా దక్కాలి. ఇవి జరగాలంటే ప్రస్తుత రాజకీయం మారి తీరాలి. ఒక ప్రజా ప్రత్యామ్నాయ రాజకీయం వచ్చి తీరాలి. దారిదీపం ఫిబ్రవరి సంచికను 'ప్రత్యామ్నాయ ప్రజా రాజకీయ విధానాలు' సంచికగా రూపొందిస్తున్నాం. కొత్త సంవత్సరానికి జీవితాలను మార్చే కొత్తదారులను మనం అన్వేషించుకోవాలి. అందుకు ఈ ప్రత్యేక సంచిక దోహదం చేస్తుందని భావిస్తున్నాం.

**- డీవీవీఎస్ వర్మ**
**సంపాదకులు, 85006 78977**

# మోదీ హ్యాట్రిక్‌ను అడ్డుకోవడమెలా?



- యోగేంద్రయాదవ్

**నరేంద్ర మోదీ అజేయుడా? వరుసగా మూడోసారీ కేంద్రంలో అధికారాన్ని కైవసం చేసుకోకుండా భారతీయ జనతా పార్టీని నిలవరించడం సాధ్యం కాదా? ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మెజారిటీ సీట్లను గెలుచుకోకుండా 2024 సార్వత్రిక ఎన్నికలలో అధికార పక్షాన్ని విజయవంతంగా అడ్డుకునే వ్యూహం ఏదైనా ఉన్నదా? నరేంద్ర మోదీ హ్యాట్రిక్ సాధించడం ఖాయమనే నిశ్చిత అభిప్రాయాన్ని ఇప్పటికే చాలా మంది రాజకీయ పరిశీలకులు, స్వతంత్ర విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రతిపక్ష నాయకుల గురించి చెప్పేదేముంది ? వారితో వ్యక్తిగతంగా సంభాషించండి, తమ మనసులో మాట స్పష్టంగా చెబుతారు : మోదీ హ్యాట్రిక్ నిశ్చితం.**

ఈ వ్యక్తావ్యక్త అభిప్రాయాలతో నేను విభేదిస్తున్నాను. చివరి నిమిషంలో ఏదో అద్భుతం జరుగుతుందనే నమ్మకంతో కాదు సుమా. ఇటీవల మూడు ఉత్తరాది రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ తిరుగులేని విజయాన్ని, ప్రధాని మోదీకి అచంచల ప్రజాదరణ ఉందని ఒపీనియన్ పోల్స్‌లో వెల్లడవుతున్న విషయాన్ని కూడా నేనేమీ ఉపేక్షించడం లేదు. ప్రతిపక్ష కూటమి 'ఇండియా' ఘనవిజయం సాధించగలదని, బీజేపీకి ఘోర పరాజయం అనివార్యమని సునిశ్చితంగా విశ్వసించేందుకు ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలుగానీ, ప్రస్తుత సందర్భంలో వివిధ సర్వేలు వెల్లడిస్తున్న వాస్తవాలు గానీ మనకు ఏ మాత్రం ఆస్కారమివ్వడం లేదు. అదే సమయంలో, వచ్చే వేసవిలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో 273 సీట్లు (ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మెజారిటీ) స్వాయత్తం చేసుకోకుండా బీజేపీని అడ్డుకోవడం సాధ్యమే అన్న అంశాన్ని కూడా అవి కొట్టివేయడం లేదు. ప్రతిపక్షానికి ఒక వినూత్న వ్యూహం ఉండి, దానిని పటిష్ఠంగా అమలుపరిచేందుకు పరిపూర్ణ రాజకీయ సంకల్పం ఉంటే బీజేపీ మరోసారి కేంద్రంలో అధికారానికి రాకుండా అడ్డుకోవడం సుసాధ్యమేనని స్పష్టంగా చెప్పవచ్చు.

**ఆ వ్యూహం ఎలా ఉండాలి ?**

2024 సార్వత్రిక సమరాన్ని మూడు యుద్ధ క్షేత్రాలుగా పరిగణనలోకి తీసుకోవల్సి ఉన్నది. అవి: ప్రాథమిక లేదా ప్రధాన గౌణ లేదా అప్రధాన యుద్ధక్షేత్రం. ఈ మూడు విభిన్న యుద్ధ క్షేత్రాలలో విజయానికి అవసరమైన వేర్వేరు ఎత్తుగడలు రూపొందించుకోవడం తప్పనిసరి అన్నది ఈ వ్యూహపు మౌలిక భావన. తొలుత మూడో యుద్ధరంగంపై మన దృష్టిని సారిద్దాం. బీజేపీకి విజయావకాశాలు లేని, కనీసం పోటీ ప్రధానంగా ఉండే రెండు ప్రత్యర్థి పార్టీలలో ఒకటిగా లేని రాష్ట్రాలు ఈ మూడో యుద్ధ రంగం పరిధిలోకి వస్తాయి. ఇది దక్షిణ భారతావని అని మరి చెప్పనవసరం లేదు. కేరళ, తమిళ నాడు, ఆంధ్రప్రదేశ్. ఇప్పుడు వీటితోపాటు తెలంగాణను చేర్చ వచ్చు. పంజాబ్, కశ్మీర్, మిజోరం, నాగాలాండ్ కూడా. ఈ ఎనిమిది రాష్ట్రాలలో మొత్తం 120 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. 2019లో జాతీయ అధికార పక్షం ఈ 120లో కేవలం 6 స్థానాలను మాత్రమే గెలుచుకున్నది : తెలంగాణ నుంచి 4, పంజాబ్ నుంచి 2. పంజాబ్‌లో అకాలీదళ్‌తోనూ, తెలంగాణలో భారత్ రాష్ట్ర సమితితో లోపాయికారీ పొత్తు ఏమైనా ఉంటే తప్ప, సాధారణ పరిస్థితులలో ఈ 6 సీట్లనూ బీజేపీ 2024లో నిలబెట్టుకోవడం అసాధ్యం. 'ఇండియా' కూటమి ఈ రాష్ట్రాలలో అనుసరించాల్సిన ప్రధాన వ్యూహం బీజేపీని అడ్డుకోవడమే.

ప్రస్తుత ఆరు స్థానాలతోపాటు, బీజేపీ కైవసం చేసుకోదలిచిన తిరువనంత పురం(కేరళ), కన్యాకుమారి, కోయంబత్తూరు (తమిళనాడు) మొదలైన నియోజకవర్గాలలో అధికారపక్షాన్ని గట్టిగా ఎదుర్కో వడమే ప్రతిపక్ష కూటమి ప్రధాన వ్యూహంగా ఉండి తీరాలి. 'ఇండియా' భాగస్వామ్య పక్షాలు, పౌర సమాజమూ ఈ నియోజ కవర్గాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. అవసరమైతే భాగస్వామ్య పక్షాల మధ్య ఓట్ల బదిలీ జరగాలి. తద్వారా బీజేపీని ప్రస్తుత స్థానాలకు మాత్రమే పరిమితం చేయడం సుసాధ్యమవుతుంది. మరి కొంచెం కష్టపడితే, అదృష్టం కూడా కలిసి వస్తే ఈ ఎనిమిది రాష్ట్రాల యుద్ధ రంగంలో బీజేపీకి ఒక్క సీటు కూడా దక్కకుండా చేయవచ్చు.

223 లోక్‌సభా నియోజకవర్గాలు ఉన్న రాష్ట్రాలు రెండో యుద్ధరంగం పరిధిలోకి వస్తాయి. ఇవి ప్రధానంగా హిందీ భాషా ప్రాంతాలు. ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, రాజస్థాన్ మొదలైన రాష్ట్రాలలో బీజేపీ ఒక

ప్రబల శక్తిగా ఉన్నదని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వచ్చే మూడు నెలల వ్యవధిలో ఆ రాష్ట్రాలలో ఆ పార్టీని పరాజితను చేయడం చాలా చాలా కష్టమైన పని. వీటికితోడు గుజరాత్, అసోంతోపాటు త్రిపుర, అరుణాచల్‌ప్రదేశ్ లాంటి చిన్న రాష్ట్రాలు ఈ అప్రధాన యుద్ధ రంగంలోకే వస్తాయి. 2019 సార్వత్రిక సమరంలో ఈ 223 స్థానాలలో 190 బీజేపీకి కైవస మయ్యాయి. ఈ రాష్ట్రాలలో సాధించిన తిరుగులేని విజయాలే బీజేపీని అజేయ శక్తిగా నిలబెడుతున్నాయి. రాబోయే సార్వత్రిక ఎన్నికలలోనూ ఈ రాష్ట్రాలలో అధికార పక్షం ఘన విజయాలు సాధించడం ఖాయమని ప్రతీ ఒక్కరూ నిశ్చితంగా భావిస్తున్నారు. అయితే లోక్‌సభలో తన మెజారిటీని పూర్తిగా నిలబెట్టుకునేం దుకు ఈ రాష్ట్రాలలోని సీట్లన్నిటినీ బీజేపీ గెలుచు కోవల్సిన అవసరముందని కొందరు విశ్లేషకులు తెగేసి చెప్పుతు న్నారు. ఇదిగో, ఇక్కడే ప్రతిపక్ష కూటమికి జయపతాకను ఎగురవేసేం దుకు ఒక స్పష్టమైన అవకాశమున్నది.

**ఇండియా' కూటమి ఏమి చెయ్యాలి ?**

ఈ రాష్ట్రాలలో బీజేపీని 'ఓడించడానికి' ప్రయత్నించే బదులు ఆ పార్టీ స్థానాలను సాధ్యమైనంతగా తగ్గించేందుకు పూను కోవాలి. ఎంపిక చేసిన ప్రాంతాలలో బీజేపీ తన ప్రస్తుత సీట్లను మళ్లీ గెలుచుకోకుండా చూడాలి. గుజరాత్‌నే తీసుకోండి. ఆ రాష్ట్రం బీజేపీకి కంచుకోట. అక్కడ నాలుగు సీట్లను, ముఖ్యంగా ఆదివాసీ ప్రాంతాలలో కైవసం చేసుకోవడాన్ని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకోవాలి. రాజస్థాన్ ఆగ్నేయ ప్రాంతాలలో అర డజను సీట్లలో విజయం సాధించేందుకు కాంగ్రెస్‌కు అవకాశాలు వున్నాయి. భారతీయ ఆదివాసీ పార్టీతో పొత్తు పెట్టుకుంటే రాజ స్థాన్ దక్షిణ జిల్లాల్లో రెండు సీట్లను కాంగ్రెస్ గెలుచుకోగలదు. దళితుల–ఓబీసీల ప్రాబల్యమున్న మధ్యప్రదేశ్ ఉత్తర ప్రాంతాల లోను కాంగ్రెస్‌కు ఇటువంటి విజయాలు దక్కే అవకాశమున్నది. బీజేపీ ఓటు బ్యాంకును స్వాధీనం చేసుకోవలసిన అవసరం కాంగ్రెస్‌కు లేదు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలలో తనకు లభించిన ఓట్లను ఎటువంటి మినహాయింపు లేకుండా కాపాడుకోవలసిన అవసరం కాంగ్రెస్‌కు ఎంతైనా ఉన్నది. ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికల సమరం చాలా క్లిష్టంగా ఉంటుంది. అయినప్పటికీ సమాజ్ వాది పార్టీ–రాష్ట్రీయ లోక్‌దళ్–కాంగ్రెస్ కూటమి దాదాపు 25 సీట్లను లక్ష్యంగా పెట్టుకుని సంపూర్ణ విజయం సాధించవచ్చు.

సమస్త నియోజకవర్గాలలోనూ విజయం సాధించేందుకు ప్రయత్నించడం కాకుండా స్థానిక పార్టీలతో పొత్తులు, సామాజిక సంకీర్ణాలతో సాధ్యమైనన్ని సీట్లను కైవసం చేసుకునేందుకు ప్రతి పక్షం తన శక్తి సామర్థ్యాలను కేంద్రీకరించడమే ఈ వ్యూహం లోని కీలక అంశం. ఉత్తరప్రదేశ్‌లో మినహా ఇక్కడ కూడా ప్రతి పక్షాలు ఒక మహా కూటమిగా ఏర్పడవలసిన అవసరం లేదు. ఎంపిక చేసుకున్న స్థానిక పార్టీలతో పొత్తు పెట్టుకోవడమే ప్రస్తుత అవసరం. అలాంటి ఏర్పాటుతో ప్రస్తుతం బీజేపీ అధీనం లో వున్న 190 సీట్లలో 20 నుంచి 25 సీట్లను ప్రతిపక్షం తప్పక గెలుచుకోగలదు.

మిగిలిన 200 నియోజకవర్గాలే ప్రధాన, అసలైన యుద్ధ రంగం. 2019 సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ ఈ రెండు వందల నియోజకవర్గాలలో గణనీయమైన విజయాలు సాధించింది. అయితే ఇప్పుడు ఆ స్థానాలలో అది బలహీనపడింది. ఇందుకు పలు వేర్వేరు కారణాలు ఉన్నాయి. మహారాష్ట్ర, బిహార్‌లలో రాజకీయ శక్తుల పునరేకీకరణ జరిగింది. ఈ కొత్త శక్తులతో సరికొత్త పొత్తు పెట్టుకునేందుకు ప్రతిపక్ష 'ఇండియా' కూటమికి మంచి అవకాశమున్నది. 2019 అనంతరం అసెంబ్లీ ఎన్నికలు జరిగిన పశ్చిమ బెంగాల్, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటకలో పరాజయాలను బీజేపీ మూటగట్టుకున్నది. మోదీ ప్రభుత్వం తెచ్చిన కొత్త సాగు చట్టాలకు వ్యతిరేకంగా ప్రజ్వరిల్లిన రైతుల ఉద్యమంతో హర్యానా ప్రజల రాజకీయ వైఖరులు మారాయి. ఒడిషాలో బిజూ జనతాదళ్ 2019లో వలే లోక్‌సభ సీట్లను ఈ సారి బీజేపీకి కానుకగా ఇచ్చే అవకాశం లేదు. ఈ ప్రధాన యుద్ధరంగ రాష్ట్రాల జాబితాలో మణిపూర్, మేఘాలయతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలు లద్దాఖ్, లక్షదీవులు, పుదుచ్చేరి కూడా ఉన్నాయి. ఈ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోనే 2024 సార్వత్రిక ఎన్నికల అసలు సమరం జరగనున్నది. గత సార్వత్రిక ఎన్నికలలో ఈ 200 సీట్లలో 107ను (మిత్రపక్షాలు గెలుచుకున్న వాటిని కూడా కలుపుకుంటే మొత్తం 147) బీజేపీ స్వాధీనం చేసుకున్నది. ఈ సీట్లు అన్నిటినీ ప్రతిపక్ష కూటమి 'ఇండియా' లక్ష్యం కావాలి. తద్వారా బీజేపీని గణనీయంగా దెబ్బ తీయాలి. అయితే ఇందుకు ఈ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 'ఇండియా' కూటమి ఒక పటిష్ఠ రాజకీయ పక్షంగా పని చేయవలసిన అవసరమున్నది.

భాగస్వామ్య పక్షాలు అన్నీ కలసికట్టుగా పోరాడని పక్షంలో 'ఇండియా'కు విజయం దక్కదు. సమైక్యంగా పోరాడగలిగితే ఈ ప్రధాన యుద్ధ రంగంలో బీజేపీ 25 నుంచి 35 సీట్లను ఖాయంగా కోల్పోతుంది. ఇదే జరిగితే లోక్‌సభలో బీజేపీ ప్రస్తుత సంఖ్యా బలాన్ని 40 నుంచి 60 సీట్ల దాకా తగ్గించడం సాధ్యమవుతుంది. ఇదొక పెనుమార్పుకు సాధ్యమవుతుంది. ఇదొక పెనుమార్పుకు కారణమవుతుంది. దేశ రాజకీయ వాతావరణాన్ని పూర్తిగా మార్చివేస్తుంది.


మరి ఇటువంటి మార్పు నిజంగా సంభవిస్తుందా? సంభవించడం సాధ్యమవుతుందా? ఈ ప్రశ్నలకు సమాధానాలు 'ఇండియా' కూటమి, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ నేను విపులీకరించిన వ్యూహాన్ని పటిష్ఠంగా అమలుపరుస్తుందా అన్నదానిపై ఆధారపడివున్నాయి. ❑

# రామ మందిరం సరే,
# రామరాజ్యం ఎక్కడ ?



-ఎ.కృష్ణారావు

బాబ్రీ మసీదు కట్టడం నేలమట్టం కావడాన్ని నేను ప్రత్యక్షంగా చూశాను. ఈ సంఘటన సంభవించిన డిసెంబర్ 6, 1992 ముందురోజు రామ జన్మభూమి మీడియా సెంటర్ డైరెక్టర్ రమాశంకర్ అగ్నిహోత్రిని కలిసినప్పుడు ఆ కట్టడాన్ని కూల్చి వేయనున్నారని ఆయన సూచనప్రాయం గానైనా వెల్లడించలేదు. (అగ్నిహోత్రి సాధారణ వ్యక్తి కాదు. ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ ఆర్ఎస్ సుదర్శన్‌ను స్వయం సేవక్‌గా మార్చిన వ్యక్తి) ఆ మరునాడు అద్వానీ, మురళీమనోహర్ జోషి, ఉమాభారతి, వినయ్ కతియార్, సాధ్వీ రితంబర తదితరులు ఉద్వేగ పూరితంగా, ఉద్రిక్తభరితంగా ప్రసంగాలు చేస్తుండగా కర సేవకులు బాబ్రీ కట్టడాన్ని కూల్చివేశారు. గుమ్మటాలపై ఎక్కిన వారు వాటిని కూలుస్తూనే తాము కూడా శిథిలాలతో పాటూ నేల కూలిపోతున్నా ఆ భావోద్వేగంలో వారు లెక్క చేయలేదు. ఆ కట్టడం కూల్చి వేసిన స్థలంలోనే మూడు దశాబ్దాల తర్వాత శ్రీరాముడి మందిరాన్ని ప్రారంభిస్తారని నాడు ఎవరనుకున్నారు? ఆ బీభత్స దృశ్యాలూ ఇంకా కళ్ల ముందు కదలాడుతున్నాయి. దేశప్రజలకు ఇవాళ అయోధ్యలో శ్రీరాముడి మందిరం మాత్రమే కనపడవచ్చు. కాని దాని వెనుక ఉన్న చరిత్ర, ఆ చరిత్రలో జరిగిన విధ్వంసం, వందలాది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం గురించి ఇప్పుడెక్కడా చర్చ జరగడం లేదు.



రామ మందిరం కోసం నాడు బీజేపీ నేత అద్వాణీ రథయాత్ర జరిపారు. ఈ రథయాత్ర మూలంగా బీజేపీ రాజకీయంగా బల పడింది. 1989 ఎన్నికలతో పోలిస్తే 1991లో బీజేపీ దేశ వ్యాప్తంగా తన ఓట్ల శాతాన్ని రెట్టింపు చేసుకున్నది. పార్లమెంట్‌లో రెండవ అతిపెద్ద పార్టీగా ఎదిగింది. ఇవాళ అదే రామమందిరం నిర్మాణం ఘనతను తనకు ఆపాదించుకున్న నరేంద్ర మోదీ ఈ మందిరం ఆధారంగా 2024లో మూడోసారి గెలిచేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. శ్రీరాముడు, రామ మందిరం బీజేపీ రాజకీయ ఎజెండా మాత్రమేనని ఇవాళ అందరికీ తెలుసు. రామ మందిరాన్ని నిర్మించింది ట్రస్ట్ అయితే దాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవాలని బీజేపీ ఎందుకు భావిస్తోంది ? రథయాత్ర ప్రారంభించి, బాబ్రీ మసీదు కూల్చి వేతను ప్రత్యక్షంగా తిలకించిన అద్వాణీకి ఇవాళ ఈ మందిర ప్రారంభోత్సవ ఘట్టంలో ఎక్కడా ప్రాధాన్యత లభించడం లేదు. ప్రధాని మోదీయే ఆ మందిరాన్ని ప్రారంభిస్తున్నారు. మందిర నిర్మాణాన్ని దేశ చరిత్రలో ఒక బృహత్తర ఘట్టంగా జరుగుతోన్న ప్రచారానికి ఆయనే సారథ్యం వహిస్తున్నారు. గత వారం బీజేపీ పదాధికారుల సమావేశంలో ఆలయ ప్రారంభోత్సవమే ప్రధాన ఎజెండాగా చర్చించారు. ఈ ఆలయ నిర్మాణంలో బీజేపీ ఎలాంటి కీలకపాత్ర పోషించిందీ ఇంటింటికి వెళ్లి వివరించమని మోదీ ఆదేశించారు. రామ మందిరం ప్రారంభోత్సవం సంద ర్భంగా ఆ రోజు ప్రతి భారతీయుడి ఇంటిలో మరో దీపావళి జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళ వారం మళ్లీ పదాధికారుల సమావేశాన్ని నిర్వహించి జనవరి 22 తర్వాత అయోధ్యలో రామమందిర ప్రారంభం తర్వాత పెద్ద ఎత్తున మందిర్ దర్శన్ అభియాన్‌ను ఎలా కొనసాగించాలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా నిర్ణయించారు. మందిర ప్రారంభాన్ని దేశమంతటా ప్రత్యక్ష ప్రసారం ద్వారా కోట్లాది ప్రజలు తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి కనీసం రెండున్నర కోట్ల మందిని అయోధ్యకు రప్పించి దర్శనం చేయించేందుకు సన్నాహాలు పూర్తయ్యాయి.

ఒకప్పుడు మతాన్ని రాజకీయాలకు ఉపయోగించుకోవడంపై దేశంలో అభ్యంతరాలు వ్యక్తమయ్యేవి. రానురానూ మతాన్ని ఉప యోగించుకోవడం సర్వసాధారణమైంది. కర్ణాటక ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రి స్వయంగా 'జై బజరంగ్ బలీ' అని నినాదాలు చేశారు. అధికారంలో ఉన్న పార్టీ బాహాటంగా మతాన్ని ఉపయోగించుకునేందుకు రామమందిర ప్రారంభం ఇప్పుడు స్పష్టంగా ఉపయోగపడుతోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో పుల్వామా, బాలాకోట్ మోదీకి ఆయుధాలుగా మారితే ఈ

లోక్‌సభ ఎన్నికల్లో రామమందిరం ప్రధానాస్త్రంగా ఉపయోగప డుతుందనడంలో సందేహం లేదు. ప్రజల్లో నెలకొన్న భక్తి విశ్వాసాలను ఒక రాజకీయ పార్టీ తన ప్రయోజనాలకు ఉపయో గించుకోవడం ఎంతవరకు సబబు? ఇది ప్రజాస్వామ్యంలో సరైనదేనా? దీనిపై న్యాయస్థానాలు కానీ, ఎన్నికల కమిషన్ కానీ కలుగచేసుకునే అవకాశాలు లేవా? అయినా ఇవాళ వ్యవస్థలు స్వతంత్రంగా, విచక్షణాయుతంగా నిర్ణయం తీసుకునే పరిస్థితి ఎక్కడిది? బాల్యంలో ఆంజనేయుడి విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేసేవారం. హనుమంతుడి కథలు విని నడుముకు తోకలాగా ఏదో గుడ్డ తగిలించుకుని ఆడుకునేవారం. రాముడిలా చీపురు పుల్లలతో బాణాలు వేసేవారం. ఎన్టీఆర్ శ్రీరాముడి వేషంతో రాక్షసులను వధిస్తుంటే ఉత్కంఠతో చూసేవారం. సీతా రామ కల్యాణం సినిమా టిక్కెట్ల కోసం కిక్కిరిసిన లైన్లలో నిలుచున్న దృశ్యం ఇంకా గుర్తుంది. లైబ్రరీలో బాలల బొమ్మల రామా యణం ఆసక్తిగా చదువుకునేవారం. పెద్దలు రామకోటి రాస్తుంటే చూసేవారం. శ్రీరామ నీవే కలవు అన్న అక్షరాలతో అమ్మ నాడు రాసిన ఉత్తరాలు ఇంకా ఉన్నాయి. కాని నాడెవరూ శ్రీరాముడిని రాజకీయాలకు ఉపయోగించుకోలేదు. సీత అగ్ని ప్రవేశం, శంబూక వధ లాంటిపై ప్రశ్నలు రేగినప్పటికీ ఒక కథగా రామా యణం ఎప్పుడూ ఆసక్తిగానే ఉంటుంది.

> **విన్నంత వరకూ, చదివినంత వరకూ శ్రీరాముడు స్థితప్రజ్ఞుడు. సత్యవాక్పరిపాలకుడు. మర్యాద పురుషోత్తముడు. 'విభీషణుడు శరణు కోరితే మీరు అతడికి లంకనే ఇచ్చేశారు. రావణుడు కూడా లొంగిపోయి ఉంటే ఏం చేసేవారు?' అని రాముడిని సుగ్రీవుడు అడుగుతాడు. 'రావణుడే కనుక లొంగిపోతే అతడికి అయోధ్యను కానుకగా ఇచ్చి నా సోదరులతో కలిసి అడవుల్లో నివసించే వాడిని' అని రాముడు జవాబిస్తాడు. నాటి రాముడు అధికారానికి, పదవులకు అతీతుడు. తృణప్రాయంగా పదవిని వదులుకున్నవాడు. కాని రాముడిని రాజకీయాలకు ఉపయోగించుకుంటున్న నేటి బీజేపీ నేతలు ఎటువంటివారు?**

రామరాజ్యం సుపరిపాలనకు సంకేతం అంటారు. రాముడు వేలాది సంవత్సరాలపాటు చేసిన పాలనలో వృద్ధులు యువకుల కు అంత్యక్రియలు జరపాల్సిన అవసరం లేదు అని వాల్మీకి యుద్ధకాండలో రామరాజ్యాన్ని వర్ణించాడు. అంటే అకాల మర ణాలు ఉండేవి కావని అర్థం. రామరాజ్యం ఎలా ఉండేది? సామాజిక సామరస్యం, న్యాయం వెల్లివిరిసేవి. ఎలాంటి రోగా లు, బాధలు లేకుండా ప్రజలు జీవించేవారు. అసలు ప్రజలు దానధర్మాలపై ఆధారపడాల్సిన దుస్థితి ఉండేది కాదు. అందరూ సమాన హక్కులతో జీవించేవారు. అందరూ విద్యావంతులై ఉండే వారు. శాంతిభద్రతల పరిస్థితి కానీ, అంతర్గత కల్లోలాలు కానీ, ఇతర రాజ్యాల నుంచి సమస్యలు కానీ ఉండేవి కాదు. ప్రజల సంక్షేమం తప్ప రాముడికి వేరేది పట్టేది కాదు. రాజుగా తాను విఫలమైతే అంతకంటే శాపం మరొకటి లేదనుకునేవాడు. ఆదాయం ఎప్పుడూ వ్యయంకంటే ఎక్కువగా ఉండేది. పన్నులు ప్రజలకు ఏ మాత్రం భారం అయ్యేవి కాదు. అంతా సుభిక్షంగా జీవించేవారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా విధానాల రూప కల్పన జరిగేది. రాజ్యం భూలోక వైకుంఠంలా ఉండేదని వాల్మీకి ఒక్క మాటలో వర్ణించారు.

మహాత్మాగాంధీ కూడా శ్రీరాముడు చారిత్రక పురుషుడా కాదా అన్నది పట్టించుకోలేదు. ఆయన రామరాజ్య భావనపైనే దృష్టి కేంద్రీకరించారు. రాజుకూ, పేదకూ సమాన హక్కులున్నాయని రామాయణం చెప్పిందని గాంధీ అన్నారు. '1921లో సరయూ నది ఒడ్డున సాధువులతో గాంధీ రామరాజ్యం గురించి మాట్లా డారు. రాముడు సీతను ప్రేమించినట్లుగా, మనం బలహీనుల్ని కాపాడాలి. కేవలం మన రక్షణ కోసమే రాముడిని ఆరాధించడం పాపం అని స్పష్టీకరించారు' అని ఆర్ఎస్ఎస్ నేత రామ్‌మాధవ్ కూడా ఒక రచనలో పేర్కొన్నారు. మరి ఇప్పుడెలాంటి రాజ్యం ఉన్నది? ఇవాళ ఒక రాజకీయ పార్టీ మతాన్నే తన అస్తిత్వంగా మార్చుకుంది.. నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, పేదరికం, రైతుల ఆత్మహత్యలు, అధిక ధరలు, బలహీనుల అణచివేతలు, స్త్రీలపై అత్యాచారాలు, కొద్దిమంది సంపన్నులకు దేశ సంపదను ధారాదత్తం చేయడం, కోట్లాది ప్రజాధనాన్ని కొల్లగొట్టిన వారిని రక్షించడం. ప్రజలపై భారీ అప్పులు మోపడం, నేతలు అధికారం సంపాదించిన కొద్ది సంవత్సరాల్లోనే వేల కోట్ల ఆస్తులు పోగేయడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అభాగ్యులు సరైన చికిత్స అందకుండా మరణించడం ఎల్లెడలా కనిపిస్తున్నాయి. కరోనా సమయంలో గంగానదిలో శవాలు తేలిన, అభాగ్యులు మైళ్ల కొద్దీ నడుస్తూ, రైలు పట్టాలపై మరణించిన దేశమిది.

ఈ దేశంలో 80 కోట్లమందికి ఉచితంగా ఆహారధాన్యాలు ఇస్తున్నానని ఈ దేశాధినేత చెప్పుకుంటారు. ఇందిరాగాంధీ 'గరీబీ హటావో' అంటే మోదీ 'గరీబ్ కల్యాణ్ అన్న యోజన' అంటారు. ఏం తేడా?

ఇక ప్రజల హక్కుల గురించి ఏమి మాట్లాడగలం? పార్లమెంట్‌లోనే ప్రజా ప్రతినిధుల్ని బయటకు గెంటేసి ఇష్టం వచ్చినట్లు బిల్లులను ఆమోదిస్తున్నారు. వాల్మీకి ఒక కవిగా రామరాజ్యం గురించి కవితా గానం చేసి ఉండవచ్చు. కాని నేడు నేతలు అబద్ధాలతో, బూటకపు ప్రచారంలో నిత్యం నిమగ్నమయి ఉన్నారు. ప్రచారం లేకుండా వారికి పూటగడవని పరిస్థితి ఏర్పడింది. భారత రాజకీయాలు ఇప్పుడు సంధిదశలో ఉన్నాయి. అయోధ్యలో శ్రీరాముడి మందిరం ప్రారంభాన్ని వ్యతిరేకించే భారతీయులు తక్కువే కావచ్చు కానీ రామరాజ్యం ఏదీ, ఎక్కడ అని ప్రశ్నించాల్సిన తరుణం ఆసన్నమైంది. ❑

# మలుపు తిరిగిన రామాలయ వివాదం

**నలుగురు శంకరాచార్యులూ దూరం**



- ఎం.కోటేశ్వరరావు

మొన్న సీపీఎం నేత సీతారాం ఏచూరి, నిన్న కాంగ్రెస్ నేతలు మల్లిఖార్జున ఖర్గే, సోనియా గాంధీ అయోధ్య రామాలయ ప్రతిష్టకు రావటం లేదని చెప్పగానే బీజేపీ నేతలు అసలు వారి డీఎన్ఏలోనే హిందూ వ్యతిరేకత ఉందంటూ ధ్వజమెత్తారు. పెద్ద ఎత్తున సామాజిక మాధ్యమాల్లో ప్రచారదాడి చేస్తున్నారు. రథయాత్ర నిర్వహించిన ఎల్‌కే అద్వానీని ఆ ఛాయలకే రావద్దని చెప్పిన పెద్దలు ఓటు బాంకు రాజకీయం కాకపోతే వారి డీఎన్ఏ గురించి ముందే తెలిసినపుడు అసలు ఆహ్వానాలు పంపటం ఎందుకు ? కమ్యూనిస్టులు దేవాలయాలు, మసీదులు, చర్చ్‌ల ప్రారంభాలకు రారని అందరికీ తెలుసు. వారు లేదా కాంగ్రెస్ నేతలు గానీ బీజేపీ మత రాజకీయాలను విమర్శించటం ఇప్పుడు కొత్తగా చేసింది కాదు. హిందూమతానికి భాష్యకారులుగా, పీఠాధిపతులుగా ఉన్న నలుగురు శంకరాచార్యులూ అయోధ్య వెళ్లటం లేదన్న సమాచారం ఇది రాసిన సమయానికి ఉంది. చివరి నిమిషంలో వారు మనసు మార్చుకుంటారో లేక ఏం చేస్తారన్నది పెద్ద సమస్య కాదు. పూరీ శంకరాచార్య నిశ్చలానంద, ఉత్తరాఖండ్ జ్యోతిర్ మఠం శంకరాచార్య అవిముక్తేశ్వరానంద తాము రావటం లేదని తమ కారణాలను వివరిస్తూ చెప్పారు. ద్వారకా పీఠం అధిపతి స్వామి సదానంద సరస్వతి, శృంగేరి పీఠాధిపతి భారతీతీర్ధ రామాలయ ప్రతిష్టకు ఆశీర్వచనాలు చెప్పారే తప్ప వస్తున్నదీ లేనిదీ ఇంత వరకు ప్రకటించ లేదు. ఆలయ నిర్మాణం పూర్తి కానందున నలుగురమూ అయోధ్య వెళ్లటం లేదని అవిముక్తేశ్వరానంద చెప్పిన మాటల మీద వారు మౌనంగా ఉన్నారు. అందరి తరపున మాట్లాడేందుకు అనుమతించలేదని ఎవరూ ఇంత వరకు ప్రకటించలేదు. హిందూ శాస్త్రాలకు వ్యతిరేకంగా అసంపూర్తి నిర్మాణంలో ఉన్న దేవాలయాన్ని ప్రారంభించటం తగదని అవిముక్తేశ్వరానంద ఎక్స్‌లో ఒక ప్రకటన చేశారు. తమ చర్యలను మోడీ వ్యతిరేకమైనవిగా చూడరాదని, శాస్త్ర వ్యతిరేకులుగా మారటం ఇష్టం లేకనే తాము ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు స్పష్టం చేశారు. మేమెందుకు వెళ్లటం లేదు ? మాకు ద్వేషం ఉండి కాదు. శాస్త్ర విధిని పాటించటం, పాటించేట్లు చూడటం శంకరాచార్యుల బాధ్యత. ఇక్కడ శాస్త్ర విధిని విస్మరించారు. ఆలయ నిర్మాణం ఇంకా పూర్తిగాక ముందే ప్రాణ ప్రతిష్టకు పూనుకోవటం ఇక్కడ పెద్ద సమస్య. దీన్ని మేం చెబితే మమ్మల్ని మోడీ వ్యతిరేకులని పిలుస్తున్నారు. ఇక్కడ మోడీ వ్యతిరేకత ఏముంది అని అవిముక్తేశ్వరానంద ప్రశ్నించారు. రామాలయాన్ని రాజకీయం చేస్తున్నారని రాజకీయ పార్టీలు చెబితే, శాస్త్రవిరుద్ధమని శంకరాచార్యులు భావిస్తున్నారు. రాజకీయ నేతల డీఎన్ఏల గురించి ధ్వజమెత్తుతున్న బీజేపీ శంకరాచార్యుల డీఎన్ఏల గురించి ప్రశ్నించగలదా ? వారిని అనుసరించే వారి మనో భావాలను గాయపరచి తట్టుకోగలదా ?

"మోడీ గారు విగ్రహాన్ని తాకి ప్రారంభోత్సవం చేస్తుంటే నేను అక్కడ ఉండి చేసేదేమిటి ? నేను లేచి నిలబడి చప్పట్లు కొట్టాలా ? నాకు పదవి అవసరం లేదు. ఇప్పటికే నేను పెద్ద స్థితిలో ఉన్నాను. నాకు పేరు అవసరం లేదు. శంకరాచార్యులు అక్కడికి వెళ్లి చేసేదేమిటి ఇది అహంకారం కాదు. నేనున్న స్థానపు గౌరవం గురించి నాకు తెలుసు. అందుకే నేను అక్కడికి వెళ్లటం లేదు. నాకు ఆహ్వానం వచ్చింది. దానిలో నాతోపాటు ఒకరిని తీసుకురావచ్చు అని ఉంది. నాతోపాటు ఒకరిని నేనెందుకు తీసుకుపోవాలి" అని ఒక వీడియోలో స్వామి నిశ్చలానంద ప్రశ్నించారు. మత వ్యవహారాల్లో మోడీ జోక్యం చేసుకుంటున్నా రని, తనకు అయోధ్య అంటే వ్యతిరేకత లేదని కూడా చెప్పారు. విశ్వ హిందూ పరిషత్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు, శ్రీరామ జన్మభూమి తీర్ధ క్షేత్ర ట్రస్ట్(రామాలయ నిర్మాణ, నిర్వహణ) ప్రధాన కార్యదర్శి చంపత్ రారు అమర్ ఉజాలా పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ రామాలయం వైష్ణవులకు చెందిన రామానంద సాంప్రదాయానికి చెందింది తప్ప సన్యాసులది లేదా శైవులదీ కాదు అని చెప్పారు. ఆది శంకరుడు శైవుడు. ఆయన స్థాపించిన నాలుగు శంకర మఠాధిపతులూ శైవులే. అయితే వారు విష్ణుమూర్తిని కూడా అంగీకరిస్తారు. శైవుల అభ్యంతరాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్న ధ్వని చంపత్ రారులో వినిపించింది. రారు ప్రకటన తరువాత అవిముక్తేశ్వరానంద స్పందించారు. "ధర్మ శాస్త్రాల ప్రకారమే జరగాలని మేమూ, జనం కూడా కోరుకుంటున్నారు. రాముడు మనకు చెప్పిన పాప పుణ్యాలేమిటో మనకు తెలిసినవే. రామాలయ ప్రతిష్టకు రావటం లేదన్న మా నిర్ణయం ఏమిటో బహిర్గతమైంది. అక్కడకు శంకరాచార్యులు రానవసరం లేదని చంపత్ రారు చెబుతున్నారు. ఎందుకంటే ఆ స్థలం రామానంద సంప్రదాయానికి చెందినది అంటున్నారు. ఇక్కడ సమస్య ఏమంటే రామాలయం వైష్ణవులదే అయితే చంపత్ రారు అక్క డెందుకు ఉన్నారు ? **మిగతా 10వ పేజీలో**

# సైద్ధాంతిక పోరాటమే
# కాంగ్రెస్‌కు శరణ్యం



- అశుతోష్

అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన ఆహ్వానాన్ని తిరస్కరించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించడాన్ని బట్టి బీజేపీ, సంఘ్ పరివార్లతో సుదీర్ఘ సైద్ధాంతిక పోరాటానికి ఆ పార్టీ సిద్ధమవుతోందన్న విషయం స్పష్టం అవుతోంది. రామ మందిరం కోసం సాగిన ఆందోళన దేశ రాజకీయాల్లో పెనుమార్పులు తెచ్చింది. రామమందిర అంశం భారత రాజకీయాల ప్రాతిపదికను మార్చింది. జాతిపిత మహాత్మా గాంధీ, ఆయన అడుగుజాడల్లో నడిచిన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్‌లు కాంగ్రెస్‌ను హిందువుల పార్టీగా ఎన్నడూ అంగీకరించలేదు. ముస్లిం లీగ్ వ్యవస్థాపకుడు మహ్మద్ ఆలీ జిన్నా ఆ రోజుల్లో ఎప్పుడైనా ఆ మాట అంటే తిరస్కరించేవారు. కాంగ్రెస్ బహుళత్వానికి, లౌకికతత్వానికి, భిన్నత్వంలో ఏకత్వానికీ ప్రతీక అని గాంధీ, నెహ్రూ వాదించేవారు. ప్రతి భారతీయుడు మతాలకతీతంగా అందరికీ కాంగ్రెస్‌లో ప్రాతినిధ్యం ఉందని స్పష్టం చేసేవారు. అందుకు భిన్నంగా వినాయక్ వీర్ సావర్కార్ నేతృంలో హిందుత్వ దళం భారత్ హిందూదేశమనీ, హిందువులు మెజారిటీ వర్గమనీ, ఇతరులు వారికి లోబడి జీవించాలని వాదించేవారు. ఈ వాదాన్ని గాంధీజీ తీవ్రంగా వ్యతిరేకించారు. ఆయన హత్యానంతరం దేశ పాలనా పగ్గాలను చేపట్టిన నెహ్రూ కూడా ఈ సిద్ధాంతంలో ఎన్నడూ రాజీ పడలేదు. కాంగ్రెస్‌లో ఒక వర్గం హిందుత్వ భావాలను సమర్థిస్తున్నట్టు, దేశం హిందూ రాష్ట్రంగా పరిగణిస్తున్నట్టు ఆయనకు తెలుసు. అయితే, కాంగ్రెస్ ఈ వర్గం వాదన బలపడకుండా గాంధీ, నెహ్రూ చూశారు. తర్వాత కాంగ్రెస్ హిందుత్వ వాదాన్ని పట్టించుకోలేదు. నెహ్రూ తర్వాత హిందుత్వ రాజకీయాలు ఊపందుకున్నాయి. ఇది కాకతాళీయం కావచ్చు. ఇందిరాగాంధీ మితవాద, అతివాదాల మధ్య ఊగిసలాడిన సంగతి తెలిసిందే. 1960వ దశకంలో ఆమె వామపక్ష మేధావుల నుంచి ఉత్తేజం పొందారు. 1977లో ఓటమి తర్వాత ఆమె మితవాదం వైపు అడుగులు వేశారు. హిందూత్వాన్ని వ్యతిరేకించలేదు. ఆమె తర్వాత ఆమె కుమారుడు రాజీవ్‌గాంధీ 1980వ దశకంలో తమిళనాడులోని మీనాక్షీపురంలో సామూహిక మతాంతీకరణ ఘటన తర్వాత విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో రామ మందిరం ఉద్యమాన్ని సంఘ్ పరివార్ ప్రారంభించింది. ఈ ఉద్యమాన్ని సమర్థించాలా? లేక వ్యతిరేకించాలా ? అనే విషయమై కాంగ్రెస్ సందిగ్ధంలో పడింది. ఈ గందరగోళంలో రామజన్మ భూమి ప్రాంతంలో తాత్కాలిక ఆలయం తలుపులు తెరవాలని నిర్ణయించింది. రామాలయం నిర్మాణం కోసం శిలాన్యాస్ కార్యక్రమాన్ని అనుమతించాలని నిర్ణయించింది.

ఈ గందరగోళ పరిస్థితుల్లో ఆ తర్వాత ప్రధానమంత్రి పదవిని చేపట్టిన పీవీ నరసింహారావు అయోధ్యలో బాబ్రీ మసీదును రక్షించలేకపోయారు. 1992 డిసెంబర్ 6వ తేదీన బాబ్రీ మసీదును కరసేవకులు కూల్చివేశారు. సరిగ్గా ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోవడం ప్రారంభమైంది. స్వంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల బలాన్ని కోల్పోయింది. మరోవంక బీజేపీ బలాన్ని పుంజుకోవడం ప్రారంభించింది. అప్పట్లో పార్లమెంటులో ఇద్దరు మాత్రమే ఎంపీలు ఉన్న పార్టీ 2014లో స్వంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం నరేంద్రమోడీ నేతృత్వంలో బాగా పుంజుకుంది. ఆర్ఎస్ఎస్‌లో ఆయన పేరొందిన రాజకీయ వేత్త. బీజేపీ అధికారంలోకి రావాలంటే వాజ్‌పేయి, అద్వానీల మాదిరి కాకుండా హిందుత్వ ఒక్కటే మార్గమని మోడీకి తెలుసు. ఆయన రాజకీయాల్లో ఊగిసలాట లేదు. మరోవంక 2014 ఓటమి తర్వాత కాంగ్రెస్ హిందుత్వను సమర్థించాలా లేదా అనే డైలమాలో పడింది. మోడీ నేతృత్వంలో బీజేపీ హిందూ అనుకూల పార్టీగా పూర్తిగా మారింది. ముస్లింలను పక్కకునెట్టింది. మోడీ మంత్రివర్గంలో ముస్లిం ప్రతినిధి ఎవరూ లేరు. పార్లమెంటులో ఆ పార్టీ తరపున ముస్లిం ఎంపీ ఎవరూ లేరు.

కాంగ్రెస్‌లో ఒక వర్గం కాంగ్రెస్ మోడీ మార్గాన్ని అనుసరించాలనీ, హిందూ పార్టీగా చలామణి కావాలని డిమాండ్ చేస్తోంది. ఉదాహరణకు మధ్యప్రదేశ్‌లో కమలనాథ్, చత్తీస్‌ఘడ్‌లో భూపేష్ భగేల్ ఆ మార్గాన్ని తీసుకున్నారు. అయితే, రాహుల్ మాత్రం హిందుత్వ ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్ విధానం కాదని స్పష్టం చేశారు. ప్రజాభిమానాన్ని తిరిగి చూరగొనేందుకు కాంగ్రెస్ ఆర్.ఎస్.ఎస్, హిందుత్వ శక్తులతో పోరాడాలన్న పంథాని తీసుకున్నారు. హిందూయిజం అన్ని వర్గాలను అక్కున చేర్చుకుంటుందనీ, ఏ ఒక్కరినీ ద్వేషించదని ఆయన ప్రచారం చేయడం మొదలు పెట్టారు. మరోవంక ఆర్.ఎస్.ఎస్ హిందుత్వ విధానాలు సమాజంలో కొన్ని వర్గాలను దూరంగా పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయంటూ ధ్వజమెత్తడం మొదలుపెట్టారు. మైనారిటీలపై ఆ రెండు సంస్థలు విషం చిమ్ముతున్నాయంటూ

విమర్శించడం మొదలు పెట్టారు. హిందుయిజానికి కాంగ్రెస్ వ్యతిరేకం కాదనీ, ఆర్.ఎస్.ఎస్, హిందుత్వ సిద్ధాంతాలను మాత్రమే వ్యతిరేకిస్తోందని వివరణ ఇవ్వడం మొదలు పెట్టారు. రామ మందిరం ఉద్యమం రాజకీయ ప్రచారోద్యమంగా సాగింది. లౌకికవాదాన్ని అప్రదిష్టపాలు చేయడానికి, హిందువుల విశ్వాసాన్ని చూరగొనడానికి, కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ప్రారంభమైంది. బాబ్రీ మసీదు కూల్చివేతతో ముస్లింలు ఇక ఎంత మాత్రం సమానత్వం కోసం పోరాడలేరన్న భావనవ్యాప్తి చేశారు. భారతీయ హిందువులు మాత్రమే పాలించ గలరనే అభిప్రాయం నెలకొనేట్టు చేశారు. గాంధీ, నెహ్రూ, పటేల్, సుభాస్ చంద్రబోస్, డాక్టర్ అంబేద్కర్ వంటి లౌకిక వాద నాయకుల సిద్ధాంతాలస్థానే హిందుత్వ సిద్ధాంతాలను అమలులో పెట్టేందుకు ఆర్.ఎస్.ఎస్. హిందుత్వ పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. అయితే, సెక్యులరిస్టుల వాదన ఏమంటే రామాలయాన్నీ, హిందువులను ఎవరూ వ్యతిరేకించడం లేదు. అవి ఈ దేశంలో అంతర్భాగం.రాముడంటే ఆర్.ఎస్.ఎస్ విశ్వసిస్తున్న రాముడు కాదని గాంధీజీ 1946లో పత్రికలో రాశారు. నా రాముడు, రాముడు మన ప్రార్థనల్లో ఉన్నాడని పేర్కొన్నారు. యంగ్ ఇండియా పత్రికలో మహాత్ముడు రామరాజ్యం గురించి నిర్వచనం ఇచ్చాడు. రామరాజ్యం అంటే హిందూ రాజ్యం కాదు. సమాజంలో అన్ని వర్గాలకూ న్యాయం జరిగేట్టు చూడటమే రామ రాజ్యం అని అన్నారు. రామరాజ్యం ఆదర్శవంతమైన రాజ్యం. ఎవరిపట్ల వివక్ష, ద్వేషం ఉండని రాజ్యం. కుల, మత, వర్గ, ప్రాంత భేదం లేకుండా అన్ని వర్గాలనూ సమానంగా చూడటమే రామ రాజ్యం లక్ష్యం. నెహ్రూ ఓ సందర్భంలో అన్నదేమంటే, హిందుత్వం గురించి నిర్వచించమని తనను అడిగితే, అహింసా మార్గం ద్వారా సత్యాన్వేషణే అని అన్నారు. దేవుడంటే విశ్వాసం లేని వారు కూడా హిందువే. సత్యమే మతం, సత్యమే దేవుడని విశ్వసించే మతం హిందూయిజమని నెహ్రూ అన్నారు. హిందుత్వం అనేది మనిషి అంతరంగానికి సంబంధించినది. రాజకీయం ఎంతమాత్రం కాదు. రామ మందిరం ఒక విశ్వాసం. రామాలయాన్ని సందర్శించని వారు హిందూ వ్యతిరేకులనీ, రాముని పట్ల విశ్వాసం లేని వారని అనుకోవడం పొరపాటు. రాముణ్ణి గురించి, హిందూయిజం గురించి భారతదేశం మౌలికంగా దేనినైతే విశ్వసిస్తూ వస్తోందో అదే సిద్ధాంతం ప్రాతిపదికగా కాంగ్రెస్ రామాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆహ్వానాన్ని తిరస్కరించింది. కాంగ్రెస్ తీసుకున్న ఈ నిర్ణయం ఒక సవాల్. హిందువుల విశ్వాసాన్ని చూరగొనడానికి కాంగ్రెస్ కష్టపడాలి. కాంగ్రెస్‌లో రామమందిరం సమస్య కాదు. ఆ పార్టీలో ఉన్న గందరగోళ పరిస్థితే. రాముణ్ణి గురించి, రామాలయం గురించిన గందరగోళ పరిస్థితి నుంచి కాంగ్రెస్ బయటపడుతుందని ఆశిద్దాం. ❑

**(ఎన్టీటీవీ సౌజన్యంతో)**

# మలుపు తిరిగిన రామాలయ వివాదం

**(8వ పేజీ తరువాయి)**


నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా, పూర్వపు అయోధ్య సంస్థానం, రామాలయ ట్రస్టీ రాజా సాహెబ్ అక్కడ ఎందుకు ఉన్నట్లు ? వారు రాజీనామా చేసి రామానంద సంప్రదాయ ప్రతినిధులకు ఆలయాన్ని ప్రతిష్ఠాపనకు ముందే అప్పగించాలి. ప్రతిష్ఠను రాజకీయం చేశారు. మతాధిపతులను కావాలనే పక్కన పెట్టారు. ఆలయం రామానంద సంప్రదాయ వాదులదే అయితే వారు విరాళాలు తీసుకొనే ముందే ఆ ముక్కచెప్పాలి. ఆ సమయంలో మీరు మా నుంచి విరాళాలు పొందారు. ఆలయం శంకరాచార్యులది కాదంటే మీరు మా నుంచి విరాళాలను ఎందుకు స్వీకరించినట్లు ? అని అవిముక్తేశ్వరానంద ప్రశ్నించారు. రామానంద పరంపరలో నిర్మోహీ అఖారా మతపరమైన చిహ్నం. సుప్రీంకోర్టు తీర్పు రాక ముందు అక్కడ పూజలు నిర్వహిస్తున్న సంస్థ అది. దానికే ఆ బాధ్యతను మరోసారి అప్పగించాలి. మీరు మరింత మంది పూజారులను ఎందుకు నియమిస్తున్నారు. పూజ బాధ్యతను రామానంద సాంప్రదాయం ప్రకారం నిర్మోహి అఖారాకు అప్పగించాలి. దాన్ని మేము ఆమోదిస్తాము. దీంతో నలుగురు శంకరాచార్యులూ సంతోషిస్తారని కూడా ముక్తేశ్వరానంద అన్నారు. రామాలయ నిర్మాణాన్ని ఓట్ల కోసం బీజేపీ ఉపయోగిస్తున్నదని లోకం కోడై కూస్తున్నది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రామాలయాన్ని ప్రభావితం చేసేందుకు ఐదు వేల మంది చొప్పున ప్రతి నియోజకవర్గంలో నియమించాలని బీజేపీ పథకం వేసినట్లు ఒక బీజేపీ నేత చెప్పినట్లు ది ప్రింట్ న్యూస్ పోర్టల్ తన విశ్లేషణలో పేర్కొన్నది. రానున్న మూడు మాసాలలో దేశమంతటి నుంచి రెండున్నర కోట్ల మందికి రామదర్శనం ఏర్పాటు చేసి హిందూ ఓటు బ్యాంకును ఏర్పాటు చేసుకోవాలని చూస్తున్నట్లు తెలిపింది. అయోధ్యను సందర్శించిన వారు తమ అనుభవాలను ఇతరులకు తెలియచేస్తారని బీజేపీ ఎంపీ ప్రదీప్‌చౌదరి చెప్పినట్లు ప్రింట్ రాసింది. రామాలయ ప్రతిష్ఠ రాజకీయం తప్ప సనాతనం కాదని అయోధ్యలోని మహంతులు కొందరు భావిస్తున్నారు. ప్రధాని నరేంద్రమోడీ నిర్వహించే ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వారణాసికి చెందిన లక్ష్మీకాంత దీక్షిత్ నిర్వహిస్తున్నారు. దీపావళి ఉత్సవానికి మమ్మల్ని ఆహ్వానించారు. ఇప్పుడెందుకు పిలవలేదని మహంత్ భానుదాస్ ప్రశ్నించారు. విమర్శలు చేసిన శంకరా చార్యలను సామాజిక మాధ్యమంలో పెద్ద ఎత్తున మోడీ అభిమానులుగా ఉన్న వారు చీల్చి చెండాడుతున్నారు. వారు ఎప్పుడైనా రామాలయం కోసం ఆందోళన చేశారా అని ప్రశ్నిస్తున్నారు. శంకరాచార్యులను అనుసరించే వారి మనోభావాలను వారు తీవ్రంగా గాయపరుస్తున్నారు. మొత్తం మీద రాముడిని మరోసారి వివాదాస్పదం కావించారు. వీధుల్లో రచ్చ రచ్చ చేస్తున్నారు. ❑

# అయోధ్యలో రామకథ చుట్టూ ఆలయాలు

(తెలుగు: ఎన్ వేణుగోపాల్)

- సరోజ్ మిశ్రా

రాముడు అయోధ్యలో పుట్టాడని వాళ్లంటారు. అయోధ్య లోనే ఆడుకున్నాడనీ, యువకుడిగా తిరుగాడాడనీ, అక్కడే పెద్ద వాడయ్యాడనీ, అక్కడి నుంచే అరణ్య, అజ్ఞాత వాసాలకు పంప బడ్డాడనీ, మళ్లీ తిరిగి వచ్చి అక్కడి నుంచే పాలించాడనీ అంటారు. ఆయన జీవితంలోని ప్రతి క్షణాన్నీ గుర్తు చేసుకోవడానికి అయోధ్యలో ఒక ఆలయం ఉంది. ఆయన ఆడుకున్నచోట గులేలా మందిర్ ఉంది. ఆయన చదువుకున్న చోట వశిష్ట మందిర్ ఉంది. ఆయన కూర్చుని, పాలించిన చోట ఒక మందిరం ఉంది. ఆయన భోజనం చేసినచోట సీతా రసోయి ఉంది. భరతుడు ఉండినచోట ఒక మందిరం ఉంది. కోప్ భవన్ అనే హనుమంతుడి మందిరం ఉంది. సుమిత్రా మందిర్ ఉంది, దశరథ భవన్ ఉంది. అటువంటి ఎన్నో ఎన్నెన్నో ఆలయాలున్నాయి. అవన్నీ 400 నుంచి 500 ఏళ్ల కింద కట్టినవి. అంటే, ఆ ఆలయాలన్నీ ఈ దేశాన్ని మొఘల్‌లు, ముస్లింలు పాలిస్తున్నప్పుడు కట్టినవే. ఎంత విచిత్రం! ఈ ఆలయాలు నిర్మించడానికి ముస్లింలు ఎలా అనుమతించారు? వాళ్లను అందరూ దేవాలయాలను కూలగొట్టారనే గుర్తుంచుకుంటారు గదా. వాళ్ల పాలన సాగుతుండగానే ఒక పట్టణం మొత్తానికి మొత్తం క్రమంగా దేవాలయాలుగా మారి పోతుంటే వాళ్లు ఏమీ చేయలేదన్నమాట! ఇలా దేవాలయాలకు భూమి దానం చేసిన వాళ్లు ఏమి ఆక్రమణదారులు? లేకపోతే, ఇప్పుడు గులేలా మందిర్ ఉన్న స్థలాన్ని ముస్లిం పాలకులు ఇచ్చారని చెప్పేవాళ్లు అబద్ధం చెపుతూ ఉండాలి. దిగంబర్ అఖాడాలో ఉన్న పత్రాలు కచ్చితంగా తప్పుడువి అయి ఉండాలి. ఆ పత్రాలలో ప్రత్యేకంగా ఆలయాల నిర్మాణం కోసం ముస్లిం పాలకులు 500 బీఘాల భూమి విరాళంగా ఇచ్చారని ఉంది గదా. ఇప్పుడు నిర్మోహి అఖాడా ఉన్న స్థలాన్ని నవాబ్ సిరాజుద్దౌలా ఇచ్చాడనేది నిజం అయి ఉండదు. ఔనౌను, బాబర్, బాబ్రీ మసీదు అన్నదొక్కటే నిజం, మిగిలినవన్నీ అబద్ధాలు !! ఇంకా ఆలోచిస్తే తులసీదాసు కూడా తప్పులే రాసినట్టున్నాడు. ఆయన 1528 సమయంలో జీవించే ఉంటాడు. కొత్త కాలెండర్ లెక్కలు కడితే ఆయన 1511లో పుట్టాడు గదా. సరిగ్గా రాముడు పుట్టినచోట ఉండిన రామ మందిరాన్ని బాబర్ కూల్చినదీ, ఆ స్థలంలో బాబ్రీ మసీదు నిర్మించినదీ ఆ 1528లోనే అంటారు గదా. తులసీదాసుకు కచ్చితంగా ఆ సంగతి తెలిసే ఉండాలి. అసలు బాబర్ ఒకవైపు రాముడు పుట్టిన స్థలాన్ని కూల్చివేస్తుంటే తులసీదాసు ఏమి రాస్తున్నాడో తెలుసునా? 'మాంగ్ కె ఖైబో, మసీట్ మే సోయిబో'–బిచ్చమెత్తుకుని తింటాను, మసీదులో నడుము వాలుస్తాను అని. ఆ తర్వాత రామచరిత మానస్ రాశాడు. రామమందిర విధ్వంసమూ, ఆ శిథిలాలల మీదనే బాబ్రీ మసీదు నిర్మాణమూ జరుగుతుంటే తులసీదాసు ఎటువంటి విషాదాన్నీ అనుభవించకుండా ఎలా ఉన్నాడు? లేక, కచ్చితంగా ఆయన ఇంకెక్కడో ఒకచోట దాని గురించి రాసి ఉంటాడా?




**అయోధ్యలో ఒక ముస్లిం జమీందారు విరాళంగా ఇచ్చిన స్థలం మీద నిర్మించిన ఈ 300 ఏళ్ల జన్మస్థాన్ ఆలయాన్ని ప్రస్తుత కొత్త రామ మందిరం బాగా కనబడదానికి అడ్డుగా ఉందని 2020 ఆగస్టులో కూల్చివేశారు.**


సత్యం, అసత్యం అనే మాటలు అయోధ్యలో తమ అర్థాన్ని సంపూర్ణంగా పోగొట్టుకున్నాయి. ఐదు తరాలుగా ముస్లింలు అక్కడ పూల తోటలు వేసి పూలు సరఫరా చేస్తున్నారు. ఆ పూలతోనే అక్కడ అన్ని ఆలయాలలో, అందరు దేవతలనూ, రాముడిని కూడా పూజిస్తున్నారు. అక్కడ ముస్లింలు ఎప్పటి నుంచో లెక్క లేనంత పూర్వ కాలం నుంచి చెక్కతో పాంకోళ్లు తయారుచేస్తున్నారు. సాధువులు, సన్యాసులు, రామభక్తులు అందరూ ముస్లింలు తయారు చేసిన ఈ పాదుకలనే తొడుక్కుని తిరుగుతున్నారు. **మిగతా 20వ పేజీలో..**

# వాల్మీకి రామాయణంలో రాముడు



- డాక్టర్ దేవరాజు మహారాజు

వాల్మీకి రామాయణంలో రాముడు దేవుడు - అనే మాట ఎక్కడా కనిపించదు. రామాయణం అసలు పేరు 'పౌలస్య ముని వ్యధ' లేదా 'సీత చరితం'. ఈ రెండు పేర్లు కాకుండా అందులోని రాముడి పాత్రకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చి ఆ పాత్రను దేవుడిగా మార్చారు. తర్వాత కాలంలో వచ్చిన రచయితలు కల్పనలు జోడించి, మహిమాన్వితుణ్ణి చేశారు. వాస్తవాలు తెలుసుకోవడం కోసం-వాల్మీకి రామాయణంలోకి తొంగిచూస్తే, అసలు విషయం బయటపడుతుంది! వాల్మీకి రాముణ్ణి దేవుడిగా వర్ణించలేదు. పైగా సాధారణ మానవుడిగా చిత్రించాడు. వాల్మీకి రామాయణంలో రాముడి మాటల్ని, చేష్టల్ని వాల్మీకి ఎలా రాశాడో, ఆ పాత్రను ఎలా చిత్రించాడో గమనించండి. నిశితంగా ఆలోచించండి. విషయాలు చెక్ చేసుకోండి. అంతేగాని, దయచేసి మనోభావాలు దెబ్బ తీసుకోవద్దు- సీతను వెతుకుతూ రాముడు అరణ్యంలో వెళుతున్నప్పుడు కనిపించిన వృక్షాలతో, జంతువులతో ఇలా మాట్లాడతాడు. సీత ఆచూకీ చెప్పండని బతిమాలుతాడు. వాల్మీకి రామాయణం అరణ్యకాండలోని కొన్ని విషయాలు ఇక్కడ ఉదహరిస్తున్నాను.




- 1.ఓ బిల్వ వృక్షమా! బిల్వ ఫలముల వంటి స్తనములు గల నా ప్రియురాలిని చూచినచో చెప్పు(అరణ్యకాండ 60-13)
- 2.ఓ కుభ వృక్షమా ! నీ కాండము వంటి తొడలు గల సీతను గూర్చి నీకు తప్పక తెలిసి ఉండును (అరణ్యకాండ 60-15)
- 3. ఓ తాళ వృక్షమా! పక్వమైన ఫలముల వంటి స్తనములు గల సీతను చూచితివా? నీకు నాపై దయ ఉన్నచో అందమైన కటి ప్రదేశం గల సీతజాడ తెలుపు (అరణ్యకాండ 60-18)
- 4.ఓ గజమా! నీ తొండము వంటి తొడలు గల సీతను నీవు చూచి ఉండవచ్చు. చెప్పుము (అరణ్య కాండ 60-25)
- 5.మన్మథ పీడితుడైన రాముడు ఓ సీతా! అరటి స్థంభాలతో సమానమైన నీ రెండు తొడలను అరటి ఆమలు కప్పివేయునట్లు చేసినావు కానీ, అవి నాకు కనబడినవి. వాటిని దాచలేకపోయినావు (అరణ్య కాండ 62-4)
- 6.గుండ్రటి నా సీత స్తనములు ఎల్లప్పుడు చూచుటకు అందముగా ఉండి ఎర్రని మంచి గంధము పూసుకొనుటకు అలవాటు పడినవి. అట్టి స్తనములు - రక్తపు బురద పూయబడి, కాంతి హీనములై ఉండి యుండును. ఇది సత్యము. (వాల్మీకి రామాయణం : అరణ్యకాండ (63-8)
- 7.బంధువులెవరూ దగ్గర లేని నారు, సీత కూడా లేక పోవుటచే రాత్రులందు నిద్రపట్టక - ఆ రాత్రులు చాలా దీర్ఘములుగా కనబడుచున్నవి (ఆరణ్య కాండ 64-13)

ఇక రాముడి ఆలోచనలస్థాయి గూర్చి చూడండి. సీత కనబడకుండా పోయిందన్న బాధ గానీ, ఆమె ఎక్కడ ఏ బాధలు పడుతున్నదో అనే వ్యథ కాని రాముడిలో కనిపించడం లేదు. ఎంతసేపూ ఆమె అవయవాలు మాత్రమే గుర్తు చేసుకుంటున్నాడు. ఇక్కడ రాముడు ఒక కావ్యంలో సృష్టించబడ్డ పాత్ర. తప్పు ఏదైనా ఉంటే ఆ పాత్రను ఆ విధంగా సృష్టించిన రచయిత అయిన వాల్మీకిది తప్పు. సహచరి అయిన సీత బాధలు అర్థం చేసుకునే స్థాయిలో రాముడి పాత్ర చిత్రణ చేయలేదు. కలిసి గడి పిన రోజులలో కష్ట సుఖాలు కూడా రాముడనే పాత్రకు గుర్తుకు రానీయలేదు. రామాయణం రాయబడ్డ కాలం నాటికి వాల్మీకి ఎదగని మానవ ప్రవృత్తిలో ఉన్నవాడే - సున్నిత మైన ప్రేమ భావన, లాలిత్యం, విరహ వేదన వర్ణించలేకపోయాడు. మనిషి మనిషిని ప్రేమించినట్లు, మనిషి మనిషిని గౌరవించినట్లు, మనిషి, మనిషితోడు కోసం తపించినట్లు వాల్మీకి రామాయణంలో ఎక్కడైనా కనిపిస్తుందా ? ముడివడి పెనవేసుకుపోయిన రెండు జీవితాల మమతానురాగాలు, దూరం పెరగడం వల్ల కలిగే లోతైన వెలితి, చెలరేగిన ప్రేమ తుపానులు ఏమైనా కనిపించాయా ? లేదు ఎందుకంటే అది ఎదగని కాలం, ఎదగని మనుషులు, అనాగరిక ఆటవిక జీవితాలు, స్త్రీ పురుషుల మధ్య ఉండే లైంగిక సంబంధాన్ని అధిగమించి హుందాగా, ప్రేమికు డిగా, జీవిత భాగస్వామిగా చేసిన ఉన్నతమైన ఆలోచనలు ఏవీ ? 1950-60లలో వెలువడ్డ ఏ పాత బాలివుడ్ సినిమా విరహ గీతం విన్నా హృదయం ద్రవించిపోతుందే ? వాల్మీకి వర్ణించిన రాముడి బాధ-విరహంలో ఏ పరిపక్వతా లేదే ?

అలాంటి రచనకు ఒక మహా కావ్యమని పేరా ? అందులోని ఎదగని మనస్తత్వమున్న కథా నాయకుడు దేవుడా ? పోనీ మనిషిగా ఆదర్శప్రాయుడా ? అలా ఓ కల్పిత పాత్రకు కోట్లు ఖర్చు చేసి ఆలయం కట్టే వారిది ఎంత విజ్ఞత ? ఒక రకంగా వాల్మీకి, రాముడి పాత్రే నయం ! ఎందుకంటే ఆ రచయితా, ఆ పాత్రా వారి కాలానికి సరిపోయే విధంగా ఆలోచించారు. అందు వల్ల వారిస్థాయి అప్పటికి అంతే అని మనం సరి పెట్టుకోవచ్చు. కానీ, ఇప్పుడు అత్యాధునిక యుగంలో జీవిస్తూ, మూడు వేల ఏళ్ళు వెనక్కి వెళ్ళి ఆలోచించే వారిని ఏమందాం? ఈ కాలానికి సరిపడని అనాగరిక మూర్ఖత్వాన్ని బలవంతంగా ప్రచారం చేస్తున్న అవివేకులను ఏమందాం? ఆ నాడు వాల్మీకి ఆలోచనలు స్త్రీ అవయవాల దగ్గరే ఆగిపోయినట్టు – నేటి బూర్జువా రాజకీయ నాయకుల రాజకీయాలు అక్కడే ఆగిపోయాయి. స్త్రీ శరీరాలు నేటి రాజకీయాలకు యుద్ధ భూములు ఎందుకు అవుతున్నాయి? మణిపూర్‌లో జాతుల మధ్య చిచ్చులేపి, మహిళలను నగ్నంగా ఊరేగించడం, బహిరంగంగా సామూహి కంగా రేప్ చేయడం దేనికి సంకేతం ? సమకాలీన సమాజం ఇలా తగలబడిందంటే తరతరాలుగా ఇలాంటి అశ్లీల ఘట్టాలు, అశ్లీల కావ్యాలు చదివినందు వల్ల కాదంటారా? సంస్కృత సంప్రదాయాల పేరుతో అశ్లీల భావజాలాన్ని వ్యాప్తి చేసినందు వల్ల కాదంటారా? స్త్రీ భోగ వస్తువు కాదు. మనసు, శరీరం, వ్యక్తిత్వం గల ఒక మనిషి అని ఏ పురాణమైనా, ఏ కావ్యమైనా చెప్పిందా? సంస్కృతి అనే ముసుగులో ఈ కాలానికి పనికిరాని భావజాలం ప్రచారం చేస్తారా? తమ స్వార్థ చింతనతో యువతరాన్ని వెనక్కి నడిపించడమెందుకూ? జై శ్రీరామ్ – నినాదాలు నేర్పించి వారి భవిష్యత్‌ను అంధకారంలోకి తోసెయడమెందుకు ? హిందూ సంప్రదాయం ప్రకారం వివాహితుడైన వాడు ఏ పూజ అయినా భార్యతో కలిసి చేయాలి. భార్యను తన్ని తగిలేసి, అధికారికంగా విడాకులు ఇవ్వకుండా, ఒక మహిళ జీవితాన్ని నాశనం చేసిన ఓ పెద్ద మనిషి ఒంటి లింగం లాగా ప్రతిచోటా, ప్రతి పూజ ఒంటరిగానే చేస్తుంటాడు. దానితో దేశ ప్రజలకు ఏ సందేశం ఇస్తున్నట్టు? – మీరు కూడా మీ భార్యలను తన్ని తగి లేయండి. విడాకులు తీసుకోకండి. దేశాల మీద పడి ప్రజల సొమ్ముతో బలాదూరు తిరుగుతూ ఉండండి. చదువుకోకండి. ఎప్పుడు మాట్లాడినా, మనసులో లేని మాటలు. మంకీ బాత్‌లో మాట్లాడండి అనా? ఆదానీ అంబానీల దగ్గర పెద పాలేరుగా పడి ఉండండనా? ఏం సందేశం ఇస్తున్నట్టూ ? సరే, రామాయణం గురించి చర్చించుకుంటున్నాం కాబట్టి, శ్రీరాముడి భక్తులకు, రామాయణ కావ్యాన్ని చదివే వారికి నేను మరొక రామాయణం చదవమని సూచిస్తాను. అది లివింగ్ రామాయణ (LIVING RAMAYANA) రచయిత అజీజ్ తరువాన. ఇది ఒక పరిశోధనాత్మక గ్రంథం. కేరళలో ముఖ్యంగా వయనాడ్ ప్రాంతంలో జనం నాలుకల మీద ఉన్న అనేక కథలు సేకరించి, ఈయన గ్రంథస్థం చేశారు. రామాయణం అక్కడే తమ ప్రాంతంలో జరిగిందని అక్కడి జనం గట్టిగా విశ్వసిస్తు న్నారు. పుల్‌పల్లి దగ్గర ఆశ్రమ్‌కొల్లి అనేచోట వాల్మీకి ఆశ్రమం ఉండేదని నమ్ముతున్నారు. అలాగే జడయట్టకవు అనేచోట సీత భూమిలోకి వెళ్ళిపోయిందని.. అక్కడ భూమి చీలిపోయినట్టు ఉన్న చోటును చూపిస్తారు. అంతేకాదు, హనుమంతుడి తోక రాసుకుపోయిన మరకను కూడా అక్కడి గ్రామీణులు చూపెడతారు. అలాంటి గుర్తులు మనకిక్కడ భద్రాచలంలోనూ చూపిస్తారు. ప్రతిచోటా స్థల పురాణాలు ఉండడం మనకు కొత్తేమీ కాదు. అంటే వైదిక బ్రాహ్మణాచార్యులు జనాన్ని ఎంతగా ప్రభావితం చేశారన్నది మనం గ్రహించుకోవాలి. అందుకే తరచూ చెపుతుంటాను. బ్రాహ్మణిజాన్ని మోసుకుతిరిగేది ప్రస్తుతం బ్రాహ్మణులు కాదు. బ్రాహ్మణేతరులే ! రచయిత అజీజ్ తరువాన కాలికట్‌లోని ఫారూఖ్ కాలేజిలో మలయాళ విభాగానికి అధిపతి. కేరళా భాషా ఇనిస్టిట్యూట్‌లో సంపాదకుడిగా, ట్రైబల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో అసిస్టెంట్ డెరెక్టర్‌గా పనిచేశారు. అంబేడ్కర్ నేషనల్ ఎక్సలెన్సీ అవార్డు పొందిన వీరి 'వాయనదన్ రామాయణ' గ్రంథానికి ఇంగ్లీషు అనువాదమే ఈ 'లివింగ్ రామాయణ'. ఈ పుస్తకం ఆన్‌లైన్‌లో దొరుకుతుంది. ఇదికాక, మరో ఐదు గ్రంథాలు ఈ రచయిత ప్రకటించారు. కేరళలోని ఆదియ రామాయణం'లో కొన్ని హేతుబద్ధమైన అంశాలున్నాయి. కేరళ, వేనాడు జిల్లా త్రిసెల్లరీలో గల ఆదియ ఆదివాసీ తెగల వారు చెప్పుకునే కథలో–కడుపుతో ఉన్న సీతను వదిలేయడాన్ని భరించలేక రాముణ్ణి దూషిస్తూ ప్రశ్నిస్తారు. అలాగే మాతంగ చెట్టీ జాతి వారి కథలో లవకుశుల గురించి భిన్నమైన కథ ఉంది. ఈ కథ ప్రకారం సీతకు ఒక్కడే కొడుకు. ఆమె వాణ్ణి వాల్మీకి దగ్గర ఉంచి, స్నానం కోసం నదీ తీరానికి వెళుతుంది. స్నానం చేసి వచ్చి కొడుకును తీసుకుని మళ్లీ బయటకు వెళుతుంది. వాల్మీకి అది గమనించాడు. తనకు అప్పగించిన పిల్లవాడు తప్పిపోయాడని అనుకుంటాడు. సీతకు ఏం సమాధానం చెప్పాలో అని భయపడి, కుశ గడ్డి పరకతో ఒక పిల్లవాణ్ణి సృష్టిస్తాడు. వాడే కుశుడవుతాడు. సీతకు పుట్టినవాడు లవుడు. ఆ రకంగా లవకుశులవుతారు. వాల్మీకి సర్ది చెప్పిన మాటలకు సమ్మతించి సీత కుశుణ్ణి కూడా స్వీకరిస్తుంది. మనం ఆలోచించాల్సింది కుశగడ్డితో పిల్లవాణ్ణి సృష్టించగలిగిన వాల్మీకి తన దివ్య దృష్టితో లవుడి ఆచూకీ తెలుసుకోలేడా? ఇవన్నీ అభూత కల్పనలు, కట్టు కథలనేది. పురాణ పాత్రలు ఒక్కసారి మానవాతీత శక్తులు ప్రదర్శిస్తాయి. మరోసారి కనీసం మనిషికుండే అవగాహన లేకుండా వ్యవహరిస్తాయి. ఇండోనేషియా, థాయ్‌లాండ్‌లలో రామాయణం జానపద గీతాలుగా ప్రాచుర్యం పొందింది. 'హికాయత్ సెరిరామ' శ్రీ రామ పతయాని రామాయణం" రామ్ కె లింగ' వంటివి జానపద సాహిత్యంగా గుర్తించబడ్డాయి. టిబెట్‌లోని **మిగతా 20వ పేజీలో..**

# ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 46వ మహాసభలు

విశాఖపట్నం
2024
జనవరి
6-7




ప్రొసీడింగ్స్ వాల్యూమ్ ను ఆవిష్కరిస్తున్న అతిథులు

మానవ మనుగడకు మూలాధారమైన చరిత్రను సామాజిక బాధ్యతతో కాపాడుకోవాలని ఆంధ్రప్రదేశ్ చరిత్ర మహాసభ 46వ వార్షికోత్సవ సభ లో వక్తలు ప్రకటించారు విశాఖపట్టణం లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల ఆవరణలో కాలేజీ గోల్డెన్ జూబ్లీతో పాటే ఈ సభలు 2024 జనవరి 6-7 తేదీలలో జరిగాయి . సాంఘిక శాస్త్ర విభాగానికి చెందిన లక్ష్మీదేవి అధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలనతో తొలినాటి సభ ప్రారంభమైంది. ఆచార్య సోమ శేఖర్‌రావుకు" ప్రెసిడెంట్ షిప్""ను ప్రొఫెసర్ కిరణ్ కాంత్ చౌదరి అప్పగించారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ జి.మధు కుమార్ సభకు స్వాగతం పలికారు. కళాశాల గోల్డెన్ జూబ్లీ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 46వ వార్షిక సదస్సుకు ఆతిథ్యం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. చరిత్రను కాపాడుకోవాలనే సామాజిక బాధ్యతతో ఆర్ట్స్ గ్రూపులను అంది స్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ చరిత్ర సంఘం వ్యవస్థాపకుల్లో ముఖ్యులైన ఆచార్య వకుళాభరణం రామకృష్ణ మాట్లాడుతూ సంస్కృతి. సంప్రదాయాల్ని రాబోయే తరాలకు అందించాలంటే చరిత్రపై ఆసక్తిని బతికించాలన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ వేదిక గా ఏర్పాటైన సంఘం తొలిసారిగా విశాఖలో వేడుకలను జరుపు కోవడంతో తన కల నెరవేరిందన్నారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల సావనీరు ఏయూ ఇన్చార్జి వీసీ ప్రొఫెసర్ సమత విడుదల చేశారు. మాజీ డీజీపీ ఆంజనేయరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ హిస్టరీ పోస్ట్ గ్రాడ్యు యేషన్ విద్యార్థులు క్రమంగా తగ్గిపోతున్నారని, ఏ విభాగాన్ని మూసివేయవద్దని ఆంధ్రా యూనివర్సిటీ ఇన్చార్జి వీసీకి విజ్ఞప్తి చేశారు. కడపలోని యోగి వేమన విశ్వవిద్యా లయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ వార్షిక కార్యక్రమాల సంపుటిని విడుదల చేశారు. కార్యదర్శి నివేదికను సంఘం ప్రధాన కార్య దర్శి డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి ప్రవేశపెట్టారు. చరిత్ర అధ్యయ నం వల్లే మానవాళికి జాతీయ దృక్పథం ఏర్పడుతుందని ఆంధ్ర ప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 46వ వార్షిక సమావేశాల ముగింపు సభలో వక్తలు అన్నారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల కార్యదర్శి కరస్పాండెంట్ డాక్టర్ జి.మధు కుమార్ ముగింపు సభలో మాట్లాడుతూ కళాశాల ఆవరణలో వార్షిక సమావేశాన్ని నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ చరిత్ర సంఘం వ్యవస్థాపక సభ్యులు, ఆచార్యులు వకుళాభరణం రామకృష్ణ, ,పురావస్తు శాఖ ఆచార్యు లు కె.తిమ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి, ఆచార్య మువ్వ శ్రీనివాస రెడ్డి, అధ్యక్షులు ఆచార్య సోమశేఖర రావు,కొప్పర్తి వెంకటరమణ మూర్తి ప్రభృతులు ప్రసంగించారు. మారుతున్న కాలంలో వాణి జ్య, సాంకేతిక విద్యకు ప్రాధాన్యత పెరిగిందని, ఉపాధి పొందడ మే పరమావధికగా మారిందన్నారు. సామాజిక శాస్త్రాలు, చరిత్ర అధ్యయనానికి విద్యార్థుల్లో ఆసక్తి కొరవడిందని వక్తలు అన్నారు.

ఆర్థిక అనుకూలతల కోసం చరిత్రను విస్మరిస్తే మనిషి జ్ఞాపకశక్తి కోల్పోయినట్లే అవుతుందన్నారు. చరిత్ర అనేది సమాజానికి దిక్సూచిగా పనిచేస్తుందని వక్తలు తెలిపారు. దీని ప్రాధాన్యతను గ్రహించాలని కోరారు. ఈ సమావేశాలకు 11 రాష్ట్రాల నుంచి 100 మంది ప్రతినిధులతోపాటు 179 పరిశోధక విద్యార్థులు హాజరయ్యారు. **మిగతా 25వ పేజీలో..**

# కేంద్ర పెత్తనంలోకి ఎన్నికల కమిషన్



- తెలకపల్లి రవి

**దేశంలో ప్రజాస్వామిక విలువలను వమ్ము చేయడమే గాక రాజ్యాంగ వ్యవస్థల మూల స్ఫూర్తిని దెబ్బతీస్తూ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎన్నో నిరంకుశ చర్యలకు పాల్పడింది. ఈ క్రమంలో బాహాటంగా బరితెగించి వ్యవహరించినవి కొన్నయితే, అచ్చంగా చట్టబద్ధంగా, చట్టం కోసమే చేస్తున్నట్టు కనిపిస్తూ చాప కింద నీరులా అనుకున్న పని కానిచ్చిన అతి తెలివి వేషాలు అనేకం. ప్రధాన ఎన్నికల కమిషనర్, కమిషనర్ల నియామక ప్రక్రియకు సంబంధించి పార్లమెంటులో ఇటీవల బిల్లు ఆమోదింపచేసుకోవడం ఈ రెండో కోవలోకి వస్తుంది.**

2023 ఆగస్టులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆదేశాల అమలు కోసం ఈ చట్టం చేసినట్టు ప్రభుత్వం చెప్పుకుంది. కానీ వాస్తవానికి అక్షరాలా ఆ తీర్పు ప్రభావం లేకుండా చేయడానికి అందులోని కీలక అంశాలను తిరస్కరిస్తూ చేసిన శాసనం ఇది. 140మంది ఎంపీల సస్పెన్షన్, దాన్ని కప్పిపుచ్చడం కోసం ఉపరాష్ట్రపతి జగదీప్ ధంకర్‌ను అనుకరించారనే గగ్గోలు నేపథ్యంలో కీలకమైన ఈ శాసనం మరుగున పడిపోయింది. వాస్తవానికి అది భారత ప్రజాస్వామ్య పరిరక్షణకు గొడ్డలి పెట్టులాంటిది. ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైన ఎన్నికల ప్రక్రియకు ఆధ్వర్యం వహించే ఎన్నికల కమిషన్ నియామకం ప్రధాని ఇష్టారీతికి వదిలేసే దుర్మార్గమది. ఇదంతా సుప్రీంకోర్టు చెప్పినట్టు చెప్పడం మరింత విపరీతం. చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లు(నియామక షరతులు, సర్వీసు పదవీ నిబంధనలు) బిల్లు 2023 పేరిట వచ్చిన ఈ బిల్లును రాజ్యసభ డిసెంబర్ 12న ఆమోదించింది. ప్రధానమంత్రి అధ్యక్షులుగా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, ప్రధాని నియమించే మరో కేంద్ర మంత్రి సభ్యులుగా కమిటీ ఈ ఎంపిక కోసం రాష్ట్రపతికి పేరు సిఫార్సు చేస్తుంది. ఇప్పటికే కార్యదర్శులుగా పనిచేసి పదవీ విరమణ చేసిన వారే ఈ పదవికి అర్హులుగా వుంటారు. అంటే నియమించే కమిటీలో ప్రధాని మాట అమలవుతుంది. నియామకానికి అర్హులైన వారు కూడా ఆ ప్రభుత్వంలో పనిచేసిన వారే అయి వుండాలి. ఇక ఎన్నికల కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తి గురించి చెప్పేదేముంది? (ఒకసారి సీఈసీగా పనిచేశాక మరో పదవి చేపట్టరాదని మాత్రం ఇందులో వుంది.) ఈ బిల్లు సభ ముందుకు రావడానికి ముందు జరిగిన తతంగం మరింత కీలకమైంది.

### రాజ్యాంగం, రాజకీయానుభవాలు

రాజ్యాంగం 324వ అధికరణం ఎన్నికల కమిషనర్‌ను రాష్ట్రపతి నియమిస్తారని మాత్రమే పేర్కొంది. అయితే ఎన్నికలు నిష్పక్షపాతంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో శాంతియుతంగా జరిగితేనే ప్రజాస్వామ్యం అన్నపదానికి అర్థముంటుంది. దీర్ఘ కాలం పాలన చేసిన కాంగ్రెస్ హయాంలోనే ఎన్నికల కమిషన్ల తీరు విమర్శలకు గురైంది. ఇందిరాగాంధీ హయాంలో ఎన్నికల, ఉప ఎన్నికల నిర్వహణ వాయిదా, కేంద్ర బలగాల వినియోగం వంటివి విమర్శల పాలైనాయి. 1972లో పశ్చిమ బెంగాల్‌లో సీపీఐ(ఎం), వామపక్షాలను అధికారంలోకి రాకుండా చేయ డానికి సైన్యాన్ని దింపి రిగ్గింగ్ చేసినా ఎన్నికల సంఘం పట్టిం చుకోలేదు. చాలాసార్లు శాసనసభలను ముందే రద్దు చేయడం విమర్శలపాలైంది. ధనబలం ఫిరాయింపులు వంటి అనైతికత తాండవించడం మొదలైంది. కాంగ్రెస్ నుంచి రాజీనామా చేసిన హెచ్‌ఎన్ బహుగుణ, వీపీ సింగ్ వంటి వారు ఉప ఎన్నికలు కోరితే వాటిని వాయిదా వేస్తూ రద్దు చేస్తూ ఇష్టానుసారం వ్యవహరించడం దేశం చూసింది. అప్పట్లో ఒకే ఎన్నికల కమిషనర్ వుండేవారు. అద్వానీ రథయాత్ర తర్వాత, వీపీ సింగ్ ప్రభుత్వాన్ని కూల్చివేసిన అనంతరం కీలు బొమ్మ చంద్రశేఖర్ సర్కారు వచ్చింది. ఆ సమయంలో ఎన్నికల కమిష నర్‌గా వీఎన్ రమాదేవికి అర్హతలున్నా కాదని టీఎన్ శేషన్‌ను చేశారు. ఎన్ని కల కమిషన్ అధికారాలను మొదటిసారి గట్టిగా ఉపయోగించిన శేషన్‌ను ఆదర్శంగా చెబుతుంటారు. కొన్ని విషయాల్లో అయన పాలక పార్టీలను అదుపు చేసిన మాట నిజమే గాని తనే ఒక నిరంకుశ కేంద్రంగా మారిపోయారు. మత రాజకీయాలను ఎన్నడూ పట్టించుకోలేదు. పార్టీల ప్రభుత్వాల రాజ్యాంగ బద్ధమైన హక్కులను భంగపరిచారు. ఆ సమయంలో తనను తొలగించే అవకాశం లేదు. గనక మరో ఇద్దరు అదనపు కమిషనర్లను నియమించడం ద్వారా అదుపు చేయాల్సివచ్చింది.

### సీఈసీపై సుప్రీం కీలక తీర్పు

తర్వాతి కాలంలో వివిధ ప్రభుత్వాల హయాంలో ఈ తీరు మారిందని కాదు. కాని మోడీ హయాంలో మిగిలిన రంగాలలో వలెనే ఇక్కడా ఏకపక్ష ధోరణి ముదిరిపోయింది. సీబీఐ, ఈడీ,

సీవీసీ వంటి పదవుల నియామకంలో ఆశ్రితులను నియమించి ప్రతిపక్షాలపై ప్రయోగించే ధోరణి పరాకాష్టకు చేరింది. దీనిపై అనేకసార్లు సంబంధిత వ్యక్తులు, సంస్థలూ సుప్రీంకోర్టులో సవాలు చేయడం చూశాం. ఎక్కువ సందర్భంలో నచ్చిన వారిని అడ్డదోవలో అందలమెక్కించడం మాత్రం ఆగలేదు. పలుసార్లు సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని అక్షింతలు వేసినా, ఆగ్రహించినా ధోరణి మారింది లేదు. నచ్చిన వాళ్లను నియమించడం వారికి పదేపదే పదవీకాలం పొడగించడం పరిపాటి అయింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విషయంలో ముందే వద్దన్నా వినకుండా నియమించడమే గాక రెండుసార్లు పొడగింపు తీసుకున్నారు. చివరకు ఇదే ఆఖరిసారని హెచ్చరించింది కోర్టు. ఇక మరింత కీలకమైన ఎన్నికల సంఘం విషయంలోనూ ఇదే సమస్య ఎదురైంది. ఏకపక్ష నియామకాలు జరగకుండా ఒక నియామక ప్రక్రియ నిర్దేశించాలని కోరుతూ ఏడీఆర్ (అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్) తరపున 2022లో ఒక పిటిషన్ దాఖలైంది. దీన్ని త్రిసభ్య రాజ్యాంగ ధర్మాసనం విచారిస్తుండగానే సీఈసీ పదవీ విరమణ వచ్చింది. ఆ సమయంలోనే అరుణ్ గోయెల్ అనే కార్యదర్శి తన పదవి నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ చేయడం, 24 గంటల్లోనే సీఈసీగా నియమించడం జరిగిపోయాయి. సుప్రీంకోర్టు ఓ వైపున ఈ విషయం విచారిస్తుండగానే ఇంత హడావుడి దేనికని తీవ్ర విమర్శలు వచ్చాయి. సీఈసీ పదవీ కాలం ఆరేళ్లు, లేదా 65 ఏళ్లు నిండడం. ఇందులో ఏ కొలబద్దతో చూసినా గోయెల్ ఎంపికయ్యే అవకాశముండదు. తమ ముందుకు వచ్చిన నాలుగు పేర్లలోనూ గోయెల్ చిన్నవారు గనక తనను నియమించినట్టు అడ్వకేట్ జనరల్ సమర్థించుకున్నారు. ఈ నియామకాన్ని సవాలు చేస్తూ పిటిషన్ దాఖలైనప్పుడు కేంద్రం అధికారాన్ని ప్రశ్నించలేమని కోర్టు చెప్పింది. ఏడీఆర్ కేసులో దీనిపై సమగ్ర తీర్పు వస్తుందని సూచించింది. తీరా ఆ కేసు విచారణకు వచ్చినపుడు ఏజీఆర్ వెంకట్రామన్ ప్రభుత్వ నిర్ణయాన్ని ఏకపక్షంగా సమర్థించారు. రాజ్యాంగం సీఈసీ నియామకంపై ఎలాంటి నిర్దేశకాలు చేయలేదని వాదించారు. ఏమీ చెప్పనప్పుడు మరింత జాగ్రత్తగా వుండాలని, దీనిపై ఏవైనా మార్గదర్శకాలు ఇస్తామని సుప్రీంకోర్టు చెప్పగా అలా జోక్యం చేసుకోవాలని న్యాయవ్యవస్థకు అధికారం ఇవ్వలేదని ఆయన అభ్యంతరం చెప్పారు. రాజ్యాంగం ఈ విషయంలో మౌనం పాటించింది. కనుక కోర్టులు చేయడానికి లేదన్నారు. జస్టిస్ జోసఫ్ అధ్యక్షతన గల ధర్మాసనం దీనిపై తీర్పునిస్తూ సీఈసీ నియామకంలో అనుసరించాల్సిన సూత్రాల పై పార్లమెంటు చట్టం చేయాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఇచ్చిన తీర్పులో న్యాయమూర్తి రాజ్యాంగం సీఈసీకి ఎంత ప్రత్యేక స్థానం ఇచ్చిందో అంబేద్కర్ మాటల్లోనే ప్రస్తావించారు. ప్రజాస్వామ్యం అంటేనే ఎన్నికలు సక్రమంగా జరగడమనీ, దానికి ఎన్నికల సంఘం కీలకమని అంబేద్కర్ అప్పట్లో పేర్కొన్నారు. రాజ్యాంగ పరిషత్తు చర్చలో ఈ నియామకంపై నిబంధనలు నిర్దిష్టంగా వుండాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతూ ప్రొఫెసర్ సిబ్బన్‌లాల్ సక్సేనా ప్రతిపాదించిన సమగ్ర సవరణ ఆ సందర్భంలో జరిగిన చర్చ వివరంగా పొందుపర్చారు. కాగ్ వంటి వారితో పోలిస్తే ఎన్నికల సంఘం అత్యంత ముఖ్యం గనకే అందుకు ప్రత్యేక నియామక పద్ధతిని రాజ్యాంగం చెప్పిందనీ, ఇందుకు స్వతంత్రత అనేది కొలబద్ద అని స్పష్టం చేశారు. సీఈసీ కార్యనిర్వాహక వర్గానికి లోబడి వుండకూడదనేది కీలక సూత్రం. పార్లమెంటు చట్టం చేసేలోగా స్వతంత్రత కాపాడేందు కు ప్రధాని ప్రతిపక్ష నాయకుడు, భారత ప్రధాన న్యాయ మూర్తిలతో కూడిన కమిటీ రాష్ట్రపతికి సూచలను చేయాలని నిర్దేశించారు.

## తీర్పుకు తూట్లు పొడిచిన కేంద్రం

కోర్టు చెప్పినట్టే తాము కొత్తచట్టం తెచ్చామని కేంద్రం వాదించడం తీర్పును అపహాస్యం చేయడమే. ఎందుకంటే ఏ తీర్పులోనైనా రెండు భాగాలుంటాయి. ఒకటి ఒబిటర్ డిక్టా, రెండు రేషియో డిసిడెండి. మొదటిది ఆదేశపూర్వకం. తప్పక అమలు చేయాలి. రెండోది ఆ తీర్పునకు మూలమైన స్ఫూర్తి వివరణ. ఈ తీర్పులో కేంద్రం చట్టం చేయాలన్నది ఆదేశమైతే సీఈసీ స్వతంత్రత కాపాడాలనేది స్ఫూర్తి. సాక్షాత్తూ ప్రధాన న్యాయమూర్తిని భాగస్వామిగా చేయడం ద్వారా సుప్రీంకోర్టు తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించింది. అయినా మోడీ సర్కారు ఏవో పొంతనలేని వాదనలతో బిల్లు తీసుకొచ్చింది. ప్రధాన న్యాయమూర్తిని భాగస్వామిగా వుంచాలని కోర్టు సూచనగా చెబితే దాని బదులు ప్రధాని నియమించే కేంద్ర మంత్రికి సభ్యత్వం కల్పించింది. ప్రతిపక్ష నాయకుడికి నామక: స్థానం కల్పించినా మెజారిటీ వారికే వుంటుందనేని స్పష్టం. అంతేగాక కార్యదర్శి హోదా కలిగిన వారేనని చెప్పడం ఎంపికను పరిమితం చేసింది. ఇక ఎంపికయ్యే వారికి ప్రభుత్వం ఎలాటి ప్రత్యేకాభిమానం చూపినట్టు వుండకూడదని కోర్టు చెప్పింది. కాని ఇక్కడ కావలిసిన వారినే తీసుకోవడం ద్వారా వారు లోబడి వుండాల్సిన పరిస్థితి కల్పించబడింది. ప్రధాన కమిషనరుగా నియమించబడే వారికి సుప్రీంకోర్టు జడ్జిలతో సమానంగా జీతభత్యాలు వుండాలని తీర్పులో చెబితే ప్రభుత్వం మొదట కార్యదర్శి స్థాయి వేతనం మాత్రమే ప్రతిపాదించింది. ప్రతిపక్షాల విమర్శల తర్వాతనే దాన్ని ఆ స్థాయికి చేరుస్తూ సవరణ తెచ్చారు. సీజెఐ కూడా సభ్యుడుగా వుండాలని వచ్చిన సవరణను సభ తోసిపుచ్చింది. కమిషన్ సభ్యులకు విధి నిర్వహణలో తీసుకున్న నిర్ణయాలకు గాను కేసులు పెట్టే అవకాశం, తొలగింపు అధికారం లేకుండా చేయాలన్న సూచనను ఆమోదించలేదు. **(మిగతా 22వ పేజీలో)**


# భారతీయ శిక్షాస్మృతిలో ప్రమాదకరమైన మార్పులు



-ఎ.నర్సింహారెడ్డి

**శిక్షా స్మృతి అనగా నేరం, శిక్షతో అనుసంధానించబడిన చట్టాల వ్యవస్థ. 'వంద మంది దోషులు తప్పించుకున్నా పర్వాలేదు గానీ ఒక్క నిర్దోషికి శిక్ష పడకూడదు' అనేది న్యాయవ్యవస్థ ప్రాథమిక లక్ష్యంగా ఉండాలని న్యాయ కోవిదులు చెబుతారు. బ్రిటీష్ కాలం నాటి భారతీయ క్రిమినల్ న్యాయవ్యవస్థ ఇక మారనుంది. ఈ మేరకు కేంద్రం ఇండియన్ పీనల్ కోడ్ 1960 (ఐపీసీ), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1898 (సీఆర్ పీసీ), భారతీయ సాక్ష్యాధారాల చట్టం 1872 (ఎవిడెన్స్ యాక్ట్)లను సమూలంగా ప్రక్షాళన చేయాలని భావిస్తోంది. ఈ మేరకు ఆగస్టు 11న కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో వివాదస్పద మూడు నూతన క్రిమినల్ న్యాయ బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టాడు.**

ఒకటి, ఐపీసీకి బదులుగా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) అమల్లోకి రానుంది. రెండు, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ)కి బదులుగా భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) అమల్లోకి రానుంది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973లో రి-ఎనాక్ట్ చేయబడింది. మూడు, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ సాక్ష్య(బిఎస్) రానుంది. దీంతోపాటు పాత సెక్షన్లు మారిపోనున్నాయి. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ యాక్టులను సంస్కరించేందుకు కేంద్రం 2020 మేలోనే క్రిమినల్ లా సంస్కరణల కోసం నిపుణుల కమిటీని నియమించింది. జాతీయ న్యాయ విశ్వవిద్యాల యం(ఎన్ఎల్‌యు) అప్పటి ఉప కులపతి ప్రొఫెసర్ రణ్‌బీర్‌సింగ్ సారథ్యంలో అప్పటి ఢిల్లీ ఎన్ఎల్‌యూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జిఎస్ బాజ్‌పాయ్, డిఎన్ఎల్‌యూ వీసీ ప్రొఫెసర్ బలరాజ్‌చౌహాన్, సీనియర్ న్యాయవాది మహేశ్ జెఠ్మలానీ, ఢిల్లీ మాజీ జిల్లా-సెషన్స్ జడ్జి జీపీ తరేజాలను ఇందులో సభ్యులుగా నియమించారు. ఈ కమిటీ తన అధ్యయన నివేదికను 2022 ఫిబ్రవరిలో ప్రభుత్వానికి సమర్పించింది. ఆ నిపుణుల సంఘం ప్రభుత్వానికి సమర్పించి సిఫార్సులను ప్రజా క్షేత్రంలో పెట్టలేదు. కాని ఈ బిల్లులకు ఢిల్లీ ఎన్ఎల్‌యూ వైస్ చాన్స్‌లర్‌గా పనిచేసిన పెండ్యాల శ్రీకృష్ణదేవరావు ఆధ్వర్యంలోని కమిటీ అనేక కీలక మార్పులు సూచించింది. ప్రభుత్వం బ్రిటీష్ కాలం నాటి మూడు చట్టాలను మారుస్తున్నామంటూనే ఆ చట్టాలను అంతకన్నా కిరాతకంగా




తయారుచేయడానికి సిద్ధమైంది. మునుపటి చట్టాలకన్నా ఈ బిల్లులు మరింత కర్కోటకంగా కనిపిస్తున్నాయి. వీటిని కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉన్న పార్లమెంటరీ స్థాయీ సంఘ పరిశీలనకు పంపి ఆ తరువాత పార్లమెంటు ఆమోదం పొందుతారట. అలాగే, ప్రస్తుతం ఐపీసీ లో ప్రస్తుతం ఉన్న 511 సెక్షన్లు రాబోయే భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లో 356కు కుదించారు. సీఆర్‌పీసీలో 484 సెక్షన్లు ఉండగా రాబోయే నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్)లో 533కి పెంచారు. భారతీయ సాక్ష్యాధారాల చట్టంలో 167 సెక్షన్లు ఉండగా రాబోయే భారతీయ సాక్ష్య(బీఎస్)లో 170కి పెంచారు.

తాజాగా తీసుకువస్తున్న ఐపీసీ, సీఆర్‌పీసీ చట్టాల్లో మార్పులు ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేలా, భవిష్యత్తు తరాల స్వేచ్ఛను హరించే విధంగా ఉన్నాయి. నూతన బిల్లులలో ప్రతిపాదించిన కొన్ని మార్పులు ఆందోళన రేపుతున్నాయి. ప్రధానంగా వివిధ కేసుల్లో పోలీసు కస్టడీని 15 రోజులకు మించకుండా ప్రస్తుత చట్టాల్లో ఉండగా కొత్త చట్టాల్లో 15 రోజుల నుంచి 45 రోజులకు, తరువాత 90 రోజులకు పెంచుకునే వెసులుబాటు ఉండటం వల్ల పోలీసు రాజ్యం ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. 90 రోజులు పోలీసు కస్టడిలో ఉంచుకోవడమంటే ప్రత్యర్థులపై రాజకీయంగా కక్ష సాధించేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. గత తొమ్మిదేళ్లలో రచయితలు, కళాకారులు, హక్కుల సంఘాల కార్యకర్తలు, సామాజిక మేధావులు, పత్రికా రిపోర్టర్లు కేంద్రం వేధింపులకు, అక్రమ కేసులకు గురై విచారణ జరుపకుండా, బెయిల్ మంజూరు చేయకుండా నిర్బంధించిన సందర్భాలు మనం చూశాం.

## మారింది రాజద్రోహ చట్టం కాదు - పేరు మార్పే :

వాస్తవానికి రాజద్రోహ చట్టాన్ని అమలు చేయకూడదని సుప్రీంకోర్టు ఏడాది కిందట(11 మే 2022) ఎన్.వి.రమణ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు రమణతోపాటు న్యాయ మూర్తులు సూర్యకాంత్, హిమాకోహ్లీతో కూడిన బెంచి తీర్పు చెప్పింది. ఆ తీర్పులో 124(ఎ)ను అమలు చేయకుండా ఉండ డంతోపాటు దీన్ని సమీక్షించాలని సుప్రీంకోర్టు తెలియజేసింది. అప్పటికే ఉన్న కేసులలో బలాత్కారానికి పాల్పడకూడదని కూడా చెప్పింది. అప్పటి నుంచి 124(ఎ) సెక్షన్‌ను అమలు చేయకుం డా పక్కనపెట్టారు. ఇప్పుడు సుప్రీంతీర్పును వమ్ము చేసి ఆ అంశాలకు మించిన అంశాలను చేర్చి అమలు చేయడానికి వీలుగా భారతీయ న్యాయసంహితలో వెసులుబాటు కల్పించా రు. దేశద్రోహ చట్టాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటిం చింది. కానీ, తరచి చూస్తే పేరు మార్పే తప్ప గుణంలో మార్పు ఏమీ లేదని కొత్త రూపంలో ఉన్న భారత న్యాయ సంహితలోని సెక్షన్ 150ని చూస్తే అర్థమవుతుంది. వలస కాలం నాటి అణచివేత కన్నా మరింత ఎక్కువ అణచివేతే లక్ష్యం గా మోడీ ప్రభుత్వం ఈ సెక్షన్‌ను (కొత్త దేశద్రోహ నిబంధనను) తీసుకొ చ్చినట్లు స్పష్టమవుతున్నది. కొత్త బిల్లుల్లో అమిత్ షా చేసిందల్లా దేశ ద్రోహం లేదా రాజద్రోహం అన్న మాటను తొలగించడమే. ప్రభుత్వాన్ని వ్యతిరేకించడాన్ని దేశద్రోహంగా పరిగణించే పార్టీ నుంచి అంతకన్నా ఏం ఆశించగలం! దేశ ద్రోహ నిబంధనకు బదులు భారతీయ న్యాయ సంహితలో 124(ఎ) సెక్షన్‌లో ఉన్న దానికన్న ఎక్కువ కఠినమైన అంశాలను 150 సెక్షన్లలో చేర్చారు. 124(ఎ)లో ఇదివరకు ఉన్న అంశాలకు తోడు ప్రస్తుత కాలంలో ఎలాక్ట్రానిక్ పద్ధతిలాంటి మార్పులను చేర్చి ఈ బిల్లులను మరింత వికృతీకరించారు. భారత న్యాయ సంహిత బిల్లులోని సెక్షన్ 150 ప్రకారం 'మాటలు, రాతలు, సంజ్ఞల ద్వారా గానీ, ప్రతినిధులు, ఎలక్ట్రా నిక్ కమ్యూనికేషన్, ఆర్థిక కార్యకలాపాల ద్వారా భారతదేశ సార్వభౌమత్వం, సమగ్రతకు ప్రమాదకరంగా మారే ఏ చర్య అయినా దేశద్రోహమే అవు తుంది. వేర్పాటువాదం, విభజన, సాయుధ తిరుగుబాటుకు ఉద్దేశించిన చర్యలన్నీ దేశద్రోహమే. వీటికి ఏడేళ్ల నుంచి జీవితకాలం జైలు శిక్ష ఉంటుంది' అని పేర్కొంటోంది. ప్రస్తుత దేశద్రోహ చట్టం ప్రకారం ఉన్న కనిష్ఠ శిక్ష మూడేళ్ల జైలును భారత న్యాయ సంహిత బిల్లులోని సెక్షన్ 150 ఏడేళ్లకు పెంచింది. అంతేకాదు, క్రిమినల్ ప్రోసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ) స్థానంలో తీసుకొచ్చిన భారతీయ నాగరిక్ సురక్షా సంహిత బిల్లులో దేశద్రోహం కేసులకు సంబంధించిన వివరణ ఉంది. దాని ప్రకారం, నిందితుడు/నిందితురాలు దేశద్రోహానికి పాల్పడి నట్లు ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌కు సమాచారం అందితే చాలు. ఎలాంటి ఆధారాలు చూపనవసరం లేదు. ఆ మేరకు 'విచారణ ప్రక్రియ'ను ప్రారంభించవచ్చు. అతడికంటే ఘనుడు ఆచంట మల్లన్న అన్నట్లు ఉన్న చట్టానికి మరిన్ని కోరలు చేర్చి తీసుకొ చ్చిందని హక్కుల సంఘాల నేతలు, న్యాయనిపుణులు అభిప్రా యపడుతున్నారు. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 124(ఎ) దేశ ద్రోహానికి సంబంధించింది. ఇది బ్రిటీష్ హయాంలో అమలు లోకి వచ్చింది. బాలగంగాధర్ తిలక్, మహాత్మాగాంధీ లాంటి వారి మీద ఈ సెక్షన్ ఆధారంగానే దేశద్రోహ ఆరోపణలు మోపారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత చట్టంలో దేశద్రోహా నికి ఇంకా అవకాశం ఉండడం అత్యంత గర్హనీయమే. కానీ ఇప్పటిదాకా కేంద్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా దేశ ద్రోహ చట్టాన్ని మాత్రం తొలగించలేదు. ప్రభుత్వ వ్యతిరేకతే దేశ ద్రోహంగా చలమాణి అయింది. ఇప్పుడు దాన్ని తొలగిస్తు న్నామని అమిత్ షా గొప్పలు చెప్పుకుంటున్నారు. కానీ భారతీ య న్యాయ సంహిత బిల్లులోని 150వ సెక్షన్ బ్రిటీష్ హయాం నాటికన్నా కఠినంగా ఉంది. వలసవాద చట్టాలను మార్చేస్తున్నా మని అమిత్ షా చెప్పడం పచ్చి మోసమే. చట్ట వ్యతిరేక కార్యక లాపాల నిరోధక చట్టంలోని (యూఏపీఏ) అంశాలన్నీ కొత్త బిల్లులో చేర్చారు. అమిత్ షా చెబుతున్న మార్పు ఎంతమాత్రం సంస్కరణ కాదు. అది కేవలం ప్రతీకాత్మమైన మార్పే. ఇంగ్లీషు పేరు పోయి హిందీ పేరు వస్తుంది. ఆ హిందీ కూడా సంస్కృత భూయిష్టమైంది. అంటే మార్పు మోసపూరితమైందే.

## ప్రత్యర్థుల నోరు మూయించడానికే నూతన చట్టాలు :

అనేక దేశాలు మరణశిక్షను రద్దు చేశాయి. కొన్ని దేశాల్లో రద్దు చేయకపోయినా విధించడం లేదు. కానీ అమిత్ షా ప్రవేశ పెట్టిన బిల్లుల్లో మరణశిక్ష విధించే వెసులుబాటు ఉండడం గర్హనీయం. తీవ్రమైన శిక్ష విధిస్తే నేరాలను అదుపు చేయవచ్చు నన్న తప్పుడు అవగాహనకే ఇది సంకేతం. మన దేశంలో సహా మరణశిక్ష విధించే అవకాశం ఉన్న ఏ దేశంలోనూ హత్యలు, ఘోరమైన నేరాలు తగ్గిన దాఖలాలు లేవు. మరణ శిక్ష విధించడం అంటే రాజ్యవ్యవస్థ దోషులనుకున్న వారిని హతమార్చడానికి అనుమతించడమే. బ్రిటీష్ వలసవాదులు భారతీయులను తమ శత్రువులుగా భావించారు. కఠిన శిక్షలు విధించారు. ప్రస్తుత కేంద్ర ప్రభు త్వం ప్రజలను శత్రువులుగా భావించి మరణశిక్ష విధించడమంటే, బ్రిటిష్ పాలకులకంటే భిన్నం కాదని అర్థమవుతుంది. పైగా ఈ కొత్త బిల్లులు శిక్షించ డానికి కాదనీ, ప్రజలకు న్యాయం చేయడానికేనని అమిత్ షా వాఖ్యానించడం పూర్తిగా మోసపూరితం. బీజేపీ తమ పాలనను భారతీయత అని బాకా ఊదుకుంటున్నా సారంలో వలసవాద ప్రజావ్యతిరేక విధానాలను ఏ మాత్రం విడనాడలేదు. ప్రజల హక్కులను కాలరాయడం మానలేదు. ప్రజలను బీజేపీ శత్రువుల్లాగే భావిస్తోంది. కొత్త బిల్లులో ఉన్న వేర్పాటువాదం అన్న మాటకు నిర్వచనం ఎక్కడా లేదు. అంటే తమకు

అనువుగా ఆ మాటను విడమర్చడానికి అవకాశాన్ని బీజేపీ ప్రభుత్వం అట్టి పెట్టుకుంది. సార్వ భౌమాధికారానికి హానికారక చర్యలు శిక్షార్హమంటూ కొత్త మాట తగిలించారు. ఏ చర్యలు ఈ నేరమనేది స్పష్టత లేదు. దీంతో పోలీసులు ఇష్టా రాజ్యపు అరెస్టులకు అవకాశం కలుగుతుంది. ఇప్పటి వరకు ఐపీసీలో లేని వ్యవస్థీకృత నేరం, తీవ్రవాద నేరాలు, మూకదాడి వంటివి నూతనంగా చేర్చారు. వివాదస్పద 'ఉపా' చట్టంలోని సెక్షన్లను తీసుకుని ఇందులో చేర్చింది.

## తీవ్రవాదం అంటే

తీవ్రవాదం అంటే ఏమిటో కేంద్రం తొలిసారి నిర్వచించింది. కొత్త బిల్లులో దాని పరిధిని నిర్దేశించింది. 'భారతదేశ సమైక్య తను, సమగ్రతను దెబ్బ తీయడమే లక్ష్యంగా దేశం బయట లేక లోపల ఉండి ప్రయత్నించేవారంతా తీవ్రవాదులే. దేశ విచ్ఛిన్నం లో భాగంగా జనజీవనాన్ని లేక అందులోని ప్రధాన సమూహాన్ని భయభ్రాంతులకు గురిచేయడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడాన్ని తీవ్రవాద చర్యలుగానే పరిగణించాలి. తీవ్రవాద చర్యలకు పాల్పడినా.. తద్వారా మరణాలు సంభవించినా మరణ శిక్ష లేదా పెరోల్ లేకుండా జీవిత ఖైదు విధించవచ్చు. రూ.10 లక్షలకు తక్కువ కాకుండా జరిమానా విధించవచ్చు. 'తీవ్రవాద నేరం రుజువై యావజ్జీవ శిక్ష పడిన వారి శిక్షా కాలం తగ్గించే అంశాన్ని ఏడేళ్ల శిక్ష అనుభవించిన తర్వాత పరిశీలించాల్సి ఉంటుంది. ఈ నేర చర్యలకు పాల్పడిన వారి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు' అని పేర్కొన్నారు. ఇప్పటి వరకు హత్యానేరాన్ని ఐపీసీ సెక్షన్-302 కింద నమోదు చేస్తుండగా ఇకపై అది బీఎన్ఎస్ 99గా మారనుంది. దర్యాప్తు జరుగుతున్నదంటూ పోలీసులు నిరవధికంగా ఆలస్యం చేయడా నికి గల అవకాశాలను తొలగిస్తున్నట్టు హోం మంత్రి తెలి పారు. వారు ప్రాథమిక అభియోగ పత్రాన్ని (చార్జిషీట్) దాఖలు చేయడానికి గరిష్టంగా 180 రోజుల వ్యవధి ఇవ్వను న్నట్టు వెల్లడించారు.

నేర పరిశోధనలో భాగంగా సోదాలు, స్వాధీనాలు జరిపేటప్పుడు పోలీసులు తప్పనిసరిగా వాటిని వీడియో తీయాలని, అది లేకుండా చార్జిషీట్‌ను అనుమతించడం జరగ దని ఈ బిల్లు పేర్కొంటుంది. ఇకపై ఎఫ్ఐఆర్ నుంచి కేసు డైరీ వరకు, చార్జిషీట్ నుంచి న్యాయం వరకు అన్నీ డిజిటలైజ్ అవుతున్నాయని పేర్కొన్నారు. అయితే, సాక్ష్యాల సేకరణ, విశ్లేషణ, వాటిని కోర్టులో వినియోగించే తీరుపై స్పష్టత లేదు. బెయిల్ నిర్ణయంలో చేపట్టాల్సిన సంస్కరణల్ని పట్టించుకో లేదు. విచారణ పేరుతో జైళ్లలో మగ్గుతున్న ఖైదీల గురించి, కిక్కిరిసిన జైళ్ల లాంటి సమస్యలను పట్టించుకోలేదు. కానీ న్యాయ సమీక్ష కు అందకుండా నిరవధికంగా జైలు పాలు చేసేందుకు అవకా శమున్న ప్రతిఒక్క సెక్షన్‌ను, చట్టాన్ని మానవీయ కోణంతో సవరించవలసిన అవసరం ఎంతైనా ఉంది. తీవ్రవాదులను శిక్షించే పేరిట ప్రభుత్వం తనకు గిట్టని వ్యక్తులను, మేధావులను జైల్లో పెట్టేందుకు వాడుకొంటున్న 'ఉపా' వంటి శాసనాలను కూడా పునఃపరిశీలించవలసి ఉంది. బెయిల్ కూడా నిరాకరిస్తూ నిరవధిక నిర్బంధానికి అవకాశం కలిగిస్తున్న చట్టాలను మార్చవలసి ఉంది.

అత్యాచారం నిందితులకు కనీసం పదేళ్లు, గరిష్ఠంగా జీవిత ఖైదు విధిస్తారు. సామూహిక అత్యాచారాలకు కనీసం 20 ఏళ్లు, లేదంటే జీవించి ఉన్నంత వరకు కారాగారం విధిస్తారు. అత్యాచార బాధితులు మరణించినా, కోమాలోకి వెళ్లినా నిందితుడికి గరిష్టంగా 20 ఏళ్లు కఠిన కారాగార శిక్ష విధిస్తారు. జీవిత ఖైదుకు పెంచే అవకాశం ఉంది. 12 ఏళ్ల కంటే తక్కువ వయసున్న బాలికపై అత్యాచారాలకు పాల్పడితే కనీసం 20 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తారు. మరణశిక్ష విధించవచ్చు. ప్రభుత్వాధికారులు, పోలీసు అధికారి, సాయుధ బలగాల సభ్యుడు అత్యాచారానికి పాల్పడితే కనీసం 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తారు. జీవిత ఖైదుకు మార్చవచ్చు. ఎన్నికల నేరాలకు కూడా శిక్షలున్నాయి. ఓటర్లకు తాయిలాలు ఇవ్వడం నేరంగా భావిస్తారు. ఓటర్లకు ఇచ్చే ఎన్నికల హామీని బహిరంగంగా ప్రకటించడం నేరం కాదు. సంస్థాగత నేరాలకు పాల్పడినా, అందుకు ప్రయత్నించినా, దానివల్ల ఎవరైనా మరణించినా మరణశిక్ష, లేదంటే జీవిత ఖైదు అనుభవించాల్సి ఉంటుంది. అలాగే, రూ.10 లక్షల జరిమానా చెల్లించుకోవాలి.

పాలనాపరమైన చర్యలను లేదా ప్రభుత్వ చర్యలను విద్వేషం రెచ్చగొట్టడానికి, ఏహ్యభావం పెంచడానికి, అసంతృప్తి వ్యక్తం చేయడానికి వాడుకోనంత కాలం కొత్త బిల్లు కింద నేరంకాదని అమిత్ షా చెప్పడం సన్నాయి నొక్కులు నొక్కడమే. ఇప్పటి వరకు మోడీ షా హయాంలో మోపిన దేశద్రోహ కేసులు ఏవీ ఈ సంయమనాన్ని పాటించిన ఉదంతమే లేదు. ఉన్న వెసులు బాట్లలోని సందిగ్ధతను తమకు అనుకూలంగా మార్చుకునే పాలకవర్గాలు చట్ట స్ఫూర్తిని గ్రహిస్తాయని చెప్పలేం. రాజకీయ ప్రాబల్యం ఉన్న నేరస్థులకు ప్రభుత్వం ఇష్టానుసారంగా శిక్ష తగ్గించడానికి వీలు లేకుండా ఈ బిల్లులు రూపొందించామని చెప్పడానికి అమిత్ షా బీహార్‌లో ఆనంద్ మోహన్ విడుదలను ఉదహరించారు.

కానీ 2002 నాటి గుజరాత్ మారణకాండలో మూకుమ్మడి అత్యాచారానికి బలైన బిల్కిస్ బానో వ్యవహారంలో శిక్షపూర్తి కాకుండానే దోషులను విడిచిపెట్టింది బీజేపీ ప్రభుత్వమేనన్న వాస్తవాన్ని అమిత్ షా మరుగుపరిచారు. చట్టం ఎంత కఠినమైంది, సవివరమైంది అన్న దానికన్నా దాన్ని

వినియోగిస్తున్న వారి ఉద్దేశం ఏమిటి అని చూసినప్పుడు బిజెపి చట్టస్ఫూర్తిని పట్టించుకున్న దాఖలాలే లేవు. అమిత్ షా ప్రతిపాదించిన బిల్లులు కాయకల్ప చికిత్స కన్నా హీనం.

**ముగింపు :**

నేర న్యాయవ్యవస్థలో సంస్కరణలు అవసరమే కాని, వట్టి చట్టాలు మారిస్తే సరిపోదు. నేరాలకు కఠిన శిక్షలు విధించడం, వాటిని నిర్దాక్షిణ్యంగా అమలు పరచడం ఒక పార్శ్వం. ఇప్పటికే నిర్భయ చట్టం వంటి తీవ్రమైన శిక్షలను ఉద్దేశించిన శాసనాలు ప్రభుత్వాల అమ్ములపొదిలో ఉన్నాయి. అంతమాత్రాన ఆ నేరాలు ఆగడం లేదు. ఇది అందరికీ తెలిసిన విషయమే. వ్యవస్థకు, పౌరులకు మధ్య బంధంలో మార్పు తేవాలి. ఎందుకంటే నిత్యం మహిళలపై ఎన్నెన్ని అక్రమాలు సంభవిస్తున్నాయో చెప్పడం కష్టం. 2021 నాటి జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో సమాచారం ప్రకారం ఆ ఏడాది దేశంలో 31,677 రేప్ కేసులు నమోదయ్యాయి. అంటే సగటున రోజుకు 86 కేసులు. 2020 లో 28,046 కేసులు, 2019లో 32,033 కేసులు రిజిస్టర్ అయ్యాయి. మహిళలపై అత్యాచారాలు ఏటేటా పెరుగుతున్నాయే గాని తగ్గడం లేదు. అత్యాచారాలు చేసే వారికి చట్టం గురించి తెలియదా? తెలిసీ దానిని ఖాతరు చేయకుండా నేరాలకు పాల్పడుతున్నారా? అదే జరుగుతుంటే అందుకు గల మూల కారణాన్ని శోధించి తగిన పరిష్కారాన్ని కనుక్కోవాలి. సాంస్కృతిక ఆధిపత్యం, సామాజిక ఆర్థిక అంతరాలు ఉన్నంత వరకు, స్త్రీని ద్వితీయశ్రేణి పౌరురాలిగా పరిగణించే ధోరణి ఉన్నంత వరకు శిక్షా స్మృతులను ఎంత కఠినంగా తీర్చిదిద్దినా ఆశించిన ప్రయోజనం ఉండదు. అన్ని నేరాల సందర్భంగానూ వాస్తవ స్థితిని తెలుసుకొని శాస్త్రీయమైన దృష్టితో చట్టాలను సవరించే వైఖరి సమాజానికి మేలు చేస్తుంది. న్యాయ వ్యవస్థ పైన విశ్వాసాన్ని పెంచుతుంది. దేశంలో, రాష్ట్రంలో ఉన్న అత్యున్నత న్యాయస్థానాలలోనే సరైన సిబ్బంది నియామకం చేయకుండా కోర్టులను నిర్వహిస్తూ సత్వర న్యాయమంటూ చిలుక పలుకులు పలకడం ఏలిన వారికి చెల్లింది. అంతేగాక ఉన్న చట్టాల పేరు మార్చి ఏదో జరుగుతోందని ప్రజలను భ్రమింపజేయడం ఎప్పటిలాగే వారి దిగజారుడుతనానికి నిదర్శనం. ❑

**(కొలిమి సౌజన్యంతో..)**

# అయోధ్యలో రామకథ ఆలయాలు

**మిగతా 11వ పేజీలో..** సుందర్ భవన్ మందిర్‌ను నాలుగు దశాబ్దాలుగా పూర్తిగా ఒక ముస్లిం నిర్వహిస్తున్నాడు. 1949లో ఆ ఆలయాన్ని స్వాధీనం చేసుకున్న మున్ను మియా 1992 డిసెంబర్ 23 దాకా దానికి మేనేజర్‌గా ఉన్నాడు. కొన్నిసార్లు భక్తులు చాలా తక్కువమంది వచ్చినప్పుడు పూజల సమయంలో మున్ను మియానే తన చేతులతో లయబద్ధంగా కరతాళ ధ్వనులు చేసేవాడు. అయోధ్య లో సత్యమేమిటో, అసత్యమేమిటో బహుశా ఆయన ఎప్పుడైనా ఆలోచించి ఉంటాడా ? అగర్వాల్‌లు నిర్మించిన ఒక ఆలయానికి చెందిన ప్రతి ఇటుక మీదా 786 అని చెక్కి ఉంటుంది. (786 ముస్లింల చిహ్నం). ఈ ఆలయం నిర్మించడానికి అవసరమైన ఇటుకలన్నీ రాజా హుస్సేన్ అలీఖాన్ సమకూర్చాడు. మరి ఈ ఆలయం నిర్మించిన అగర్వాల్‌లకు మతి చలించిందా ? ఒక ఆలయ నిర్మాణానికి ఇటుకలు విరాళం ఇస్తున్నప్పుడు హుసేన్ అలీఖాన్‌కు మతి చలించిందా? ఇక్కడ పూజ చేయడానికి ఎత్తుతున్న చేతులలో ఏవి హిందూ చేతిలో ఏవి ముస్లిం చేతులో గుర్తించలేం. అందరికందరూ పూజ కోసమే వస్తారు. అక్కడ ఇటుకల మీద చెక్కి ఉన్న 786 అనే చిహ్నం ఈ ఆలయాన్ని అందరి ఆలయంగా మార్చింది. మరి 1992 డిసెంబర్ 6 అనేది ఒక్కటే సత్యమా? 1992 డిసెంబర్ 6 తర్వాత అయోధ్యలోని చాలా ఆలయాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అన్ని ఆలయాలకూ తాళాలు వేయబడ్డాయి. హారతి ఆగిపోయింది. జనం ఆ ఆలయాలకు వెళ్లడం మానేశారు. రాముడి మీద తమదే పై చేయి కావాలనే కోరికతో గుమ్మటాల పైకెక్కిన వాళ్లను, ఆ మూసిన తలుపుల వెనుక కూచున్న దేవతలు శపిస్తూ ఉండి ఉంటారా? అయోధ్యలోని ఆ ప్రాచీన ఆలయాలు నెత్తుటి వాసననునిశ్వాసంగా వదులుతున్నాయా? ఆ నెత్తురు అయోధ్య లో, భారత్‌లో రాముడి పేరు మీద చిందించిన నెత్తురేనా? అయోధ్య అనేది ఒక పట్టణాన్ని ఒక "సమస్య"గా మార్చిన కథ. అయోధ్య అనేది ఒక నాగరికత మరణించిన కథ. ❑


# వాల్మీకి రామాయణంలో..

**13వ పేజీ తరువాయి..** రామాయణాన్ని 'వనవాసం' అని పిలుస్తారు. ఇందులో సీత, రావణాసురుడి కుమార్తె అని రాసుకున్నారు. రచయిత అజీజ్ తరువాన ప్రపంచంలోని వివిధ రామాయణాలలోని కథల్లో, పాత్ర చిత్రణల్లో వున్న వైవిధ్యం గురించి విశ్లేషించాడు. ఇంత వైవిధ్యమున్న రామాయణాన్ని ఒక సృజనాత్మక రచనగా స్వీకరిస్తే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుంది. ఇంత విస్తృతంగా పరిశోధించిన ఈ రచయిత దీన్ని ఒక సామాజికపరమైన కథగానే పరిచయం చేశారు. దేవుడు, భక్తి అనే మాటలు అసలు ఆయన పరిచయంలో ఎక్కడా కనిపించవు. ముస్లిం అయిన రచయిత హిందూ పురాణంపై విశేషంగా కృషి చేయడం అభినందించదగ్గ విషయం. పరమత సహనానికి, ప్రజాస్వామ్య విలువలకూ ఒక గొప్ప ఉదాహరణ !! ❑

# మానవేతిహాస మహాకావ్యం కమ్యూనిస్టు ప్రణాళిక



- ఎన్.వేణుగోపాల్




కమ్యూనిస్టు ప్రణాళికగా సుప్రసిద్ధమైన కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్‌ల సమష్టి రచన 'మానిఫెస్టో ఆఫ్ ది కమ్యూనిస్ట్ పార్టీ' వెలువడి నూట డెబ్బై ఐదు సంవత్సరాలు అయ్యింది. మూడేళ్ల కింద కమ్యూనిస్టు ప్రణాళికతోపాటు, ఎంగెల్స్ రాసిన 'కమ్యూని జం మూలసూత్రాలు' కలిపిన తెలుగు అనువాద పుస్తకం లక్ష ప్రతులు ముద్రించిన రెండు తెలుగు రాష్ట్రాలలోని ఐదు వామపక్ష ప్రచురణ సంస్థలు (ప్రజాశక్తి, నవ తెలంగాణ, విశాలాంధ్ర, నవచేతన, పీకాక్) ప్రత్యేక ఉత్సవం జరిపాయి. ఆ సందర్భంగా 2020 ఫిబ్రవరి 20న నేను ఫేస్ బుక్ మీద నా సంతోషాన్ని ప్రకటిస్తూ, ఆ ప్రచురణకర్తలకు అభినందనలు చెపుతూ తెలుగులో కమ్యూనిస్టు ప్రణాళిక ప్రచురణ చరిత్ర రాశాను. ఆ తర్వాత దొరికిన, జ్ఞాపకం వచ్చిన మరిన్ని వివరాలు రెండు రోజుల తర్వాత మళ్లీ ఫేస్ బుక్ మీదనే పంచుకున్నాను. ఇప్పుడు ఉమా నూతక్కి చేసిన కమ్యూనిస్టు ప్రణాళిక కొత్త తెలుగు సేత సందర్భంగా, అనువాదకులు ఉమా నూతక్కికీ, ప్రచురణకర్త విజయవాడ సాహితీమిత్రులు విశ్వేశ్వరరావు గారికీ హృదయపూర్వకమైన అభినందనలతో, కృతజ్ఞతలతో ఆ పాత వ్యాసమే చిన్న మార్పులతో మళ్లీ ఒకసారి..

కమ్యూనిస్టు ప్రణాళిక ఒక మహా కావ్యం. ఒక సామాజిక పరిణామ చరిత్ర. ఒక తాత్విక దృక్పథంలోకి ఆహ్వానం. ఒక సమగ్ర రాజకీయార్థిక, సామాజిక, సాంస్కృతిక విశ్లేషణ. ఒక భవిష్యత్ స్వప్నం. ఒక శాస్త్రీయ కార్యక్రమపు వ్యూహపత్రం. అది రాసిన 1840ల వర్తమానంలో స్థిరంగా నిలబడుతూనే తరత రాల గత చరిత్రలోకీ, భవిష్యత్ మార్గ నిర్దేశనంలోకీ చదువరుల కళ్లు తెరిచే అద్భుతమైన కరదీపిక. నావరకు నాకు పదమూడో ఏటనో, పద్నాలుగో ఏటనో మొదటిసారి చదివి, ఈ నలభై ఐదు సంవత్సరాలలో డజన్ల కొద్దిసార్లు మళ్లీ మళ్లీ చదివి, వందల సార్లు రాతలోనూ మాటలోనూ ఉటంకించిన సార్వకాలిక, సార్వత్రిక, సార్వజనిక సమగ్ర పత్రం అది. అది చేసిన విశ్లేషణ లు, ఇచ్చిన నినాదాలు, పలికిన మేల్కొలుపులు వందల కోట్ల జనాన్ని ఉర్రూతలూగించాయి. కదిలించాయి. సామాజిక పరి వర్తనకు ఉద్యుక్తుల్ని చేశాయి. విలువైన మనుషులుగా తీర్చి దిద్దాయి. ముప్పై ఐదు పేజీల ఈ మహోన్నత మానవ సృజన ఈ నూట డెబ్బై ఐదు సంవత్సరాలలో ప్రపంచంలోని వందలాది భాషల్లోకి అనువాదమైంది. వేలాది ప్రచురణల్లో కోట్లాది ప్రతులు అచ్చయ్యాయి. అవుతున్నాయి. పూర్తి పుస్తకంగానూ, ఉటంకింపులుగానూ, ఇతరేతర అంశాల సంకలనాలలోనూ ఎన్నెన్నిచోట్ల ఎన్నెన్ని రకాలుగా ఈ పుస్తకం ప్రాచుర్యంలోకి వచ్చిందో, ఆ చరిత్రే అనేక సంపుటాల ఉద్గ్రంథమవుతుంది. కమ్యూనిస్టు ప్రణాళికకు ప్రస్తుతానికి నాకు తెలిసి తెలుగులో ఎనిమిది అనువాదాలున్నాయి.

- 1. బహుశా మొట్టమొదటిది "కమ్యూనిస్టు కరపత్రము" పేరుతో "అనువాదం సామ్యవాది" "ఆదర్శ గ్రంథమండలి, ఎలమర్రు, కృష్ణా జిల్లా" ప్రచురణగా వెలువడింది. దాని ప్రచురణ 1934. అయితే దాన్ని "రెండవ కూర్పు" అన్నారు గనుక మొదటి కూర్పు అచ్చులో వెలువడిందా, రాతప్రతినో, సైక్లోస్టైల్ ప్రతినో మొదటి కూర్పుగా పరిగణించి దీన్ని రెండో కూర్పు అన్నారా తెలియదు. ఎక్కడన్నా ఆ రాతప్రతి, సైక్లో స్టైల్ ప్రతి దొరుకుతాయా అన్వేషించాలి. ప్రచురించిన ఆదర్శ గ్రంథమండలి గద్దె లింగయ్య గారిది గనుక ఈ అనువాదం ఆయనదే అయి ఉంటుందా అని ఒక అను మానం ఉంది. కాని ఈ అనువాదం "శ్రీ పాండురంగప్రెస్, ఏలూరు"లో అచ్చయినందు వల్ల పుచ్చలపల్లి సుందరయ్య గారిది కావచ్చునని అనిపిస్తున్నది. సుందరయ్య గారు

1933–34ల్లో ప్రణాళిక అనువాదం చేశాననీ, అది ముందు తన ఊళ్లో యువజన బృందం కోసం అనువాదం చేశాననీ, చేతిరాత ప్రతి ప్రచారంలో ఉండేదనీ, తర్వాత కాట్రగడ్డ నారాయణరావు, తాను దాన్ని అచ్చు వేయించడానికి డబ్బు ఏర్పాటు చేశామనీ, అదేమిటో ప్రింటింగ్ ప్రెస్ యజమానికి తెలియకుండా ఒక ఏలూరు ప్రెస్‌లో గారపాటి సత్యనారాయణ అచ్చు వేయించారనీ తన 'విప్లవ పథంలో నా పయనం'లో రాశారు. అలాగే, ఆ పుస్తకంలోనే సుందరయ్య గారు "1933–34లో కమ్యూనిస్టు మానిఫెస్టో అనువదించి ముద్రించే సందర్భంలో తరచుగా ఏలూరు, విజయవాడ మధ్య తిరగాల్సి వచ్చేది. నా సైకిలు వాహనం వుండనే వుంది గదా! ఒకోసారి సైకిలుపై ఏ అర్ధరాత్రో, అపరాత్రో విజయవాడ చేరేవాణ్ని" అని రాశారు. ఆయన రాసిన సంవత్సరాలను బట్టి, అచ్చయిన ఏలూరు ప్రెస్ ప్రస్తావనను బట్టి "సామ్యవాది" అనే కలం పేరుతో ఆ అనువాదం చేసినది సుందరయ్యాగారే అని నిర్ధారించవచ్చు. ప్రణాళిక బదులు కరపత్రము అని ఎందుకు వాడారో వివరణ ముందుమాట రాశారు. ఆ రోజుల్లోనే ఇది "ముద్రణ 2000 ప్రతులు" అని ఉండడం మరొక విశేషం. ఈ 109 పేజీల పుస్తకంలో ప్రణాళికతోపాటు ఎంగెల్స్ రాసిన 1888 ముందుమాట ఒక్కటే అనువదించారు. అలాగే "వ్యాఖ్యలు" అనే పేరుతో 35 వివరణలు, నాలుగు పేజీల ఇంగ్లిష్ పదాల తెలుగు అనువాద గ్లాసరీ ఇచ్చారు.

- 2.కంభంపాటి సత్యనారాయణ అనువాదం, త్రిలింగ పబ్లిషింగ్ కంపెనీ, విజయవాడ, మొదటి ప్రచురణ 1952 ఫిబ్రవరి. 'కంభంపాటి సత్యనారాయణ స్వీయచరిత్ర–రచనలు' అనే పుస్తకంలో ఇదే పుస్తకం గురించి "ద్వితీయ ముద్రణ 1956 ఆగస్టు" అని ఉంది. ఆ తర్వాత విశాలాంధ్ర ప్రచురణగానూ, ఇతర ప్రచురణల్లోనూ కూడ పునర్ముద్రణలు పొందినట్టుంది. ఇందులో వి జి కీర్నన్ 1944 ఆగస్టులో రాసిన ఉపోద్ఘాతం, ఎంగెల్స్ రాసిన ఒక ముందుమాట, "రయజనోవ్ వ్రాసిన మూలం నుంచి వి.జి.కీర్నన్ క్లుప్తీకరించి, సంస్కరించిన వ్యాఖ్యలు" అనే శీర్షికతో 68 వివరణలు ఉన్నాయి.
- 3. గిడుతూరి సూర్యం అనువాదం, విదేశ భాషా ప్రచురణాలయం, మాస్కో – మొదటి ప్రచురణ సంవత్సరం తెలియదు. బహుశా 1956–60 మధ్య అయి ఉండవచ్చు. సోవియట్ ప్రచురణల్లో ఈ ప్రచురణ వివరాలు వేసే అలవాటు ఉండేది కాదు. ఇదే ప్రతి ఆ తర్వాత ప్రగతి ప్రచురణాలయం ప్రచురణగానూ, విశాలాంధ్ర ప్రచురణగానూ చాలా పునర్ముద్రణలు పొందింది. ఇందులో ఎనిమిది వివరణలూ ఏడు ముందుమాటలూ ఉన్నాయి.
- 4.రాచమల్లు రామచంద్రారెడ్డి అనువాదం. ఇది యుగ సాహితి, ప్రొద్దటూరు/కడప ప్రచురణ 1968. ఎంగెల్స్ ఇచ్చిన 43 వివరణలకు రాచమల్లు రామచంద్రారెడ్డి అదనంగా మరొక 25 వివరణలు కలిపారు. ఈ ప్రతిని కామ్రేడ్ కొల్లా వెంకయ్య మెమోరియల్ లైబ్రరీ, పెదనందిపాడు 2015 మే లో పునర్ముద్రించింది. అలాగే ఇదే అనువాదాన్ని రంగనాయకమ్మ గారు తన పరిచయం, వివరణలతో కలిపి 2018 డిసెంబర్ లో స్వీట్ హోమ్ పబ్లికేషన్స్, హైదరాబాద్ ప్రచురణగా పునర్ముద్రించారు.
- 5. ఇంగువ మల్లికార్జునశర్మ అనువాదం. ఇది అనువాదకుడి స్వీయ ప్రచురణ. పుస్తకం మీద ప్రచురణ తేదీ లేదు. నాకు గుర్తున్నంతవరకు 1980–81ల్లో వెలువడింది. దీనిలో డెబ్బై వివరణలు, ఐదు ముందుమాటలు ఉన్నాయి.
- 6. ఎ.గాంధి అనువాదం. పీకాక్ క్లాసిక్స్ , హైదరాబాద్ ప్రచురణ, 2019. దీనిలో ప్రణాళికతో పాటు ఎంగెల్స్ రాసిన 'కమ్యూనిజం సూత్రాలు'కు గాంధి అనువాదం కూడ ఉంది. వివరణలు లేవు గాని మూలంలోని ఏడు ముందుమాటలూ ఉన్నాయి. ఈ పుస్తకాన్నే 2020లో ఐదు వామపక్ష ప్రచురణ సంస్థలు పునర్ముద్రించాయి.
- 7. మహీధర రామమోహనరావు అనువాదం. ఇది నా దగ్గర ఉండేది గాని ప్రస్తుతం దొరకడం లేదు.
- 8. కమ్యూనిస్టు ప్రణాళిక మార్క్స్-ఏంగెల్స్, తెలుగు సేత: ఉమా నూతక్కి. సాహితీమిత్రులు, విజయవాడ ప్రచురణ, 2023 సెప్టెంబర్. ఇందులో ప్రణాళిక అనువాదంతో పాటు, 1872 జర్మన్ ముద్రణకు మార్క్స్ ఎంగెల్స్ లు రాసిన ముందుమాటతో పాటు, ప్రకాశకుల మాట, శ్రీశ్రీ చేతిరాతలో ప్రతిజ్ఞ గేయం, ఆ గేయం రాయడానికి శ్రీశ్రీకి ప్రేరణ ఇచ్చిన లండన్ అభ్యుదయ రచయితల మానిఫెస్టో ఇంగ్లిష్ మూలం కూడా ఉన్నాయి.

## కేంద్రం పెత్తనంలోకి ఎన్నికల కమిషన్

**(16వ పేజీ తరువాయి)** ఒక్క సీఈసీకి మాత్రమే సుప్రీం కోర్టు జడ్జిల తరహాలో కేసుల నుంచి రక్షణ కల్పించబడింది. కోర్టుల జోక్యం కన్నా రాజకీయ జోక్యమే ఎన్నికల సంఘానికి సవాలు గనక ఆ ఒత్తిడి అలాగే వుంటుందన్న మాట. ఈ విధంగా సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉల్లంఘించి ఎన్నికల సంఘం బిల్లు తెచ్చారని ఎంపీలు విమర్శించగా రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధంకర్ ఆగ్రహించారు. సభలో మనం స్వతంత్రంగా నిర్ణయాలు చేయాలి గాని ఎవరి పెత్తనం మనపై వుండరాదని సూక్తులు చెప్పారు. వాస్తవంగా జరిగింది వేరు. అన్నివిధాల కేంద్రానికి లోబడి వుండేలా ఎన్నికల కమిషనర్ల నియామకానికి రంగం సిద్ధమైంది. ఇక ఎన్నికల స్వతంత్ర నిర్వహణ మరింత ప్రశ్నార్థకమవుతుంది. ❑

# లెనినిజం - వర్గ చైతన్యం

**రష్యన్ విప్లవ సారధి లెనిన్ శత వర్ధంతి సందర్భంగా..**



**- ప్రభాత్ పట్నాయక్**

'కార్మిక వర్గం దానంతట అదే విప్లవకర వర్గ స్పృహ సంతరించుకోదు. కార్మిక వర్గానికి అలాంటి వర్గ చైతన్యం బయట నుండి కల్పించాలి' అంటాడు లెనిన్. లెనినిజం మూల సూత్రీకరణలలో ఇదొకటి. అయితే ఇది లెనిన్ స్వయంగా కనుగొని చెప్పింది కాదు : కమ్యూనిస్టు ప్రణాళికలో మార్క్స్-ఎంగెల్స్‌లు దీని గురించి ప్రాథమికంగా చర్చించారు. "కార్మిక వర్గానికి తాను ఒక వర్గం అన్న స్పృహ కల్పించి వర్గ చైతన్యం పెంపొందించడానికి మూడు మార్గాలు ఉన్నాయి. ఫ్యూడల్ ప్రభువులతోనూ, ఇతర వర్గ శత్రువులతోనూ బూర్జువావర్గం చేసే పోరాటంలో దానంతట అదే కార్మిక వర్గాన్ని రాజకీయ పోరాటంలోకి లాక్కుని వస్తుంది. బూర్జువా వర్గం స్వీయ అవసరాల కోసం కార్మిక వర్గానికి తనదైన శైలిలో సాధారణ రాజకీయ విద్యను అందిస్తుంది. ఇది మొదటి మార్గం. రెండో మార్గం ఏమిటంటే - ఆధునిక పారిశ్రామిక రంగం విస్తరించే కొద్దీ పాలక వర్గాల్లోని కొన్ని శక్తులు పతనమై శ్రామిక వర్గంలోకి చేరతాయి. అలాంటి శక్తులు కార్మిక వర్గానికి నూతన చైతన్యాన్ని అందిస్తాయి. ఇక మూడో మార్గం విషయానికి వస్తే బూర్జువా సిద్ధాంతవేత్తలు ఎవరైతే సైద్ధాంతికంగా చారిత్రక పరిణామ క్రమాన్ని మొత్తంగా అర్థం చేసుకోగలుగుతారో వాళ్ళు శ్రామిక వర్గం పక్షాన చేరిపోయి వర్గం చైతన్యం పెంపొందించే కృషి చేస్తారు" అని వివరించారు మార్క్స్-ఏంగెల్స్. అంటే కార్మిక వర్గానికి వర్గ స్పృహ, వర్గ చైతన్యం వెలుపలి నుండి అందుతాయని మార్క్సిస్టు మహోపాధ్యాయులు చెప్పారు. అయితే లెనిన్ ఈ ఆలోచనలకు నిర్దిష్ట రూపం ఇచ్చి, ఈ సూత్రీకరణ కేంద్రంగా చేసుకుని కార్మిక వర్గానికి వెలుపలి నుండి చైతన్యం అందించి రష్యన్ విప్లవంలో వారిని అగ్ర భాగాన నిలిపాడు.

వర్గ స్పృహ - వర్గ చైతన్యం వామపక్ష అభిమానులు అని చెప్పుకునే కొందరితో సహా చాలా మందిలో శ్రామిక వర్గానికి బయటి నుండి చైతన్యం అందించాలనే సూత్రీకరణ పట్ల అపోహలు వున్నాయి. దీనివల్లనే శ్రామికవర్గ నియంతృత్వానికి బదులు శ్రామికవర్గం మీద నియంతృత్వం రుద్దబడుతుందనీ, ఈ సూత్రీకరణ అప్రజాస్వామికమైనదనీ అంచనాల్లో ఉన్నారు. ప్రజాస్వామ్యం అంటే వివిధ ప్రయోజనాలు గల ప్రజా సమూహాల మధ్య, అస్థిత్వాల మధ్య సర్దుబాటు కాదు. ఈ ప్రజా సమూహాలన్ని కలిసి నూతన సామాజిక తరగతిగా రూపాంతరం చెందే ప్రక్రియ. అట్లాంటి ప్రక్రియలో ప్రజలు వాళ్ళంతట వాళ్ళుగా భాగస్వాములు కారు. వెలుపలి నుండి ప్రజలకు అలాంటి ప్రజాస్వామిక చైతన్యం అందించాలి. కార్మికవర్గానికి ఎలాగైతే వెలుపలి నుండి సోషలిస్టు చైతన్యం అందించి వారిని విప్లవానికి సన్నద్ధం చేస్తామో అలాగే ప్రజారాశులకు కూడా వెలుపలి నుండి ప్రజాస్వామిక చైతన్యం అందించాలి. ప్రజాస్వామిక చైతన్యం అంటే అస్థిత్వ స్పృహ కాదు. అంతకుమించిన సమానత్వ భావన. ప్రజాస్వామ్యం అంటే వివిధ అస్థిత్వ సమూహాల మధ్య సర్దుబాటు అన్న సంకుచిత అర్థంలో తీసుకున్నా దానికదే ఒక ముందడుగుగా మనం భావించవచ్చు. దళితులు తమ హక్కుల కోసం ఉన్నత కులాలకు వ్యతిరేకంగా నిలబడి తగాదా పడ్డారనుకోండి అప్పుడు దళితులతో ఉన్నత కులాలు చర్చలకు సిద్ధపడినా లేక రాజ్యమే రెండు బృందాల మధ్యన రాజీకి ప్రయత్నించినా తప్పనిసరిగా అది విజయమే. పాత దోపిడీ సాంఘిక వ్యవస్థకు భంగపాటే. అయితే ఈ మాత్రంతో పాత సామాజిక వ్యవస్థ దెబ్బ తినిపోదు. ఆ వ్యవస్థ వల్ల తలెత్తుకు వచ్చిన పెత్తందారీ కుల వ్యవస్థ కూలిపోదు. నిజమైన ప్రజాస్వామ్యం అంటే పాత సాంఘిక - సామాజిక పెత్తందారీ వ్యవస్థ మొత్తంగా కూలిపోవాలి. సామాజిక అంతరాలు లేని సమత్వ భావనతో నూతన సామాజిక పొందిక ఆవిర్భవించాలి. ఇదంతా దానంతట అదే చోటు చేసుకోదు. ప్రయత్న పూర్వకంగా వెలుపలి నుండి చైతన్యం అందించడం ద్వారా మాత్రమే అసలు సిసలైన ప్రజాస్వామిక వ్యవస్థను స్థాపించుకోవడం సాధ్యపడుతుంది.

కాబట్టి కొంత మంది విమర్శించినట్లు వెలుపలి నుండి చైతన్యం అందించాలనే లెనిన్ సూత్రీకరణ ఎంత మాత్రం అప్రజాస్వామికం కాదు. ఇక వారి రెండవ విమర్శ కార్మికవర్గ నియంతృత్వానికి సంబంధించినది. వాస్తవానికి ఈ విషయంలో వారు లెనిన్ సూత్రీకరణను పొరబాటు అవగాహనతో వ్యాఖ్యానిస్తున్నారు. కార్మిక వర్గం అంటే జడపదార్థం అనీ, వారి బుర్రల్లోకి బయట నుండి సిద్ధాంతాన్ని నూరిపోస్తేగానీ విప్లవానికి సన్నద్ధం చెయ్యలేమనో, కార్మికవర్గం బుర్రలు శుభ్రమైన పలకల్లాంటివి, సిద్ధాంతవేత్తలు ఆ పలకల మీద కంప్యూటర్‌లో 'లాంగ్వేజ్ రాసినట్లు' విప్లవ కార్యక్రమాన్ని రాసేస్తే ఫిరంగుల్లా పేలతారనో భ్రమపడుతున్నారల్లే ఉంది. కాని లెనిన్ చెప్పింది ఇదేమి కాదు. విప్లవ క్రమంలో విప్లవ మేధావులు ముందుండి కార్మిక వర్గం అనే జడ పదార్థాన్ని సైన్యంగా మార్చి విప్లవాన్ని

తీసుకువస్తారని లెనిన్ ఎక్కడా చెప్పలేదు.

విప్లవానికి నాయకత్వం వహించేది కార్మిక వర్గమే అని లెనిన్ స్పష్టం చేశాడు. 'కార్మిక వర్గానికి వర్గ స్పృహ ఉంటుంది. అది సహజాతమైనది. అందుకే వారిలో బయట నుండి అందించే విప్లవ సిద్ధాంతాన్ని ఆకళింపు చేసుకుని, ఆచరించే శక్తి ఉంటుంది అని లెనిన్ చెప్పాడు. అంటే ఇక్కడ బయట నుండి అందించే సిద్ధాంతం కార్మిక వర్గంలోని వర్గస్పృహను వర్గ చైతన్యంగా మలిచేదిగా ఉండాలి. అది జరిగినప్పుడే శ్రామికవర్గ విప్లవ మహాప్రస్థానం మొదలవుతుంది.

సిద్ధాంతం ఆచరణల గతితర్కం - అయితే ఈ విప్లవకర ప్రస్థానం కూడా 'కేవలం' సిద్ధాంత జోక్యంతో సాధ్యపడుతుందనే నిర్ధారణకు రాకూడదు మనం. కార్మిక వర్గం జీతాల పెంపుదల కోసం, మెరుగైన పని పరిస్థితుల కోసం చేసే పోరాటాలతో రకరాల పొందికలుగా(కాంబినేషన్స్) ఏర్పడతారు. కార్మిక సంఘ చైతన్యాన్ని పెంపొందించుకుంటారు. ఈ పోరాటాల కాలంలోనే బూర్జువా రాజ్యం యాజమాన్యాల పక్షాన నిలబడి, వారి తరఫున కార్మికులను ఇబ్బంది పెట్టడం, అణిచి వెయ్యడానికి ప్రయత్నిం చడం అనుభవపూర్వకంగా తెలుసుకుని కార్మికవర్గం కేవలం యజమానులే కాదు, వారి దోపిడికి వత్తాసు పలుకుతున్న రాజ్యమూ వర్గ శత్రువే అన్న రాజకీయ అవగాహనకు వస్తుంది. ఇలా పోరాటాల ద్వారా కార్మికవర్గం తన రాజకీయ అవగాహన ను పెంచుకుంటుందనే విషయాన్ని కారల్ మార్క్స్ 'తత్వశాస్త్ర దారిద్ర్యం' అన్న పుస్తకంలో వివరించాడు. కార్మిక వర్గం స్వయంగా సంతరించుకునే ఈ చైతన్యం దానంతట అదే 'విప్లవకర చైతన్యం'గా మారదు. అందుకు బయట నుండి ప్రయత్న పూర్వకమైన కృషి అవసరం.

ఈ కీలకాంశాన్ని విస్మరిస్తే 'అనుభవం నుండే సిద్ధాంతం నేర్చుకుంటారు' అనే పేలవమైన వాదనకు జైకొట్టినట్లవుతుంది. సిద్ధాంతం తానంతట అదే స్వయం ప్రతిపత్తితో అభివృద్ధి అయ్యే ది కాదు. గతంలోని సైద్ధాంతిక కార్యాచరణ నుండి అనుభ వాలు, గుణపాఠాలు తీసుకుని నూతన సైద్ధాంతిక కార్యాచరణకు పూనుకోవడం, ఎప్పటికప్పుడు తాజా పరుచుకోవడం నిరంత రాయంగా జరగాల్సిన మార్క్సిస్టు-లెనినిస్టు కృషి. కార్మికులు తమకు వెలుపలి నుండి అందించే సైద్ధాంతిక విషయాలతో తమలోని వర్గ స్పృహను వర్గ చైతన్యంగా పెంచుకుంటారు. ఇదంతా తమ పోరాటాల కార్యచరణలోనే నేర్చుకుంటారు.

విప్లవకర శ్రామికవర్గ చైతన్యాన్ని పెంపొందించడం అనేది సిద్ధాంతం - ఆచరణల గతి తర్క మేళవింపు మీద ఆధారపడి ఉంటుంది. అలాంటి గతితార్కికత లోపిస్తే రకరకాల అనర్థాలు చోటు చేసేకుంటాయి. ద్వంద్వ వైఖరులు, ఒంటెద్దు పోకడలు, చతికిలపడడాలు వంటి వాటికి దారితీస్తాయి. 'లెనిన్ జ్ఞాపకాలు' పేరిట వెజ్జా కృపస్కయా రాసిన పుస్తకంలో అలాంటి ఉదాహరణలు ఎన్నో వివరించింది. ఇప్పుడు సాగుతున్న సోషల్ డెమోక్రాట్ ఉద్యమం (సోషల్ డెమోక్రాట్స్‌ను అప్పటి అర్థంలోనే చదువుకోవాలి)లో అలాంటి ద్వంద వైఖరులు చోటు చేసుకో రాదని లెనిన్ ఎంతగానో జాగ్రత్తలు తీసుకునేవాడని కృపస్కయా ఉదహరించింది. 'కార్మికులను కమిటీలలోకి తీసుకురావాలనీ, పార్టీ పని-కార్మికరంగంలో పని జమిలిగా సాగేలా జాగ్రత్తలు తీసుకొని వారిని విప్లవోద్యమ నాయకులుగా తీర్చిదిద్దే కృషి గురించి లెనిన్ తరచూ నొక్కి చెబుతుండేవాడనీ పేర్కొంది. కార్మికులలో వర్గ స్పృహ జడ పదార్థ లక్షణంతో ఉండదు. అది కార్మికుడిని అభివృద్ధి చేసి పదును తేలుస్తుంది. హఠాత్తుగా వారిలో విప్లవ చైతన్యాన్ని వెలికితెస్తుంది. కాబట్టి లెనిన్ చెపినట్లు కార్మిక వర్గానికి బయటి నుండి చైతన్యం అందించడం అంటే బయటి నుండి ఆదేశాలు ఇవ్వడం, సైద్ధాంతికంగా సామాజిక చెడుగులన్నింటికీ మూలమైన ఈ వ్యవస్థను ఏదో ఒకటి చెయ్య మని చెప్పడం కాదు. అలాంటి ఆదేశాలకు కార్మిక వర్గం స్పంది స్తుందనే గ్యారంటీ కూడా లేదు. పోరాటాల క్రమంలో కార్మిక శ్రేణుల్లో వర్గ స్పృహ పదును తేలి బయటి నుండి అందించిన సిద్ధాంత జ్ఞానం సరైనదన్న విశ్వాసం కలిగితేనే వారు వర్గ చైత న్యంతో సామాజిక మార్పుకోసం జరిగే పోరాటాల్లోకి వస్తారు.

### మాజీ సోషలిస్టు దేశాల్లో రాజకీయ నిర్వ్యాపకత (డీ - పొలిటిసైజేషన్)

రష్యాలో బోల్షివిక్ విప్లవం ద్వారా సాధించుకున్న సోషలిస్ట్ వ్యవస్థ కుప్పకూలిపోతుంటేనో, రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఐరోపా ఖండంలో వెల్లి విరిసిన సోషలిస్ట్ దేశాల్లో ఆ వ్యవస్థలు కూలిపోతుంటేనో కార్మిక వర్గం ఏం చేస్తున్నట్లు ? ఎందుకు ప్రతిఘటించనట్లు అని కొంతమంది ప్రశ్నిస్తుంటారు. దీని గురించి నిర్దిష్టంగా విశ్లేషించాల్సిందే. అయితే ఈ రాజకీయ నిర్వ్యాపకతను - లెనిన్ సూత్రీకరణను ఒకే గాటనగట్టి బయటి నుండి చైతన్యం అందిస్తే ఇలానే ఉంటుంది అని వాదించ బూనడం కువ్యాఖ్యలే. ఇవన్నీ పునాది లేని వాదనలే. సరిగ్గా చెప్పుకోవాలంటే ఈ ప్రశ్న ఇంకో విధంగా వేసుకోవాలి. కార్మిక వర్గ సిద్ధాంతం - ఆచరణల మేళవింపు కార్యాచరణలో ఎక్కడ లోపం జరిగిందీ అని పరిశీలించాలి. అది వదిలేసి సోషలిస్టు సిద్ధాంతమే పసలేనిదనే వాదనలు కమ్యూనిస్టు వ్యతిరేకులు చేసేవే తప్ప సమాజ చారిత్రక పరిణామక్రమం మీద అవగాహన కలవాళ్ళు మాట్లాడే మాటలు కాదు.

పోరాటాల ద్వారా శ్రామిక వర్గంలో వర్గస్పృహ పెరుగుతుంది. ఆ వర్గ స్పృహ వల్లనే వర్గ పోరాట సిద్ధాంతాన్ని ఆకళింపు చేసుకుంటుంది. ఈ క్రమానికీ, సోషలిస్టు ప్రజా స్వామ్యానికీ చాలా దగ్గరి లింకు ఉంది. (బూర్జువా) ప్రజాస్వామ్య వ్యవస్థలో సాధారణ ప్రజానీకం చాలా అంశాల పట్ల పట్టనట్లు వ్యవహరి

స్తారు. ఇదంతా 'పైనోళ్ళో' 'పెద్దోళ్ళో' చూసుకునే యవ్వారంలే అని మొహం తిప్పేస్తూ ఉంటారు. ఇదే పాలక శక్తులకు కలసి వచ్చే అంశం. కాని సోషలిస్టు ప్రజాస్వామ్యంలో ప్రజలు ప్రశ్నించడం నేర్చుకుంటారు. కాని దీనిలో ఇంకో సమస్య ఉందంటుంటారు. విప్లవ భవిష్యత్‌ను దెబ్బతీసే ఎలాంటి చర్యకూ అవకాశం ఇవ్వకూడదు. కాబట్టి నిర్ణయాధి కారం శ్రామికవర్గ ప్రజారాశుల చేతుల్లో పెట్టాలని ఏ సోషలిస్టూ అనుకోడు. ఫణంగా పెట్టేది ఎంతటి అమూల్యమైనదో తెలుసు కాబట్టి విప్లవ సమాజంలో శ్రామికవర్గ సార్వభౌమాధికారాన్ని పక్కన పెట్టి పార్టీ అగ్రభాగాన ఉన్న సిద్ధాంతవేత్తలూ, అనుభ వజ్ఞులూ నిర్ణయాధికారాన్ని తీసేసుకుంటారు. అంటే సోషలిస్టు సమాజంలో కూడా విప్లవాన్ని కాపాడుకునే పేరిట ప్రజాస్వా మ్యానికి అంటకత్తెర వేస్తారు అనేది ఇంకో వాదన. దీనితో ఎవరైనా ఏకీభవిస్తే అది పొరపాటే. నిజానికి శ్రామికవర్గంలో సహజాతంగా ఉండే వర్గస్పృహ విప్లవ భవిష్యత్తును ఏ మాత్రం దెబ్బ తీసేందుకు పురికొల్పదు. పై పెచ్చు వాళ్ళు విప్లవక్రమాన్ని ముందుకు కొనిపోయేందుకే తోడ్పడతారు. కాబట్టి నిర్ణయాధికారాన్ని శ్రామికవర్గ ప్రజానీ కానికి వదలడం ఏ మాత్రం ప్రమాదం కాదు, పైగా వాళ్ళను నిర్ణయాధికారంలో భాగస్వాములుగా చెయ్యకపోవడమే విప్లవ క్రమానికి ఆటంకాలు కలిగిస్తుంది. హాని చేస్తుంది. కాబట్టి విప్లవ ప్రయోజనాలు కాపాడుకునేందుకు శ్రామిక వర్గ సార్వభౌమాధి కారినిని ఏ సోషలిస్టు సమాజమయినా మన్నించి తీరాల్సిందే.

విప్లవకర అగ్రపార్టీలో ఉన్న మేధావులూ, అనుభవజ్ఞులంత సైద్ధాంతిక అవగాహన – శ్రామిక వర్గానికి లేనప్పటికీ అది తనలో ఉండే వర్గస్పృహ వల్ల తప్పుడు సిద్ధాంతాల నుండీ, పొర బాటు సూత్రీకరణల నుండీ విప్లవాన్ని కాపు కాసుకునేందుకు సిద్ధంగా ఉంటుంది. వారిలో ఉండే ఈ వర్గ స్పృహయే సోషలిస్టు ప్రజాస్వామ్యానికి పునాది. చరిత్ర నిర్మాణక్రమం అంతిమంగా వీరి చేతుల్లోనే ఉంటుంది. అందుకే మార్క్సిస్టు మహోపాధ్యాయులు చరిత్ర నిర్మాతలు ప్రజలే అని నొక్కి – చెప్పారు. సోషలిస్టు సమాజం ఏర్పడ్డాక ప్రజలను ముఖ్యంగా శ్రామికవర్గ ప్రజలను నిర్ణయాధికారం నుండి మినహాయిం చాలని ఏ సోషలిస్టు సిద్ధాంతంలోనూ లేదు. కాబట్టి లెనినిస్టు సిద్ధాంతంలో కార్మిక వర్గానికి బయట నుండి చైతన్యం అందిం చాలనే సూత్రీకరణ సహా, ఏ సూత్రీకరణా సోషలిస్టు ప్రజా స్వామ్యానికి వ్యతిరేకం అనేందుకు భూమికే లేదు. సోషలిస్టు వ్యవస్థలో విప్లవ క్రమాన్ని పరిరక్షించేందుకుగాను కార్మికవర్గాన్ని నిర్ణయాధికారా నికి దూరంగా ఉంచాలనే సూత్రీకరణ కూడా తప్పుడు సిద్ధాం తమే. సోషలిస్టు వ్యవస్థలో ఉత్పత్తి సాధనాల మీద సామాజిక యాజమాన్యం ఉంటుంది గనుక పెట్టుబడిదారీ విధానంలో మాదిరి ప్రజలను కేవలం ప్రేక్షక పాత్రకో, మార్కెట్లో సరుకులు కొనే కొనుగోలుదారుడిగా మాత్రమే చూసే, చేసే దురవస్థ ఉండదు. అసలు సిసలు ప్రజాస్వామ్య సాధన ఒక్క సోషలిస్టు సమాజంలో మాత్రమే సాధ్యం.

**(జనవరి 2024 మార్క్సిస్టు మాస పత్రిక నుండి)**

# ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ మహాసభలు

**14వ పేజీ తరువాయి :** శ్రీ యల్.బుల్లయ్య సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీవిస్కే చక్రవర్తి, ఆర్ట్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్వీహెచ్ శ్రీకాంత్, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ జె. లక్ష్మణ్ బాబు, డిపార్ట్మెంట్ ఆఫ్ సోషల్ సైన్స్ హెడ్ పీఎం శరత్ కుమార్ వివిధ అంశాలపై ప్రసంగించారు.

### చరిత్రను సుసంపన్నం చేస్తున్న కాంగ్రెస్ వార్షిక సభలు

నేటి పాలక ప్రభుత్వాల విధానాల వల్ల అంతరించి పోతున్న చరిత్రను రేపటి తరానికి తెలియజేసేలా 2024 జనవరి 6-7 తేదీలలో రెండు రోజులపాటు ఆంధ్ర ప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 46వ వార్షిక సభలు విశాఖపట్నంలోని డా.బుల్లయ్య కళాశాలలో జరిగాయి. కళాశాల స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ చరిత్ర సంఘం ఈ సభలు జరుపుతున్నట్లు నిర్వాహకులు ఆచార్య కె.అమ్మారెడ్డి తెలిపారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి చరిత్ర, సంస్కృతి చూస్తే ఆందోళన కలుగుతోందని, కళాశాలల్లో చరిత్రను బోధించే అధ్యాపకులు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన విద్య విద్యార్థులకు అందడం లేదన్నారు. చరిత్ర తెలియాలంటే చరిత్ర, సంస్కృతిపై నిత్యం పరిశోధనలు అవసరం అన్నారు. చారిత్రక కథనాల పరిశోధనకు ఈ సభలు ఎంతగానో దోహదపడ తాయని నిర్వాహకులు తెలిపారు. 1976లో కావలి జవహర్ భారతి కళాశాలలో డా. మలిరెడ్డి పట్టాభిరామరెడ్డి చొరవతో మొదలైన ఈ చరిత్ర సంస్థ క్రమం తప్పకుండా వార్షిక సభలు జరుపుకుంటుందన్నారు ఈ సభలలో సమర్పించిన పరిశోధక పత్రాలను ఎంపిక చేసి ఇప్పటివరకు 45 సంపుటాలను ప్రచు రించిందన్నారు. ఇవి పరిశోధకులకు ఎంతగానో దోహదపడ తాయని చెప్పారు. ఈ సంస్థ జరిపిన కృషితో అనేక మంది సీనియర్ చరిత్రకారులు, వర్ధమాన చరిత్రకారులు తమ పరిశోధ నలను ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక చరిత్ర రచన విభాగాల్లో సమర్పించి, దర్శించి తద్వారా తెలుగు చరిత్ర, సంస్కృతులను సంపన్నం చేశారన్నారు. ❑

# సోషలిజంతోనే ప్రగతిశీల సమాజం



- ఆర్.రఘు

**"రానున్న కాలంలో సోషలిజమా, లేక క్రూరమైన అనాగరిక సమాజమా తేల్చుకోవాల్సిన పరిస్థితి మానవాళి ముందుకు వస్తుంది" అని 150 సంవత్సరముల క్రితమే మార్క్స్ మహానీ యుడు హెచ్చరించాడు. ఆ హెచ్చరిక నేటి ప్రపంచానికి, అందులో మన దేశానికి సరిగ్గా సరిపోతుంది. నేడు సాధారణ మనిషి తాను ఓ అల్లకల్లోల ప్రపంచంలో ఉన్నాననిపించడం సహజం. కానీ, కొంచెం లోతుగా ఆలోచిస్తే విరుద్ధశక్తులను తన గర్భంలో "ప్రపంచం పురిటినొప్పులు పడుతున్నది" అన్న మార్క్స్ మాటలు ఈరోజు పరిస్థితులకు సరిగ్గా సరిపోతాయి.**

పెట్టుబడిదారీ వ్యవస్థ ఆరంభం అయిన తరువాత 1929-30 అతిపెద్ద ఆర్థిక సంక్షోభం (గ్రేట్ డిప్రెషన్) కన్నా ఉధృతమైన, సుదీర్ఘమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్న కొద్ది మన దేశంలో లాగానే అనేక దేశాలలో పచ్చి మితవాద ఫాసిస్టు తరహా ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి. మానవాళి రూపొందించుకున్న ప్రగతిశీల, ప్రజాతంత్ర, లౌకిక విలువలన్నింటి మీద పైశాచిక దాడులు జరుగుతున్నాయి. మహిళల మీద అత్యాచారాలు, అల్పజాతులు, కులాల మీద హింస పేట్రేగిపోతున్నది. వెరసి క్రూరమైన మధ్యయుగాలకు మళ్ళించే ప్రక్రియను ఫాసిస్టు ప్రభుత్వాలు తీవ్రతరం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో 20వ శతాబ్దం చివరి వరకూ కనపడ్డ ప్రపంచశాంతి అనే లక్ష్యం రష్యాలో కార్మికవర్గ ప్రభుత్వం పతనం కావడంతో క్రమంగా మసకబారిపోయింది. రెండవ ప్రపంచయుద్ధంలో చావు దెబ్బలు తిని అమెరికా మినహా మిగిలిన సామ్రాజ్యవాద దేశాలు చతికిలపడ్డాయి. ఇంగ్లాండ్ ప్రపంచ అధిపత్య స్థానాన్ని అమెరికా కైవసం చేసుకున్నది. ప్రపంచ యుద్ధం ముగిసిన మరుక్షణం నుండి సోవియట్ సోషలిస్ట్ రష్యాని బలహీన పరచడానికి అమెరికా పూనుకున్నది. ప్రచ్ఛన్న యు ద్ధాన్ని ప్రారంభించింది. 1990ల్లో రష్యా తదితర దేశాల్లో సోషలిస్టు వ్యవస్థలు కూలిపోయిన తర్వాత 30 సంవత్సరాలపాటు అమెరికా నాయకత్వాన సామ్రాజ్యవాద దేశాల ఆగడాలకు అడ్డే లేకుండా పోయింది. కానీ 2008లో అమెరికాలోనే ఆరంభమైన ఆర్థిక సంక్షోభం ప్రపంచం మొత్తాన్ని చుట్టుముట్టడంతో అమెరికాతో సహా సామ్రాజ్యవాద



దేశాలు, మొత్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థే కోలుకోలేని ఇరుకున పడిపోయింది. పర్యవసానంగా యుద్ధాలు, ఘర్షణలు, మారణ హోమాలు ప్రపంచమంతా నిత్య కృత్యమయ్యాయి. యూఎన్సహెచ్ఆర్ 2023 జూన్ 30 నాటికి విడుదల చేసిన సమాచారం ప్రకారం 32 దేశాలు తీవ్రమైన యుద్ధాల్లో మునిగి ఉన్నాయి. 11 కోట్ల 72 లక్షల మంది తమ దేశా లను విడిచిపెట్టి అత్యంత దయనీయమైన పరిస్థితుల్లో ఇతర దేశాల్లో తలదాచుకుంటున్నారు. ఈ క్రమంలో పెట్టుబడి దారీ ప్రపంచాన్ని కూడగట్టడానికి అమెరికన్ సామ్రాజ్యవాదం "నూతన ప్రచ్ఛన్న యుద్ధానికి" (న్యూకోల్డ్ వార్ ఎన్సిడబ్ల్యూ) తెరలేపింది. పచ్చి చైనా వ్యతిరేకత, పాశ్చాత్య దేశాలలో ఆసియా వ్యతిరేక జాతి ఉన్మాదాన్ని రెచ్చగొట్టడం లక్ష్యంగా ఈ నూతన ప్రచ్ఛన్న యుద్ధాన్ని ప్రారంభించింది అమెరికా. ఐక్యరాజ్యసమితితో సహా అన్ని అంతర్జాతీయ వేది కల్ని అమెరికా నిర్వీర్యం చేస్తున్నది. అంతర్జాతీయ తీర్మానాలను మూర్ఖంగా ఉల్లంఘిస్తున్నది. కానీ మరోవైపు సామ్రాజ్యవాద దేశాలకు వ్యతిరేకంగా బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) వంటి వేదికలు పుట్టుకొస్తున్నాయి. ఇప్పుడు నలభై దేశాలు ఇందులో తమకు సభ్యత్వం కావాలని దరఖాస్తులు పెట్టుకున్నాయి. యుద్ధం-శాంతి, పర్యావరణం, అసమానతలు లేని అభివృద్ధి శరణార్థుల వంటి అంశాలపై జరుగుతున్న చర్చలలో, తీర్మానాలలో, అంతర్జాతీయ వేదికల్లో అమెరికా ఒంటరిపాటు అవటం చూస్తున్నాం.

## చరిత్ర ఏం చెబుతోంది?

పరిస్థితులు నిరంతరం మారుతూనే ఉంటాయి. కానీ చరిత్ర అనేక పాఠాలను నేటి తరాలకు నేర్పుతూనే ఉంటుంది. అందులో కొన్ని చారిత్రక ఘటనలూ, వాటి ప్రభావాలు, అవి నేర్పే

గుణపాఠాలు చిరస్థాయిగా ఉంటాయి. అటువంటి ఓ మహత్తర చారిత్రక పాఠమే రష్యన్ కార్మిక వర్గ మహా విప్లవం. 1917 నవంబర్ 7న జయప్రద మైన ఆ మహా విప్లవం మానవ సమాజ చరిత్రను దోపిడీరహిత ప్రపంచం వైపు మళ్లించింది. నేడు రష్యాలో కార్మికవర్గ రాజ్యం, సోషలిస్టు వ్యవస్థ లేనప్పటికీ ఆ విప్లవ ప్రకంపనలు ప్రపంచాన్ని కుదిపే స్తూనే ఉన్నాయి అనడం అతిశయోక్తి కాదు. యుద్ధ రహిత, శాంతి భరిత ప్రపంచాన్ని సృష్టించగల శక్తి ఆధునిక కార్మిక వర్గానికే ఉంటుం దన్న చారిత్రక సత్యాన్ని ఆ కార్మిక వర్గ విప్లవం నిరూపించింది. ఆ విప్లవం జయప్రదమైంది. భయానకమైన మొదటి ప్రపంచ యుద్ధం సాగుతున్న కాలంలో. రెండో ఇంటర్నేషనల్ అది నాయ కత్వం ఆ యుద్ధానికి కారణమైన తమ తమ దేశాల పాలకుల ముందు మోకరిల్లి యుద్ధాన్ని ఆపండని ప్రాధేయపడ్డారు. ఆ సందర్భంలో లెనిన్ "పెట్టుబడిశక్తిని కూలదోయకుండా కార్మికవర్గం చేతిలోకి అధికారం మారకుండా శాంతిని సాధిం చలేం. సామ్రాజ్యవాదం యుద్ధం నుంచి బయటపడలేం" అన్నా డు. దీనికి ఆయన కారల్ మార్క్స్ బోధనలను ప్రామాణికంగా తీసుకున్నాడు. మార్క్స్ పెట్టుబడి దారీ వ్యవస్థను అసాంతం స్కాన్ చేసి మూడు ప్రధాన లక్షణాలను గుర్తించాడు. ఒకటి ఆర్థిక సంక్షోభాలు, రెండు అసమాన అభివృద్ధి, మూడు పై రెండిటి పర్యావసనంగా నిరంతరం యుద్ధాలు. పెట్టుబడిదారీ రాజ్యాలు దాని సాంఘిక వ్యవస్థలోని నిత్యం పెరిగే ముడి సరు కుల అవసరం, మార్కెట్లు, చౌకగా దొరికే శ్రమశక్తి వంటి పరిణామాల పర్యవసానంగా నిరంతరం యుద్ధాలకు దిగుతా యి. యుద్ధాలను నివారించాలంటే వాటి ప్రధాన కారణాన్ని నిర్మూలించాలి. అంటే పెట్టుబడిదారీ వ్యవస్థ స్థానంలో సోషలిస్టు వ్యవస్థను నిలబెట్టాలి" అని చెప్పాడు. ప్రపంచశాంతి శాశ్వతంగా నిలబడాలంటే ప్రపంచంలో సోషలిజం ఒక బలమైన శక్తిగా నిర్మితం కావాలి. ఆ శక్తి ఆధునిక కార్మిక వర్గానికే ఉంటుందని మార్క్స్, ఏంగెల్స్‌లు పెట్టుబడిదారీ వ్యవస్థ ఊపందుకుంటున్న దశలోనే (19వ శతాబ్దం ఆరంభం నుండే) గ్రహించారు. 1864 లో మొదట అంతర్జాతీయ కార్మిక సంస్థ (మొదటి ఇంటర్నే షనల్)ని ప్రారంభించారు. 1870ల నాటికి ఫ్రాన్స్, జర్మనీల మధ్య భీకరమైన యుద్ధం మొదలయ్యింది. ఇరు దేశాలలోనూ పెట్టుబడిదారీ పాలకులు జాతి ఉన్మాదాలను రెచ్చగొట్టి యుద్ధా నికి తమ దేశ ప్రజల్లో మద్దతు కూడగటానికి ప్రయత్నిస్తుంటే, ఇరు దేశాలలో కార్మిక వర్గం ఈ యుద్ధాల వలన శ్రామిక వర్గానికి కష్టాలే తప్ప లాభం ఉండదని, అందువలన ఇరుదేశాల కార్మికులనూ కార్మిక అంతర్జాతీయతపై నిలబెడదామని, యుద్ధా న్ని వ్యతిరేకిద్దామని పంపు కున్న ఉత్తర ప్రత్యుత్తరాలను గొప్ప ఉదాహరణగా పేర్కొన్నారు. 'సకల దేశ కార్మికులారా ఏకం కండు జయించడానికి ఓ ప్రపంచముంది" అని ప్రపంచ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. యుద్ధం-శాంతి సమస్యకు శాశ్వత ముగింపుని వివరిస్తూ "ఆర్థిక కష్టాలు, రాజకీయ చేతగానితనం సృష్టించే గత సమాజాలకు భిన్నంగా ఓ నూతన సమాజం మొగ్గ తొడుగుతున్నది. దాని అంతర్జాతీయ విధానం శాంతి. కారణం (ప్రతి దేశంలో) దాని జాతీయ పాలకులు ఒకరే. - వారే శ్రామి కులు" అని స్పష్టం చేశారు. కాగితంపై ఈ రాతల ఇంకు ఆరక ముందే 1871లో పారిస్ కార్మికులు కార్మిక రాజ్యస్థాపన (పారిస్ కమ్యూన్) చేసి 72 రోజులపాటు పాలించారు. భరించలేని పెట్టుబడి దారీ వర్గం, తన ఆగర్భ శత్రువులైన ఫ్యూడల్ పాలకు లతో కలిసి రక్తపుటేరుల్లో ముంచి సంబరాలు చేసుకున్నారు. కానీ వారి సంతోషం తెల్లారకుండానే రష్యాలో కార్మిక వర్గం విప్లవాలను ఆవిష్కరించింది. 1905 విప్లవాన్ని అణిచివేసినా మరల 12 సంవత్సరాలలోనే మహత్తర శ్రామిక విప్లవాన్ని జయప్రదం చేసి తొలి సోషలిస్టు రాజ్యాన్ని స్థాపించింది రష్యన్ కార్మిక వర్గం. అధికారంలోకి రాగానే కార్మిక రాజ్యం ప్రపంచ యుద్ధం నుండి వైదొలుగుతూ ప్రకటన గావించింది. మొదటి ప్రపంచయుద్ధాన్ని తొలి కార్మిక రాజ్యం అంతం చేసింది. 20 ఏళ్లు తిరగకుండా మరలా వచ్చిన రెండో ప్రపంచ యుద్ధంలో (1939-45) సగం కాలం సామ్రాజ్యవాదం తొలి సోషలిస్ట్ రాజ్యం సోవియట్ రష్యాను కూల్చడానికే వెచ్చించింది. వీరోచిత మైన ఎర్రసైన్యం, అశేష ప్రజాబలంతో హిట్లర్ని మట్టి కరిపిం చింది. ఫాసిస్టు యుద్ధం నుండి ప్రపంచాన్ని విముక్తి చేసింది. ఆ విధంగా యుద్ధాలనే కాదు, ఫాసిజాన్ని కూడా ఓడిం చగలిగిన శక్తి కమ్యూనిజానికి, కార్మికవర్గ విప్లవాలకే వుంటుందని రష్యన్ కార్మికవర్గ మహావిప్లవం నిరూపించింది.

**సోషలిజం సాధనే లక్ష్యం కావాలి..**

అందువలన రష్యన్ కార్మిక వర్గ మహా విప్లవస్ఫూర్తితో కార్మిక వర్గాన్ని విప్లవోన్ముఖులను చేయడమే ప్రధాన కర్తవ్యంగా కృషి ద్విగుణీ కృతం కావాలి. అమెరికాతో సహా అన్ని పారిశ్రామిక, అభివృద్ధి చెందిన దేశాలలో సైతం పెట్టుబడిదారీ వ్యవస్థ ఇంక ఫలితాలనివ్వలేవన్నది జనానికి తేలిపోతున్నది. ప్రత్యామ్నాయం కోసం యువత వెతుకులాడుతున్న తరుణం ఇది. అంత దీటుగా కార్మిక, ఉద్యోగ, శ్రామిక పోరాటాలు విస్తృతమవుతున్నాయి. ప్రజలు ఎదుర్కొంటున్న ఏ సమస్యకూ శాశ్వత పరిష్కారం చూప లేని స్థితికి మనదేశంలో లాగానే అనేక దేశాల్లో పాలకులు చేరు కున్నారు. రష్యాలో సోషలిస్టు వ్యవస్థ తొలి కార్మిక రాజ్యం కూలి ముప్పై ఏళ్లు గడిచిందో లేదో సోషలిజం తిరిగి ప్రపంచ ఎజెండా లోకి వచ్చేసింది. ఆకలి, పేదరికం, నిరుద్యోగం, అవిద్య, ఆర్థిక అసమానతలు లేని మనిషిని మనిషి జాతి, మతం భాష, కులం, ప్రాంతం పేరు మీద దోపిడీ చేయని ఓ ఉన్నత ప్రగతిశీల మాన వ సమాజం సోషలిజంలోనే సాధ్యమ వుతుందన్న స్పృహ ప్రపం చానికి కలగడం మొదలైంది. ఈ స్థితిలో పోరాటాలు, ఉద్యమా లు సాంఘిక విప్లవాలను పెంపొందడమే మన కర్తవ్యం. ❑

# భారత కమ్యూనిస్టు ఉద్యమం ఒక ఫీనిక్స్ ఉద్యమం



- సురవరం సుధాకర్‌రెడ్డి

నేను ఇక్కడ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర రాయడం లేదు. భారతదేశంలోని కమ్యూనిస్టు వామపక్ష ఉద్యమం ప్రభావం, దాని ఫలితాలు గురించి క్లుప్తంగా తెలియజేయదలచు కున్నాను. భారతదేశంలో సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపు ఇచ్చిన పార్టీ భారత కమ్యూనిస్టుపార్టీ. అంతవరకూ 'హోమ్ రూల్' పేరుతో కాంగ్రెస్ నాయకులపైన ప్రజల ఒత్తిడి పెరిగింది. తర్వాత అనేక సంవత్సరాలకు కాంగ్రెస్ సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపు ఇచ్చింది. కార్మికులకు, రైతులకు, విద్యార్థులకు తమ హక్కుల కోసం పోరాడేందుకు స్వతంత్ర ప్రజా సంఘాలను నిర్మించి ప్రశ్నించే హక్కు ఉద్యమాలను నిర్మించి సాధించేందుకు, మార్గదర్శకత్వం వహించింది.

మార్క్సిజం లెనినిజం సిద్ధాంతం ప్రాతిపదికన అక్టోబరు మహావిప్లవ స్ఫూర్తితో ఏర్పడిన భారత కమ్యూనిస్టుపార్టీ, కొద్ది డజన్ల యువ విప్లవ యువకులతో ప్రారంభమై కుట్ర కేసులతో జైళ్ళ పాలై, కొన్ని వందలమందికి విస్తరించింది. వేలు, లక్షల సంఖ్యలోకి పెరిగి భారతదేశంలో ఒక ప్రధాన రాజకీయపార్టీగా, ఉద్యమాల, త్యాగాల పార్టీగా మారింది. కేరళలోని పొన్నప్ర వయలార్ పోరాటాన్ని నడిపింది. అత్యంత నిరంకుశ, ఫ్యూడల్ సంస్థానంగా ఉన్న నైజాం సంస్థాన ప్రభుత్వానికి వ్యతిరేకంగా మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని నడిపింది. 4,500 మంది పైగా కమ్యూనిస్టులు తమ రక్తంతో, తమ కుటుంబాల కన్నీళ్ళతో తెలంగాణ గడ్డను తడిపి, ఫ్యూడలిజం నుండి విముక్తి చేసింది. సుప్రసిద్ధ జర్నలిస్టు, ప్రఫుల్ బిద్వాయి 'ది ఫీనిక్స్ మూమెంట్' పేర భారత కమ్యూనిస్టు వామపక్ష ఉద్యమంపైన ఒక విమర్శనాత్మకమైన పుస్తకం రాశారు. ఆయన అనేక గ్రంథాల రచయిత. ఇందులో ప్రధానంగా రెండు వామపక్షాల గురించి రాస్తూ, అనేక నక్సలైటు పార్టీల గురించి, కమ్యూనిస్టేతర, సోషలిస్టు ఉద్యమం గురించి రేఖామాత్రంగా వివరించారు. కమ్యూనిస్టుపార్టీల సుదీర్ఘ ప్రయాణంపై అనేక సానుకూల అంశాలతోపాటు అతి ఘాటైన విమర్శలు చేశారు.

భారతదేశంలో ఇతర శ్రామిక వర్గాలు, మధ్యతరగతి సంఘ మిలిటెంట్ పోరాటాలతోపాటు సాహిత్య,సాంస్కృతిక కళా రంగాలలో తెచ్చిన అద్భుతమైన ప్రగతిశీల ప్రభావాన్ని, పదుల లక్షల ప్రజలపై వాటి శక్తిమంతమైన ప్రభావాన్ని వివరించారు. అనేక చారిత్రక తప్పిదాలవల్ల భారతదేశ చారిత్రక పరిస్థితులకు అనుగుణంగా మార్క్సిజాన్ని అన్వయించడంలో స్వతంత్ర నిర్ణయాలు సరైన సమయంలో తీసుకోలేకపోవడం వల్ల నష్టపోయారని నిర్దాక్షిణ్యంగా విమర్శించారు.

## ఫీనిక్స్ అంటే ఏమిటి?

ఈజిప్టు, గ్రీకు మైథాలజీ పురాణాల ప్రకారం ఫీనిక్స్ అనే అందమైన రంగుల పక్షిని చంపినా, కాల్చి బూడిద చేసినా ఆ బూడిదలోంచి మళ్ళీ పునరుజ్జీవనం పొందుతున్నదని, భయమెరుగని శక్తిమంతమైన పోరాడే జీవి అని నమ్ముతాము. ఇదొక ఆధారం లేని నమ్మిక కావచ్చు, మూఢ నమ్మకం కావచ్చు. కానీ కమ్యూనిస్టు ఉద్యమాన్ని దీనితో పోల్చడం అద్భుతమైన పోలిక. ఈ పోలిక చూడగానే నాకు కొన్ని దేశాల కమ్యూనిస్టు పార్టీల పరిణామాలు గుర్తుకు వచ్చాయి. రష్యా, చైనాల తర్వాత ప్రపంచంలో అతిపెద్ద పార్టీ ఇండోనేసియా పార్టీ. 10 లక్షలమంది కమ్యూనిస్టులను సైనికాధిపతి సుహార్తో ఒక రాత్రి నిర్దాక్షిణ్యంగా హత్య చేస్తే పార్టీ ఇప్పుడు మళ్ళీ ఆవిర్భవించింది. మెకార్థియిజంను ఎదుర్కొన్ని అమెరికన్ కమ్యూనిస్టు పార్టీ పునరుజ్జీవనం పొందింది. వేలాది మందిని చంపినా గానీ ఇరాక్ పార్టీ పెరిగింది. కమ్యూనిస్టు పార్టీలు అసాధారణమైన వర్గ పోరాటాల పార్టీ. గత 98 ఏళ్లుగా ఢక్కా ముక్కీలు, నిమ్నోన్నతాలను చూసింది. పదుల, వేల సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు జైళ్ళలో నిర్బంధించబడ్డారు. హింసకు గురయ్యారు. ఈ ఉద్యమాల వల్ల వేలాది మంది అమరులయ్యారు. తప్పుడు కేసులకు గురి అయ్యారు. కుటుంబాల నుండి దూరమయ్యారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదం చేత, ఆ తర్వాత స్వాతంత్ర్యానంతరం పెట్టుబడిదారీ, మతోన్మాద రాజకీయ పార్టీల క్రూర నిర్బంధానికి గురయ్యారు. కానీ, ఒక రాజకీయశక్తిగా నిలదొక్కుకున్నారు. తప్పులు సరిజేసుకుని ఐక్య ఉద్యమాలు నిర్మించారు. ఓటమి నుండి కష్టాల నుండి మళ్ళీ అరుణ పతాకం సగర్వంగా ఎగిరింది. 1990వ దశకంలో సోవియట్ యూనియన్, సోషలిస్టు దేశాల క్యాంపు పతనమైన తర్వాత ప్రపంచంలో అనేక దేశాలతో కమ్యూనిస్టు పార్టీలు

అచేతనమయ్యాయి. అతివేగంగా విచ్ఛిన్నమయ్యాయి. పశ్చిమ యూరప్ దేశాలలో అత్యంత బలవత్తరమైన ఇటాలియన్, ఫ్రెంచ్ కమ్యూనిస్టుపార్టీలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒకప్పుడు ఇటలీలో మూడవ వంతు ఓట్లు పొందిన ఇటాలియన్ కమ్యూనిస్టుపార్టీని రద్దు చేసుకుని 'పార్టీ ఆఫ్ ద లెఫ్ట్' పేరుతో రూపాంతరం చెందినా ప్రభావం చూపలేదు. మళ్లీ పునరుజ్జీవనం చెందిన "రీ జనరేషన్ కమ్యూనిస్టు పార్టీ" ప్రారంభమై చీలికకు సరైన గుర్తింపు కలిగిన పార్టీగా పోరాటాలు నడుపుతోంది. సోవియట్ పతనానంతరం, ప్రపంచంలో అనేక కమ్యూనిస్టు పార్టీలు తీవ్రంగా నష్టపోతే భారతదేశంలో ప్రధాన స్రవంతి కమ్యూనిస్టుపార్టీలు దుష్ప్రభావాన్ని తట్టుకుని నిలదొక్కుకోవడమేకాక మరిన్ని ఉద్యమాలు, పోరాటాలు నడిపిందని పార్టీ సభ్యత్వాన్ని గణనీయంగా పెంచుకుందని ప్రజా సంఘాలను బలవత్తర సంఘాలుగా మార్చి మిలిటెంట్ ఉద్యమాలను నడిపిందని 'ఫీనిక్స్ మూమెంట్' రచయిత ప్రఫుల్ బిద్వాయి వివరించారు. పశ్చిమ బెంగాలు, త్రిపుర, కేరళ రాష్ట్రాలలో బూర్జువా ఎన్నికలలో గెలిచి సుదీర్ఘకాలం పరిపాలన సాగించడం గురించి వివరించారు. ఈ రాష్ట్రాలలో శ్రమజీవుల, రైతుల, వ్యవసాయ కూలీలకు అనుకూలంగా చట్టాలు చేసి కమ్యూనిస్టు ప్రత్యామ్నాయాన్ని రుజువు చేశారు. భారత రాజకీయ అజెండాను మార్చడంలో నిర్ణయాత్మక పాత్ర నిర్వహించారు. రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయీకరణ, బొగ్గు గనుల జాతీయీకరణను, మహాత్మాగాంధీ గ్రామీణ పథకాన్ని సమాచార హక్కు చట్టాన్ని సాధించారు. 2004లో 61 మంది కమ్యూనిస్టు పార్టీ పార్లమెంటు సభ్యులు మతోన్మాద రాజకీయపార్టీ అధికారంలోకి రాకుండా యూపీఏ ప్రభుత్వానికి బయట నుండి మద్దతు ఇచ్చారు. బలమైన ప్రభుత్వరంగాన్ని దేశంలో ఏర్పాటు చేసేందుకు, ఆ కార్మిక శ్రేణులకు మెరుగైన వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత సాధించారు. 1957లో ప్రపంచంలో మొదటిసారి బూర్జువా ఎన్నికలలో కేరళలో గెలిచి రికార్డు సృష్టించిన నాటి నుండీ నేటి వరకూ శక్తివంతమైనపాత్ర నిర్వహించేందుకు యావచ్ఛక్తితో కృషి చేస్తూనే ఉన్నాయి.

భారతదేశంలో దాదాపు అన్ని రాష్ట్రాల శాసనసభల్లో కమ్యూనిస్టు పార్టీ ప్రాతినిధ్యం ఉండేది. ప్రస్తుతం ఎలక్షన్ కమిషన్ వారి జాతీయ గుర్తింపును సిపిఐ కోల్పోయింది. ఇది కేవలం సాంకేతికమైన విషయం మాత్రమే. ఆరు లక్షల యాభై వేల సభ్యత్వంతో అండమాన్, నికోబార్, లక్షద్వీపాలతో సహా కమ్యూనిస్టుపార్టీకి వేలాది శాఖలు ఉన్నాయి. దాదాపు మూడు కోట్లమంది కమ్యూనిస్టులు పనిచేస్తున్నది ప్రజా సంఘాలు ఉన్నాయి. వారు అందరూ కమ్యూనిస్టులు కాదు, అవి స్వతంత్ర ప్రజా సంఘాలు. వారి సమస్యలతోపాటు జాతీయ సమస్యలు, ప్రభుత్వ రంగ పరిరక్షణ, ధరల సమస్యలపై కూడా ఈ ప్రజా సంఘాలు పోరాడుతున్నాయి. మరింత రాజకీయ చైతన్యం పెంపొందించాల్సి ఉంది.

"మా తాతలు నేతులు తాగారు, మా మూతులు వాసన చూడండి" అని చెప్పేందుకు ఇది రాయడం లేదు. మన రాజకీయశక్తి సన్నగిల్లినమాట నిజమే. కానీ కమ్యూనిస్టు, వామపక్షాలు, రాజకీయ ప్రభావం ప్రగతిశీల ప్రజలమీద, మేధావుల మీద ఈనాటికీ పెద్దది. గత అనేక దశాబ్దాలలో కమ్యూనిస్టులు కుల వివక్షకు, అంటరాని తనానికీ వ్యతిరేకంగా మహత్తర పోరాటాలు నడిపారు. పెద్దసంఖ్యలో కులాంతర వివాహాలు నిర్వహించారు. మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడి దేశంలో ఒక నూతన సామాజిక మార్పును సాధించారు. శాస్త్రీయ విజ్ఞానాన్ని విస్తృతం చేశారు. అందుకే కమ్యూనిస్టులను ఆర్ బిజెపిలు తీవ్రంగా ద్వేషిస్తున్నాయి. కమ్యూనిస్టులను చూసి భయపడుతున్నాయి. ఈరోజుఫాసిస్టు కార్పొరేట్ అనుకూల మతోన్మాద పార్టీని మనదేశంలో ఎదుర్కోవాల్సిన చారిత్రక బాధ్యత కమ్యూనిస్టులమీద ఉంది. ఇది సాధ్యమా? సాధ్యమే. తాత్కాలికంగా మత ప్రభావంతో ప్రజలలో గణనీయమైన భాగం బీజేపీతో ఉండవచ్చు. కానీ ప్రజలతో మెజారిటీ ప్రజాస్వామ్య భావాలు గలవారు వారిని సమీకరించేందుకు కమ్యూనిస్టులు ఇరుసుగా విశాల ప్రజా ఐక్యత సాధించాలి. దేశంలో ఉన్న అన్ని కమ్యూనిస్టు వామపక్షాల ఐక్యత, కనీసం ఐక్య కార్యాచరణ ప్రజలలో, ప్రతిపక్షాలలో విశ్వాసం కలిగిస్తుంది. కమ్యూనిస్టేతర సోషలిస్టు శక్తులు, కుటుంబ పార్టీలుగా మారిన బీహార్, ఉత్తర ప్రదేశ్ లాంటి రాష్ట్రాలలో శక్తిమంతమైన ప్రాంతీయపార్టీలుగా ఉన్నాయి. తమిళనాడులో మతోన్మాద, కులోన్మాద వ్యతిరేక పార్టీలు అధికారంలోనూ, ప్రతిపక్షంలోనూ ఉన్నాయి. బిజెపి వ్యతిరేక సెంట్రిస్ట్ పార్టీలు ఉన్నాయి. వీటన్నింటినీ సమైక్యం చేయాలి. సమావేశాల ద్వారా మాత్రమే ఈ ఐక్యత రాదు. ఉద్యమాలు, పోరాటాల ద్వారా, ఐక్య కార్యాచరణ ద్వారా ఎంతపరిమితమైనదైనా సాధించాలి. దీనికి ముందు షరతు సూత్రబద్ధమైన కమ్యూనిస్టు ఐక్యత, గతం తప్పుకోకుండా దేశం కోసం, ప్రజల కోసం, ప్రజాస్వామ్య రక్షణ కోసం, ఐక్యకార్యాచరణకు పూనుకున్నాం. కమ్యూనిస్టులతోపాటు విప్లవపార్టీలు, మేధావులు ఈ దిశగా ఆలోచించాలి. 98 సంవత్సరాల గర్వకారణమైన పోరాటాల చరిత్ర, అడుగడుగునా, రక్త తర్పణ చేస్తూ సాగుతున్న మన కమ్యూనిస్టుపార్టీలు ఈ అంశంపై వేగంగా స్పందించాలి. ఎర్రజెండాల ఐక్యత కోసం మార్క్సిజం బాటలో దోపిడీ వ్యవస్థను నిర్మూలించేవైపుకు పార్టీ వార్షికోత్సవం సందర్భంగా ప్రతిన చేద్దాం. భారత కమ్యూనిస్టుపార్టీ వర్ధిల్లాలి. వామపక్షాల ఐక్యత వర్ధిల్లాలి. సెక్యులర్ ప్రజాతంత్ర ఐక్యత వర్ధిల్లాలి. ❑

# మతం ఒక అబ్నార్మల్ జెనిటికల్ మ్యుటేయన్



- విరించి విరివింటి

తర్కం ఎక్కడ ఆగపోతుందో అక్కడ మతం మొదలవుతుంది. తర్కాన్ని ఏది నాశనం చేయగలదో అదే మతంలా అవతరించగల శక్తిని సంతరించుకుంటుంది. మతాన్ని అవలంబించే వారిలో తర్కజ్ఞానం కించిత్తయినా వుంటే ఉరేసుకు చస్తానన్నాడట వెనకటికొకడు. వారి మంత్రాలకూ, చేతివాటం కనికట్టులకూ చింతకాయలూ, శెనగపప్పులూ రాలేట్టయితే, మానవుడి పరిణామం ఇప్పటికీ జానెడు గుడ్డ అడ్డం పెట్టుకునే దగ్గరే ఆగి ఉండేది. "ప్రాచీన క్రిస్టియన్ సన్యాసి ప్రజల కోసం, వారి విముక్తి కోసం శరీరాన్ని శుష్కింపజేసుకుంటే, ఆధునిక సన్యాసి తన వ్యక్తిగత విముక్తికోసం ప్రజల శరీరాలను శుష్కింపజేస్తాడు అంటాడు" మార్క్స్ మహాశయుడు. ఇటువంటి స్వార్థ సన్యాసులతో మతం మొదలుతుంది. కానీ ప్రత్యక్షం, ప్రమాణం, అనుమానం పద్ధతిలో మొదలై ముందుకు సాగేది తర్కం. ప్రాచ్య పాశ్చాత్య మేధావులంతా తర్కాన్నే ఆశ్రయించారు. మన దగ్గరున్న అంగీకృత్య ఖండనం పాశ్చాత్య డయాలెక్టికల్ (dialècti-cal)కి దగ్గరి సంబంధం కలిగి ఉంటుందనటంలో సందేహం లేదు. ఎందుకటే అప్పటి ప్రపంచ మేధావులు తర్కాన్నే ఆశ్రయించారు తప్ప మతాన్ని కాదు. గ్రీకు 'జీనో' మొదలు పెట్టిన తర్కం సోక్రటీస్ నుండి, ప్లేటో నుండి ముందుకు సాగి హెగెల్‌తో జడలు విప్పి, వాద ప్రతివాద, సమన్వయ వాదాది త్రిక తర్కం (గతి తార్కికం)గా అవతరించింది.

ప్రపంచానికి భాష్యం చెప్పిన తత్వవేత్తలు మతం గుప్పిటిలో దాదాపు ఇరుక్కుపోలేదు. ప్రాచీన ఋషులెవరూ ఏ మతానికీ బందీ కాలేదు. కానీ జన సామాన్యం తత్వ శాస్త్రాన్నే కాదు తత్వవేత్తలనీ వదిలిపెట్టింది. సోక్రటీసుకు విషమిచ్చి చంపేసింది. అరేబియన్ తత్వవేత్త ఇబన్ రుష్ద్ పుస్తకాలనూ తగులబెట్టింది, డార్విన్ పుస్తకాలను తగులబెట్టింది. మనదేశంలో లోకాయత, భౌతికవాద దర్శనాలు నామరూపాలు కోల్పోయాయి. మొదటి నుండీ మతం తర్కాన్ని నాశనం చేయడం వలననే వృద్ధి చెందింది. తర్కాన్ని నాశనం చేయకుండా మతం మనలేదు. ఆల్జీబ్రానూ, జామెట్రీని కలిపి కార్టీజియన్ సిస్టం (Cartesian system) సృష్టించిన డెకార్టే (Descartes) వంటి గణితజ్ఞుడైనా తర్కం సహాయంతోటే దేవుడి ఉనికిని నిరూపించగలమనీ అన్నాడే తప్ప నమ్మకాలతో దేవుడి ఉనికిని గుడ్డిగా ఒప్పుకోలేదు. లెక్కలు చూస్తే గానీ తిక్కలు కుదరవని ఊరకే అనలేదు కదా. "బ్రైటర్ దాన్ థౌజండ్ సన్స్ (Brighter than thousand suns) పుస్తకంలో చెప్పినట్టు శాస్త్రవేత్తలను రాజ్యాధినేతలు తప్పు మార్గం పట్టిస్తే.. తార్కిక జ్ఞానంగల మనుషులను మతాలు తప్పుదారి పట్టిస్తాయన్న విషయం మధ్య యుగాల చరిత్రను చూస్తే అర్థమౌతుంది. తత్వ శాస్త్రం, మతం కలిసిపోవడమూ, మత కోణంలో తత్వ శాస్త్రాన్ని వివరించడమూ, తత్వాన్ని మత భావనల అభివృద్ధికి గురిచేయడమూ పరమ పాండిత్యంగా ఆవిర్భవించి పాండిత్యవాదానికి (Scholasticism) తెరలేపింది. మౌఢ్యానికి వ్యతిరేకమనిపించిన బౌద్ధం తాంత్రిక కౌగిలింతల్లో తేలియాడింది. యోగ మార్గం కన్నా జ్ఞానమార్గం గొప్పదన్న గీత "యజ్ఞం వలన మోక్షం వస్తుంద"ని చెప్పక తప్పింది కాదు. (అది ఖర్చుతో కూడుకున్న పనిగనుక జ్ఞానంతో సరితూ గదని అందులో సవరణ).

మతం, ప్రతివాదాన్ని (anti thesis) నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తుంది. ఏ మతమైనా తన మార్గమే గొప్పది అంటుంది. తాను చెప్పిన దైవమే అసలైన దైవం అంటుంది. తను చూపించిన మార్గమే దేవుని చేరు ఏకైక మార్గమనీ అంటుంది. తన ప్రవక్తనే చివరి ప్రవక్త అంటుంది. దేవుడు జడ్జిమెంటు ఇచ్చే రోజు ఒకటుంటుందని నమ్ముతుంది. ఇవన్నీ స్టేట్మెంట్లు అనుకుంటే, వాటికి వ్యతిరేకంగా ఎవరు ప్రతివాదాన్ని వినిపించినా, వెంటనే నాశనం చేయడమే మతం ఉనికికి చరమ మార్గం. పలానా పుస్తకంలో ఈ విధంగా రాశేశాడు దేవుడని చెబుతుంది మతం. దేవుడెందుకు రాశాడో, దేనితో రాశాడో, మనకు తెలియదు గానీ, అది అడిగే హక్కూ మనకు ఉండకూడదంటుంది మతం. ఆ విధంగా రాయబడి చెప్పబడీ ఉన్నందున ఆ విధంగానే చెయ్యాలి. వ్యతిరేకంగా చేస్తే దేవుడి పేరు చెప్పి మతానుయాయులే మనుషులను నాశనం చేయ పూనుకుంటారు. మతమంటే మొత్తానికి తప్పొప్పుల పట్టిక తప్ప ఇంకేమీ కాకుండా పోతుంది. ఈ పలానాది ఇలా చేయాలి, అలా చేయకూడదు అని సూత్ర మాలనొకటి తయారు చేసి పెడుతుంది. ఈ మూల సూత్రాలు కరడుగట్టిన తరువాత, మొదటికి ఎసరు బెట్టినట్టు, ఆ కాలానికి చెందిన విజ్ఞాన శాస్త్రాన్నీ తత్వశాస్త్రాన్నీ భ్రష్టు పట్టిస్తుంటుంది మతం. ఖగోళ శాస్త్రంలో గ్రీకులు బాబిలోనియన్లు సాధించిన విజయాలకంటే ఉత్కృష్టమైన విజయాలను మూటగట్టుకున్న భారతదేశం, ఆ తరువాతి కాలంలో అందులోకి మత భావనలను చొప్పించి ఆస్ట్రానమీని

ఆస్ట్రాలజీగా మార్చి పడేసింది. గ్రీకులు పైథాగొరియన్లు భారతీయులు వృద్ధి చేసిన అంక గణితం (number theory) చివరికి అంకెల జోస్యంగా (numerology) పరిణమించింది. భౌతిక శాస్త్రాలకు భాషగా ఉండవలసిన గణితం చివరికి కాకి లెక్కలకూ పిచ్చి గణనలకూ ఆలవాలమై పతనం చెందింది. గణితానికి మిస్టిసిజంను జతచేసే జాడ్యం క్రీ.పూ ఆరవ శతాబ్దానికి చెందిన పైథాగొరియన్ల నుండి మొదలైందని సరిపుచ్చుకున్నా, పాశ్చాత్య దేశాల్లో మధ్య యుగాల్లోనే (medieval period) పరిణతి చెందింది. చివరికి దాని ప్రభావం వలన విజ్ఞాన శాస్త్రం వృద్ధి చెందిన ఈ కాలంలో కూడా అదే పాత చింతకాయ పచ్చడిలాంటి మతం మాటలను వినడం, భూమి బల్లపరుపుగా ఉందని నమ్మడమే అవుతుంది.

ఈ మధ్య ఇంకో వాదన మొదలైంది. ఆ వాదన మత ప్రారంభకులను మహానుభావులుగా ఊహించే వాదన. ఆ మత ప్రారంభకులు ఏదైతే రాశారో, ఏదైతే చెప్పారో అది అన్నింటికంటే సర్వోత్తమం, సర్వోత్కృష్టం అంటారు వీరు. మత ప్రారంభకులు ప్రాణం పోయినా పొరపాటున కూడా తప్పు రాయరు, తప్పు చెప్పరు అనే ఒక ఫాల్లసీ వీరిని నడిపిస్తూ ఉంటుంది. తర్కంతో సాగే విజ్ఞాన శాస్త్రం దీనికి పూర్తి భిన్నంగా వాదిస్తుంది. పూర్వులు చెప్పిన దానిని సవరించుకుంటూ, అభివృద్ధి చెందుతూ సత్యం వైపుకు సాగేది విజ్ఞాన శాస్త్రమైతే, పూర్వులు చెప్పిందే పరమ సత్యమని, ఇక అనుమానానికీ, తర్కానికి ఏ మాత్రం చోటివ్వకుండా మతం సాగుతుంటుంది. ఈ వాదన ప్రకారం మతానికి సంబంధించిన ఆ పలానా పుస్తకంలో చెప్పినదంతా అత్యద్భుతమే.. పరమ సత్యమే కానీ ఆ మతాన్ని అనుసరించే వారు దానిని సరిగా అవగాహన చేసుకోలేకపోవటం వలనో, లేదా తప్పుగా అర్థం చేసుకోవటం వలననో మాత్రమే ఇన్ని మత సంబంధ మారణ హోమాలు జరిగాయనో వాదిస్తుంది. మతానుయాయుల్లో లోపాలుంటాయి గానీ, మతంలో, మత సూత్రాల్లో లోపాలే ఉండవంటుంది విచిత్రంగా. మతానుయాయుల్లో లోపాలు ఉన్నపుడు ఆ మతాన్ని ప్రారంభించిన వారిలో లోపాలు ఎందుకుండకూడదు అని మనం వీరిని అడగకూడదు. అడిగితే ఠారుమని నిటారుగా పైకిలేస్తారు. వీరి వాదన ప్రకారం మత ప్రారంభకులు దివ్య పురుషులన్నమాట. సగం అడ్డ గోచీలు కట్టుకుని, ప్రసార సాధనలు కూడా సరిగా చేయలేని పరమ అనాగరికమైన కాలం నాటి ఈ అమాయక మానవులు పరమ దివ్య పురుషులుగా ఎలా అయ్యుంటారో వీరు తప్ప బహుశా ఏ విజ్ఞాన శాస్త్రమూ చెప్పలేదనుకుంటా. అంతే కాకుండా మత సూత్రాలు గొప్ప నీతివంతమైన ఆలోచనలకు పునాదులని వీరు వాదిస్తారు. ఆ పురాతన కాలపు నీతి ఇప్పటి ఈ కాలపు నీతికి ఎట్లా అతుకుతుందో వారికే తెలియాలి. కప్ప బురద నుండి పుడుతుందని నమ్మిన అజ్ఞానాంధకార ప్రజలుండిన సమాజంలోని కిరాతక నీతి ఈ సమాజానికి సరిపోతుందని నమ్మేవారు, వాటిని ఈ కాలానుకనుగుణంగా మార్చాలని అనుకోకపోవడానికి ఈ మత ప్రారంభకుల మీది ఎనలేని అతి ప్రేమనే.

కాలం మారే కొలదీ మానవుని ఆలోచన పరిపక్వం కావలసిన అవసరం ఉంటుంది పరిణామ రీత్యా. కానీ దానిని పరిపక్వం కానీయకుండా పురాతన నమూనాలోనే ఉంచేయగలది మతం మాత్రమే. ఆదర్శ సమాజాలూ, స్వేచ్ఛా సమాజాలు ఉద్భవించాలంటే మతమన్నదే మొదటి అడ్డంకి. మానవ సమాజ పరిణామానికి అది గుదిబండ. మతం ఉండగా మానవుడు కొత్తగా ఆలోచించే అవకాశం ఎక్కడిది?. ఏది కొత్తగా ఆలోచించవలెనన్నా అదే మత భావనలను ఆలంబన చేసుకుని వీరు సాధించే పరిణామం ఏమిటి?. భారతదేశంలోని పురాతన కాలపు ఋషులూ, గ్రీకు లాటిన్‌లలోని తత్వ వేత్తలే ఈనాటి ఆధునికులకంటే నయం. ఋగ్వేద ఋషులు పునర్జన్మల కోసం, మరణానంతర దివ్య జీవనం కోసం కక్కుర్తి పడలేదు సరికదా, ఇటువంటి భావజాలంతో భవిష్యతరాలకు ఇబ్బందులు సృష్టించలేదు, పైగా భౌతిక సుఖలాలసతను దివ్య జీవనమనుకున్నారు. తమకు తెలియని ప్రపంచాన్ని పలు విధాలుగా తెలుసుకోవడానికి తమ వంతు ప్రయత్నాలు చేశారు. ఇప్పటి ఆధునికులు ఈ పూర్వీకులు కనుక్కున్న ఆ మాత్రం విషయాల్ని దివ్య పుస్తకాలుగా చదువుకుని తలలు బొప్పికట్టించుకుంటున్నారు. పొరపాటునో, గ్రహపాటునో ఆ పురాతనులు తాము కనుక్కున్న విషయాలను ఏదో రూపంలో దాచి ఉంచి పెట్టడమే ఆ తరువాత కాలంలో మతం మనకు చుట్టుకోవడానికి కారణం. వారు దాచి పెట్టి ఉంచడమేమోగానీ ఆధునికులకు మా తాతల మూతులు నేతులు నాకాయని చెప్పుకుంటూ తమ మత గొప్పదనమంతా పూర్వీకుల గొప్పదనమే అనే పటాటోప భావాలతో సంచరిస్తూంటారు. ఆ విధంగా మతం మనిషికి నతడి భావజాలానికీ సంఘర్షణ లేని ఒక రెడీమేడ్ వాతావరణాన్ని సృష్టిస్తుంది. అంతా రెడీమేడ్ వస్తువులు వచ్చేసాయని మనం ఇపుడు వాపోతుంటాం గానీ, మతమంటేనే రెడీ మేడ్ ఆలోచనలుగల భావజాలం. అందుకే అది తర్కాన్ని చిదిమేస్తుంది. అసత్యం నుంచి సత్యానికీ, చీకటి నుండి వెలుగుకూ, మృత్యువు నుండి అమరత్వానికీ పరిణామం చెందాలనే అద్భుత పరిణామాత్మక స్లోగన్‌ని ఇచ్చిన బృహదారణ్యకోపనిషత్తు మతం కోరలలో చిక్కి చివరికి దేవుడి పూజా గదిలో కుంకుమా పసుపుల మధ్యన పూజలు అందుకుంటుంది. ఈ దేశంలోగానీ మరేదేశంలోగానీ యుగయుగాలుగా మత భావనలకూ రాజ్యాధికారాలకూ, రాజకీయాలకూ విడదీయరాని సంబంధ బాంధవ్యాలు ఉండటం కనిపిస్తుంది. మానవుని ఆలోచనల పరిణామానికి మతం దానిని అంటి పెట్టుకుని ఉన్న రాజకీయాలూ **మిగతా 36వ పేజీలో..**

# శ్రీ యంవియన్ కపర్దీ
# శత జయంతి విశేష సంచిక



**ఆదర్శ కమ్యూనిస్టు - అరుదైన కార్మిక నేత**

- డి.వి.వి.యస్.వర్మ

కపర్దీ పేరే ప్రత్యేకమైనది. అది సాధారణ వినియోగంలో వున్న పేరు కాదు. పేరుకు తగ్గట్టే ఆయన ఒక అసాధారణ వ్యక్తి. విశిష్టమైన వ్యక్తిత్వం - విలక్షణ నేతృత్వం ఆయన సొంతం. పుట్టింది సంపన్న భూస్వామ్య కుటుంబంలో. ఆ కుటుంబానికి స్వాతంత్ర్యోద్యమ నేపథ్యం వుంది. గుంటూరు ఏసీ కాలేజీలో డిగ్రీ పూర్తి చేశారు. పైగా ఇంగ్లీషు, తెలుగులో మంచి వక్త. ఆ భాషా సాహిత్యాల మీద మక్కువే కాదు. మంచి పట్టు కూడా వుంది. సంస్కృతంలోనూ తగినంత ప్రవేశం వుంది. ఈ ప్రజ్ఞను ఆయన తన స్వంతానికి సంపాదనకు వినియోగించలేదు. కార్మికవర్గ కల్యాణానికి, శ్రామికవర్గ రాజ్యాన్ని సాధించే లక్ష్యానికి వినియోగం చేశారు. 1942లో తాడేపల్లిగూడెంలో అత్యంత నికృష్ట జీవితం గడుపుతున్న పంచాయతీ పారిశుధ్య కార్మికుల సంఘాన్ని స్థాపించడంతో కార్మికోద్యమ నిర్మాణ ప్రస్థానం ప్రారంభమైంది. 1981లో తుది శ్వాస విడిచే వరకు సమరశీల కార్మికోద్యమ కార్యకలాపాలలోనే జీవితం గడిపారు.




కపర్దీ గారిది గంపెడు సంసారం. భార్య శేషమ్మ గారు, తల్లి, అత్తగారు, ఎనిమిది మంది సంతానం. వీరికితోడు పెంచుకున్న బుజ్జమ్మ, రోజూ వచ్చిపోయే కామ్రేడ్స్. కమ్యూనిస్టు పరిభాషలో ఆ ఇల్లు ఒక కమ్యూన్. మన మాటల్లో ఒక ధర్మ సత్రం. నేను కమ్యూనిస్టు పార్టీలో పనిచేయాలన్న ఉత్సాహంతో ఇల్లు వదిలి వచ్చేస్తే కపర్దీ గారు నన్ను ఆ ఇంటిలోనే కొన్ని నెలలపాటు పెట్టుకున్నారు. గూడెంలో కపర్దీ గారికి అపారమైన పలుకుబడి వుంది. హేమా హేమీలైన స్నేహితులు ఉన్నారు. ఆ పరిచయాలను స్వంతానికి వాడుకోలేదు. ఆస్తిపాస్తులు పెంచుకోవడానికి వాడుకోలేదు. ఆ తరానికి చెందిన కమ్యూనిస్టులు కొందరు వచ్చిన అవకాశాలను స్వంతానికి వాడుకున్నారు. సంపన్నులయ్యారు. కపర్దీ గారు అలాంటి దారి తొక్కలేదు. అందుకే ఆదర్శ కమ్యూనిస్టు అయ్యా రు. కుటుంబంలో పిల్లలందరూ ఒకరిద్దరు మినహాయిస్తే మిగిలిన వారంతా కులాంతర వివాహాలు చేసుకున్నారు. సాదా సీదా జీవనం గడుపుతున్నారు. ఆ కుటుంబంలో ఎవరిని కదిలించినా మా తల్లిదండ్రులు మాకు ఏమీ సంపాదించి పెట్ట లేదు అన్నమాట వినిపించదు. పైగా తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛ, పంచిన ప్రేమా నురాగాలాపన చేస్తారు. అందరూ కమ్యూనిస్టులుగా అభిమా నులుగా కొనసాగుతున్నారు. రచ్చ గెలవడమే కాదు ఇంట కూడా గెలిచిన దంపతులు వారు.

కార్మికోద్యమంలో ఒక విల క్షణ నేత కపర్దీ. గూడెంలో ఒక చిన్న సంఘాన్ని స్థాపిస్తే దానిని రాష్ట్రవ్యాపిత సంఘం చేసి అనేక రాష్ట్రస్థాయి సంఘ టిత ఉద్యమాలకు ఆయన నేత అయ్యా రు. సమస్యల మీద కార్మికుల్ని సమీకరించడం అందరూ చేసేపనే. కార్మికులను సమీకరించడం వేరు. వారి మనసులను గెలుచుకోవడం వేరు. కార్మికుల కుటుంబ సమస్యలు, పిల్లల చదువు, ఆరోగ్య సమస్యలు అన్నీ కపర్దీ గారికి యూనియన్ సమస్యలే. వందల సంఖ్యలో కార్మికుల్ని పేరు పెట్టి పిలవగలిగేవారు. కార్మికుల జీవితాలతో పెనవేసుకుని ఉద్యమాలు నడిపిన విలక్షణ నేత కపర్దీ.

కపర్దీ గారు మూర్తీభవించిన ప్రజాస్వా మ్యవాది. కమ్యూనిస్టు నాయకుల మీద అపప్రద వుంది. కమ్యూనిస్టు పార్టీ సాధారణ సభ్యుడు కూడా ప్రధానిని ప్రశ్నిస్తాడు, ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తాడు, భూస్వామినీ ప్రశ్నిస్తాడు. కాని ఏ స్థాయిలోనూ పార్టీ కార్యదర్శిని ప్రశ్నించడానికి ధైర్యం చేయడన్న అపవాదు వుంది. కాని, కమ్యూనిజం ప్రశ్నించడాన్ని నేర్పుతుందని అదే చర్చకు, సరైన నిర్ణయాలకు దారి తీస్తుందని మనసా, వాచా, కర్మణా నమ్మినవారు కపర్దీ. ఆయన పార్టీ సమావేశాల్లో ప్రశ్నను స్వీకరించడమే కాదు. దానిని చర్చించడాన్ని ఆహ్వానించేవారు. ప్రశ్నలో ఔచిత్యం వుంటే దానిని భేషరతుగా ఆమోదించేవారు. కమ్యూనిస్టు నాయకులలో పరిపూర్ణ ప్రజాస్వామ్య వాది కపర్దీ గారు. కపర్దీ శత జయంతి విశేష సంచికను రూపొందించి ప్రచురించే అవకాశం దారి దీపం పత్రిక సంపాదకవర్గానికి కలగడం ఎంతో గర్వకారణంగా భావిస్తున్నాం. ఆదర్శ కమ్యూనిస్టు, అరుదైన కార్మిక నేతకు అరుణాంజలి ఘటిస్తున్నాం. ❑

పుస్తక
పరిచయం

# సనాతన ధర్మంలోని మర్మం విప్పిన కొడవటిగంటి కథలు



- కాత్యాయనీ విద్మహే

కొడవటిగంటి కుటుంబరావు సాహిత్యం అంతా 1931 – 1980 మధ్యకాలంలోది. చదివిన ఫిజిక్స్ బి.ఎ., 1930లలో అందివచ్చిన మార్క్సిస్టు అవగాహన ఆయన ఆలోచనలకు శాస్త్రీయమైన చూపును ఇచ్చాయి. ఆ క్రమంలోనే అరసం (1942) విరసం (1970) సహజంగా ఆయన చిరునామా అయినాయి. తనకు తెలిసిన మధ్యతరగతి జీవితాన్నే సృజన సాహిత్య వస్తువుగా స్వీకరించిన కుటుంబరావు సమాజంలో అధిక సంఖ్యాకులైన మధ్య తరగతిని చైతన్యవంతం చేయటం లక్ష్యంగా మొదటి నుండి అందులోని వైరుధ్యాలను శాస్త్రీయంగా విశ్లేషించటంలో శ్రద్ధ చూపుతూ వచ్చాడు. సాహిత్యాన్ని భావ విప్లవ సాధనంగా పదునెక్కించాడు. భారత సమాజ ఆధునికీకరణ అనివార్యంగా సనాతనధర్మంపై తిరుగుబాటు కాక తప్పదని సంస్కరణోద్యమాలు నిరూపించాయి. ఆ నేపథ్యంలో మధ్య తరగతి ఆలోచనలలో, అంతరాత్మలో, ఆచారాలలో, అలవాట్లలో భాగమై లౌకిక మానవ ఆకాంక్షలకు,ఆశలకు అవరోధం అవుతూ జీవితాన్ని దుఃఖభాజనం చేస్తున్న సనాతన ధర్మంతో సాంస్కృతిక రంగంలో చేయవలసిన యుద్ధం ఎలా ఉండాలో చూపించే కర్తవ్యాన్ని తనసాహిత్య సృజన ప్రారంభకాలం నుండే స్వీకరించిన వాడు కొడవటిగంటి కుటుంబరావు. నిత్యం, నిరంతరం సనాతనధర్మం పేరు మీద అసమానతలకు ఆమోదముద్ర వేస్తున్న సమకాలీన సాంస్కృతిక రాజకీయ సందర్భం నుండి ఆ కథలు ఇప్పుడు చదువుకోవలసినవి. అన్వయించుకోవలసినవి.

"వాళ్ళు వాళ్ళు అనేక విషయాల గురించి అనుకుంటున్న మాటలన్నీ జ్ఞాపకం వుంచుకొని వాటిని నిజం కింద అంగీకరించి, వాటి ప్రకారం ఆచరించటం బుద్ధిని ఉపయోగించటం కాదు. దేని గురించైనా నీ అభిప్రాయం ఒకటి ఏర్పరచుకోటం 'బుద్ధి" సూరి సిద్ధాంతం(1934) కథలో వాక్యం ఇది. సూరి సిద్ధాంతం శీర్షికతో కొ.కు. వ్రాసిన కథలు నాలుగు. కథకుడికి అతని స్నేహితుడు సూరికి మధ్య సంవాదాత్మక శైలిలో నడిచే ఉత్తమ పురుష కథనాలు ఇవి. మతానికి, ఆచారాలకు, నీతి అవినీతులకు సంబంధించి గతానుగతికంగా వస్తున్న భావాలను విమర్శకు పెట్టటం ద్వారా స్వతంత్ర బుద్ధి వికాసానికి దారులు తీసాడు కొకు.

మతం ఎవరికి వారు సృష్టించుకోవలసిందే తప్ప తాత తండ్రుల మతాలను యధాతథంగా అనుసరించరాదన్నది సూరి అభిప్రాయం. మతం అంటే అతని దృష్టిలో జీవనవిధానం. తమ వరకు అందివచ్చిన జ్ఞాన చైతన్యాలను బట్టి తమ అవసరాలను బట్టి ఎవరి జీవనవిధానం వాళ్ళే నిర్ధారించుకొంటారు. 'మతం కూడా ఆస్తల్లే, గుణాలల్లే, రోగాలల్లే వంశపారంపర్యంగా వస్తుందా ఏమిటి? అని హేళన చేయటంలో అంతరార్థం అదే. మతం వంశపారంపర్యంగా వచ్చేదే అయితే శూద్రులతో భోజనం చేసినప్పుడు, స్టీమరెక్కి విదేశాలకు పోయినప్పుడు, వితంతువును పెళ్ళి చేసుకొన్నప్పుడు ఎలా పోతుందని ప్రశ్నిస్తాడు. మతం వంశ పారంపర్యంగా రావటం, కొన్ని పనుల వల్ల పోవటం, ఒక పనివల్ల పోయిన మతం అట్లాగే పోక ఏ పని చేద్దామనుకొన్నప్పుడయినా అడ్డుగావచ్చి నిలవటం ఎంత హాస్యాస్పదమైనవో సూరి మాటల వల్ల స్పష్టమవుతుంది.

ఆచారాలే మతమనుకొనటాన్ని ఖండిస్తూ ఒకప్పుడు ఒక సామాజిక జీవితావసరాలలో భాగంగా రూపొందిన ఆచారాలు యథాతథంగా అన్ని కాలాలకు ఉపయోగపడవని కాలానుగుణంగా మనిషి జీవితంలో రావలసిన వికాసం గురించిన అవగాహన వున్న వాళ్ళెవరయినా గ్రహిస్తారని మనిషి ఉపయోగం కోసమే ఆచారాలు కానీ ఆచారాల కొరకు మనుషులు కాదని సూరి అభిప్రాయం. ఆహారం వంటి ప్రాథమికావసరాలు కూడా తీరని జనానికి వాటికి బదులు మతాన్నిస్తే మూఢ నమ్మకాలు వంటి జబ్బులు ప్రబలిపోతున్నాయంటాడు సూరి.

సనాతన ధర్మం అనేది స్త్రీలను అణగ ద్రొక్కటానికి, స్త్రీలపై దౌర్జన్యం జరపటానికి, బ్రాహ్మణాధిక్యతను స్థాపిస్తూ తదితర వర్ణాలను, మరీ ముఖ్యంగా పంచములను అవమానించటానికి, అణచి వేయటానికి సాంస్కృతిక సమ్మతిని సమకూరుస్తున్న విషయం కొకు అవగాహనలో ఉంది. మానవ జీవితంలో అభివృద్ధికి, మనుషుల మధ్య సమానత్వానికి, స్నేహానికి సనాతనధర్మం అడ్డు అవుతున్నది కనుకనే కొకు దృష్టిలో చీల్చిచెండాల్సిన అంశాలలో అది ప్రధానం అయింది. లోకంలోని కుసంస్కారాలు జీవన వికాసానికి అవరోధంగా ఉన్నప్పుడు చూసి చూడనట్లు ప్రవర్తించటం జీవన విధ్వంస కారణం అవుతుంది కనుక వాటిని ఏ కొద్దిగా నైనా మార్చటానికి ఎవరి పద్ధతులలో వాళ్ళు పనిచేయటం అవసరమని కొకు భావిస్తాడు. అలా ప్రయత్నించే వాళ్ళను జీవలక్షణం కలవాళ్ళు, జీవశక్తి కలవాళ్ళు అని అభిమానంగా పేర్కొంటాడు. జీవశక్తి అంటే కొకు దృష్టిలో కర్మశక్తి. సూరి సిద్ధాంతం కథలో బ్రాహ్మణులను జీవశక్తి

మందగించిన వాళ్ళుగా, ఇతర కులాలవాళ్ళని జీవశక్తి ఇంకా చావని వాళ్ళుగా వర్గీకరించి చెప్పాడు. భౌతిక కర్మ నుండి ఉత్పత్తి నుండి వైదొలగిన వర్గం బ్రాహ్మణులైతే తదితర కులాలు ఉత్పత్తిసంబంధంలో వున్న వర్గం. విధి నిషేధాల రూపంలో ఉత్పత్తి కులాలను అదుపు చేసే బ్రాహ్మణుల జ్ఞానశక్తిని తీవ్రంగా నిరసించాడీ కథలో. ఆ సందర్భంలోనే సూరి చేత "సనాతన మతం అన్నవాడినల్లా జైలులో పారెయ్యి!" అనిపించాడు. సనాతన మతం అభివృద్ధి నిరోధకమైంది, అసమానతలను పెంచి పోషించేది అని పూర్తిగా నమ్మాడు కనుకనే సనాతన మతవాదులు సమాజంలో చలామణిలో ఉండదగిన వాళ్ళు కాదని అను కొన్నాడు కొ.కు. అందువల్లనే సనాతన మతవా దుల జైలు నిర్బంధం ఆయన ఆకాంక్ష అయింది. ఆ ప్రజాస్వా మిక ఆకాంక్ష ఈ 88 ఏళ్ళలో ఆచరణ వాస్తవం కాకపోగా సనాతన ధర్మాన్ని కాదన్న వాళ్ల తలలకు వెలకట్టే వర్తమానంలో మనం మిగిలాం. అంతేకాదు, సనాతనధర్మం అనేది సామాజిక సాంస్కృతిక ఆవరణలు దాటి రాజ్యాధికారంగా మారితే ఎంత ప్రమాదకరమో అది కూడా ఇప్పటి మన అనుభవం. ఆ ప్రమాదాన్ని కొ.కు. 1943 నాటికే గుర్తించాడు అనటానికి నిదర్శనం 'దేశభక్తుడు' అనే కథ. వర్తమాన సామాజిక ప్రజా స్వామిక చింతనకు, దానిని సహించలేని రాజకీయార్థిక అధికార వికృతికి మధ్య వైరుధ్యాలను వ్యాఖ్యానించగల జీవశక్తి గల ఆ కథ మనం ఇప్పుడు తప్పక అధ్యయనం చేయవలసినది.

కథ శీర్షిక దేశభక్తుడు. అది 1943 మార్చిలో ఆంధ్ర అభ్యు దయ రచయితల సంఘం మహా సభల ప్రత్యేక సంచికలో ప్రచు రించబడింది. బ్రిటిష్ పాలకులు ఇండియాను వదిలివెళ్లటం, దేశానికి సంపూర్ణ స్వరాజ్యం లక్ష్యంగా జరిగిన ప్రచార కార్యక్రమం - క్విట్ ఇండియా ఉద్యమం అప్పుడే ముగిసింది. పదమూడు, పదునాలుగేళ్లుగా జాతీయోద్యమాన్ని సన్నిహితంగా చూస్తూ, భిన్నకోణాల నుండి అర్థం చేసుకొంటూ విలువకడుతూ వస్తున్న కొ.కు. సమకాలీన జాతీయోద్యమ స్వభావాన్ని అంచనా వేస్తూ , స్వతంత్ర భారత భవిష్యత్తును దర్శిస్తున్నట్లుగా నిర్మించిన కథ ఇది. దీనిని గొలుసు కథ అన్నాడు కొడవటిగంటి కుటుంబ రావు. సాధారణంగా గొలుసు కథ అన్నా, గొలుసు నవల అన్నా అవి సామూహిక సృజన ప్రక్రియలు. ఒకరు రచన ప్రారంభి స్తారు. వాళ్ళు ఆపినచోట ప్రారంభించి మరొకళ్ళు కథను నడిపి స్తారు. వాళ్ళు ఆపిన చోట మరొకరు కథను కొనసాగిస్తారు. ఇలా ఒకళ్ళ కంటే ఎక్కువ మంది చేత భాగాలు భాగాలుగా వ్రాయబడే కథలు, నవలలు గొలుసు కథలు, గొలుసు నవలలు. అయితే నాలుగున్నర పేజీల దేశభక్తుడు కథ కొకు ఒక్కడే వ్రాసాడు. మరి గొలుసు కథ అని ఎందుకు అన్నట్లు? కథ పూర్తయ్యేసరికి మనకు ఆ విషయం అర్థం అవుతుంది.

దేశ స్వతంత్ర ప్రతిపత్తిని, దేశ ప్రజలందరి సంక్షేమాన్ని కాంక్షించి అందుకు దారులు వెతికే వాళ్ళు, నమ్మిన మార్గంలో నడిచేవాళ్ళు దేశభక్తులు. కొడవటిగంటి కుటుంబరావు కథలో దేశభక్తుడు అల్లాంటివాడే. దేశం కోసం ఏదో సాధించాలనుకొని తపస్సు చేసాడు. తపస్సు ఫలించి దేశమాత ప్రత్యక్షం కావటం ఆమెకు, దేశభక్తుడికీ మధ్య జరిగిన సంభాషణ ఈ కథలో మొదటి భాగం. తపస్సు ఎందుకు అన్న దేశమాత ప్రశ్నకు దేశ క్షేమం కోసం, అభ్యుదయం కోసం అన్నది అతని జవాబు. ఇప్పుడు దేశానికి వచ్చిన ముప్పేమిటి అన్నది ఆమె ప్రశ్న. దాస్యం అన్నది అతని సమాధానం దేశ వాసులకు దాస్య విమోచనం అతని ఆకాంక్ష. దాస్యం ఎవరి వల్ల అన్నది ఆమె ప్రశ్న. పాశ్చాత్యుల వల్ల అన్నది అతని జవాబు. వాళ్ళు నీ ప్రజల కాళ్ళూ చేతులూ కట్టేశారా ? అన్నది ఆమె ప్రశ్న. కాదు కానీ వాళ్ళ వల్లే దేశ ప్రజలకు దారిద్ర్యం అని అతని సమాధానం. వాళ్ళు రాకముందు దారిద్ర్యం లేదా అని ఆమె రెట్టించి అడిగింది.అందరూ డబ్బు న్యాయంగానే సంపాదించారా అని నిలదీసింది. కొద్దిమంది దుర్మార్గులు సంఘంలో ఎప్పుడూ ఉంటారు. వాళ్ళు మిగిలినవాళ్లను దోచి ధనికులు అవుతారు అని నిజాయితీగా జవాబిచ్చాడు దేశభక్తుడు. వారి తరఫునే కదా నువ్వు తపస్సు చేస్తున్నది అని ఆంతర్యాన్ని ఆరా తీసింది ఆమె. కాదు కాదు నిజంగా దారిద్ర్యం అనుభవిస్తున్న కోట్లకొద్ది ప్రజల కోసం అని వివరణ ఇచ్చాడు అతను. నువ్వు కోరే దేశవిముక్తి ఏ విధంగా వాళ్ళ దారిద్ర్యం తొలగిస్తుంది అన్న ఆమె ప్రశ్నకు అతని దగ్గర జవాబు లేకపోయింది. జవాబు తెలుసుకొనటానికి అతను మళ్ళీ తపస్సు ప్రారంభించాడు.

ఈ సంభాషణ ద్వారా కొ.కు. ఏమి చెప్పదలచుకొన్నాడు? స్వాతంత్ర్య ఉద్యమ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటున్న ప్రజలు అందరూ దేశభక్తులే. దేశ క్షేమం, అభ్యుదయం కోరు తున్నవారే. దేశమంటే మట్టి అనుకొంటే బ్రిటిష్ వాళ్ళు దేశాన్ని వదిలి పోయి దేశీయులు పాలన చేపడితే సరిపోతుంది. దేశ మంటే ప్రజలు అనుకొన్నప్పుడు దేశం క్షేమం, అభ్యుదయం అనేవి వాళ్లకు భద్రమైన గౌరవకరమైన జీవిత వనరులను సమకూర్చటం అవుతుంది. అప్పుడు అభ్యుదయానికి గీటురాయి ప్రజలు దారిద్ర్యం నుండి విముక్తులు కావటం. అయితే అది పాశ్చాత్యుల పాలన అంతం కావటంతో సాధ్యమవుతుందనుకొ నటం భ్రమ అని చెప్పదలచుకొన్నాడు కొకు. అందుకే దేశమాత చేత పాశ్చాత్యులు రాక పూర్వం నీ దేశంలో దరిద్రులు లేరా అన్న ప్రశ్నను వేయించాడు. డబ్బు సంపాదన, సంపదల సమీ కరణలో న్యాయం పాత్ర చరిత్రలో ఎంతో తరచి చూడాలన్న సూచన ఇప్పించాడు. మిగిలిన వాళ్లను దోచుకొనటంలోనే కొద్ది మంది దుర్మార్గులు ధనికులు అవుతుంటారన్న వివేకం ఉండటం వరకు సరే.. ఆ వివేకం కలిగిన దేశభక్తుల కార్యదీక్ష దోచుకొనే దుర్మార్గుల ప్రయోజనాల కొరకా, దోపిడీకి గురవుతున్న ప్రజల

ప్రయోజనాల కొరకా అన్న ప్రశ్న దేశభక్తుడు ఎవరో నిర్ణయించటానికి అసలైన గీటురాయి. కథలో దేశభక్తుడు నిజంగా దారిద్ర్యం అనుభవిస్తున్న కోట్లకొద్దీ ప్రజల కోసం తన తపస్సు అని చెప్పి అసలైన దేశభక్తుడు అయినాడు. బ్రిటిష్ వలస పాలన నుండి విముక్తితో ఆ సమస్య తీరేది కాదన్న కొసమెరుపు సూచనతో ముగుస్తుంది ఈ భాగం.

ఆనాటి ఆ దేశభక్తుడు బహుళమై ఈ నాడు దేశద్రోహులుగా బెదిరింపులకు, నిఘాలకు, నిర్బంధాలకు, బహిష్క రణలకు, హత్యలకు గురి అవుతుంటే దారిద్ర్య సృష్టి కర్తలైన దోపిడీవర్గం దేశభక్తులుగా అధికార స్థానం ఆక్రమించి ఉండటం విషాదవాస్తవం. ఇక ఈ కథ రెండవ భాగంలో దేశభక్తుడి తపస్సు దేశవాసుల దారిద్ర్యం అంతమొందించ టం లక్ష్యంగా సాగింది. లక్ష్మీ దేవి ప్రత్యక్షం కావటం వాళ్ళిద్దరి మధ్యా సంభాషణ యథాపూర్వకమే. డబ్బంటే బీదలు పోగొట్టుకొని వస్తువు, ధనికులు దాచుకొనే వస్తువు. అని నిర్వచించి లక్ష్మీ దేవి వర్గతత్వం, కులతత్వం ఉన్న సాంఘిక వాతావరణంలో మళ్ళా మళ్ళా అట్లాగే ధనికులూ, బీదలూ ఏర్పడతారు అనిచెప్తుంది. కొందరు దరిద్రంలో ఉంటె తప్ప ఫ్యాక్టరీలలో పని చేయటానికి, రోడ్లు ఊడవటానికి, పాకీదొడ్లు కడగటానికి మనుషులు దొరుకుతారా అనుకొనే పెట్టుబడి దారీ వర్గతత్వం ఒకవైపు , ఒకవేళ ఆర్థిక సమానత్వం సాధ్యమైనా డబ్బుతో కొనరాని వాటన్నిటిని కిందికులాలకు అందకుండా దాచిపెట్టుకొనే పైకులాల ఆధిపత్య తత్వం మరొకవైపు సమానత్వానికి సవాళ్లు అవుతాయని మహాలక్ష్మి ముఖంగా చెప్పించాడు కొకు. సాంఘిక జీవితంలో స్వార్థం తెచ్చిపెట్టిన కులతత్వాన్ని సంబోధించకుండా దారిద్ర్యం నుండి జనాన్ని విముక్తం చేయటం, విముక్తం చేసినా దానిని నిలబెట్టటం సాధ్యం కాదన్న అవగాహనను ఇస్తుంది ఈ భాగం. ఇక దేశభక్తుడికి కులతత్వాన్ని అంతం చేయటమే తక్షణ కర్తవ్యం అయింది.

అందుకోసం తపస్సు చేయటం ప్రత్యక్షమైన శక్తితో సంభాషణ కథలో మూడవ భాగం. ఈ సారి ప్రత్యక్షమైన శక్తి అతి ముసలి వెధవముండ. పళ్లూడిపోయిన బోసినోరూ పొరలుగమ్మిన కళ్ళు పెట్టుకొని కనిపించింది.ఆమె దేశమాత లాగా, మహాలక్ష్మి లాగా ఒంటరిగా రాలేదు. వందిమాగధులతో వచ్చింది. ఆ దృశ్యాన్ని కథకుడు ఇలా వర్ణించాడు“ఆవిడ తన కాళ్ళ మీద నిలబడలేదనో ఏమో, పాపం దండ కమండలాలు ధరించిన ఒక సన్యాసీ, దర్భకట్టా, పంచాంగమూ చంకలో పెట్టుకున్న శు ద్ధ శ్రోత్రియుడూ ఆమె చెరొక రెక్కా పట్టుకొన్నారు. వెనుకగా వజ్రాల ఉంగరాలు ధరించిన ఒక వైశ్యుడూ, అధికారి దుస్తులు ధరించిన ఒక శూద్రుడూ ఉన్నారు. ఇంకా వెనకగా కత్తులూ , తుపాకులు ధరించి చింకి గుడ్డలు కట్టుకొని వొట్టి అమాయకపు మొహాల వాళ్ళు కొందరున్నారు. “ ఈ దృశ్య చిత్రణ ద్వారా రచయిత ఏమి చెప్పదలచుకొన్నాడు? ఆమె కులదేవత అని దేశభక్తుడి ముఖంగా వాచ్యం చేసాడు. సనాతన ధర్మం లో భాగంగా చెప్పబడుతున్న కులం చాలా పూర్వకాలం నుండి ఉన్నది కనుక ఇప్పటికి ముసలిదై ఉంటుంది కదా!? ఆ వూహ మీద ఆమెను పళ్లూడిపోయిన పోయిన బోసినోటి ముసలవ్వగా, దట్టంగా పొరలు కమ్మిన కళ్ళ పెద్దవ్వగా బొమ్మగీసాడు. ఆ తరువాతి కథలో కూడా ఆమె ముసల్దీ అనే సంబోధించబడింది. ఆ రకంగా కులదేవత వికృత రూపి, అశుభ మూర్తి. కాలం చెల్లిన ముసలమ్మను నిలబెడుతున్నది ఎవరు? సన్యాసులు బ్రాహ్మణులు. సంపన్న వర్గం, శూద్రవర్గం ఆమె సేవలో తరిస్తున్నది. ఇదంతా కలిసి ఒక అధికార వ్యవస్థ. దీని రక్షణకు సాయుధ సైన్యం కూడా తయారు చేయబడ్డది. సైన్య సమీకరణ బీద సాధారణ జనం నుండి జరిగిందని ‘చింకి గుడ్డల అమాయక మొహాలు’ అన్న విశేషణాలను బట్టి ఊహించవచ్చు.

కులతత్వం అంతం కావాలని, దేశం బాగుపడాలని తపస్సు చేస్తున్నట్లు దేశభక్తుడు చెప్పగానే వర్ణసంకరం కావటం దేశం బాగుపడటమా అని ఎద్దేవా చేసిన సన్యాసి , బ్రాహ్మడు చాతుర్వర్ణాలను నేనే సృష్టించాను అన్న భగవద్వాక్యాన్ని వల్లెవేయటమే కాక వర్ణాశ్రమ ధర్మాలు పోతే మనుష్యులకూ, పశువులకూ తేడా ఉండదని తేల్చేశారు. వర్ణాశ్రమ ధర్మాలు పాటించాలనే మహానుభావుల ఆజ్ఞలు పాటించే మనుష్యులకూ పశువులకూ మాత్రం తేడా ఏముందని దేశభక్తుడు వాళ్ళ వెనుక ఆయుధాలు పట్టుకొని నిలబడ్డ మూఢుల మొహాలు చూపిస్తూ వేసిన ప్రశ్నను విననట్లే కులదేవత ఇప్పటికన్నా బుద్ధి తెచ్చుకొని రామకృష్ణా అని ఇంత దైవ చింతన చేసుకో అని దేశభక్తుడికి హితోపదేశం చేసింది. తన మోక్షం గురించి అంత అక్కర ఉన్నవాళ్లకు దేశ ప్రజల దుర్దశ పట్టనిది ఎందుకవుతున్నది అని అతను నిలదీయటం ముసలి కుల దేవతకు సహించ రానిది అయింది. తమదారికి అడ్డం వస్తున్నాడు కనుక అతనిని దేశద్రోహిగా ప్రకటించింది. దేశవాసుల ప్రతినిధులంతా కూడా అదే అంటున్నారని తన వెనుక నిలబడ్డ వాళ్ళను చూపింది. దారిద్ర్యం సంగతి పట్టించుకోకుండా కులాన్ని నిలబెట్టటానికి తాత్వికతను, జ్ఞానాన్ని, ధనాన్ని, సేవలను, అందించటానికి నిలబడినవాళ్లు దేశ వాసుల ప్రతినిధులు కాజాలరు అన్నది దేశభక్తుడి అవగాహన, నిర్ధారణ. అతని ఈ ధిక్కారం అధికారానికి సవాల్ అయింది. కులతత్వం అంతం కావా లన్న లక్ష్యంతో తపస్సు ప్రారంభించిన అతనిని ఆ ప్రయత్నం నుండి విరమించు కోమని ఒత్తిడి చేసింది.

కులతత్వం అంతం అయ్యే మార్గాన్ని అన్వేషించటంలో దేశభక్తుడి తపస్సు ఒక మజిలీ. కులతత్వ నిర్మూలనకు ఆచరణ కార్యక్రమం ఇంకా రూపొందవలసే ఉంది. అయితే కుల అధి కారవ్యవస్థ దృష్టిలో కులం పోవాలని ఆలోచన చేయటం కూడా

తప్పే. ఆలోచించేవాడి మెడ మీద తలకాయ లేకుండా చేయటమే దానికి శిక్ష. ఆయుధపాణులను ఆజ్ఞాపించి దేశభక్తుడిని చంపించటం తో ఈ కథ ముగుస్తుంది. ఈ కథలోని మూడుభాగాలు క్రమంగా దాస్యం, దారిద్ర్యం, కులం అనే మూడంశాల మధ్య గొలుసు సంబంధాన్ని స్థాపిస్థాయి. ఒకదాని పరిష్కారం మరొక దానితో ముడిపడి ఉండటాన్ని నిరూపిస్తాయి కనుక కొకు దీనిని గొలుసు కథ అని ఉంటాడు.

దారిద్ర్యం దగ్గరనుండి కుల మత తత్వాలవరకు అన్నిటి నుండి తన జాతి విముక్తి కోరుకొన్నవాడు దేశద్రోహి అని తీర్పు ఇచ్చింది కులాన్ని ముందుపెట్టుకొన్న బ్రాహ్మణాధికారం. తల తీసెయ్యమని ఆయుధపాణులను ఆజ్ఞాపించింది ముసలిదైన కులదేవత. 'చింకి గుడ్డల అమాయక మొహాలు' కల ఆయుధపాణులలో తొలుత అందుకు నిరాకరించి వెనక్కు తగ్గిన వాళ్ళిద్దరి తలలు ఒరా నుండి కత్తి తీసి నరికేశాడు అధికారి. దానిని దేశభక్తుడు ప్రాణం అన్నిటికన్నా తియ్యనిది అనే సూత్రం మీద సంస్కారం ప్రచారం అవుతున్నదన్నమాట అని వ్యాఖ్యానించాడు. 'శరీర మాంద్యం ఖలు ధర్మ సాధనం' (ధర్మసాధనకోసం శరీరమే కదా మొదటిది / ప్రధానం) అన్న వాక్యంతో సన్యాసి దానికి ధర్మబద్ధతను సమకూర్చే ప్రయత్నం చేసాడు. ధర్మ సాధన అంటే సనాతన ధర్మ సాధనే. అందుకు ఉపయోగపడని శరీరం విలువలేనిది. నిర్దాక్షిణ్యంగా నిమిషాలలో అంతం చేయవలసినది. అలా అంతం చేయటం ద్వారా సనాతన ధర్మ రాజ్యం ఆజ్ఞ అనుల్లంఘనీయమన్న భయాన్ని సృష్టించటంతక్షణ ప్రయోజనం. బ్రాహ్మణీయ హిందూ మత ఫాసిజం ఎలా ఉంటుందో మచ్చు చూపిన కథ ఇది.

అదే సమయంలో చావైనా బతుకైనా విలువల కోసం అన్న విషయాన్ని సౌకర్యవంతంగా మరిచిపోతున్న జాతి ఏ విలువలనైనా వదిలేసి ఎలాగైనా బతికెయ్యటమే సంస్కారం అనుకొనే స్థాయికి దిగజారుతున్నస్థితిని గురించిన విషాద స్పృహను దేశభక్తుడి వాక్యంలో ధ్వనింప చేసింది ఈ కథ. అంతే కాదు. దేశభక్తుడి మరణాన్ని కుల రాజ్యం లోక కంట కుడి మరణంగా ప్రకటించటం చూస్తాం. "యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత, అభ్యుద్ధనామ ధర్మస్య తదాత్మానం సృజామ్య హం" అని సన్యాసి చదివిన భగవద్గీతా శ్లోకం ఈ కథకు అసలైన ముగింపు. ఎప్పుడెప్పుడు ధర్మానికి క్షీణత, అధర్మానికి అభివృద్ధి జరుగుతాయో అప్పుడు నేను అవతరిస్తాను అన్న శ్రీకృష్ణ వాక్యం అది. దారిద్ర్యం, కులతత్వం నశించాలనటం అధర్మం అయి, అందుకు ఆలోచిస్తున్న వాడిని చంపటం ప్రభుత్వ ధర్మం అయిన తలకిందుల వ్యవస్థకు న్యాయ సంబద్ధతను సమకూర్చే శక్తిగా మతం రాజకీయంతో జతకట్టటం ఇలా జరిగిందన్నమాట. కులం ఒక సామాజిక అసమవ్యవస్థకు కారణం. కులం స్థానంలో స్త్రీపురుష భేదం, మతం ఉత్పత్తి నమూనాలు, సంబంధాలు ఏవైనా పెట్టుకోవచ్చు. అవి కారణంగా ఏర్పడిన సామాజిక అసమానతలు పోవాలని, పోయే మార్గం ఏమిటా అని ఆలోచించే వాళ్ళు ప్రజల పక్షాన నిలబడ్డ వాళ్లు. అందువల్లనే రాజ్యాధికార వ్యవస్థకు ప్రమాదకారులు. కనుకనే వాళ్ళను దేశద్రోహులుగా చెప్పి ఉసురు తీయటం. దేశప్రజల కనీసావసరాలు తీరాలని, హక్కులు అందరికీ సమానంగా అనుభవానికి రావాలని, ప్రజలందరూ ఆత్మగౌరవంతో జీవించే అవకాశం వుండాలని కోరుకొనటం, అలాగని చెప్పటం, వ్రాయటం, దానిని వాస్తవీకరించే ఆచరణ మార్గాలను ఎన్నుకొని క్రియాశీలురు కావటం దేశ భద్రతకు, సమగ్రతకు, శాంతికి భంగకరమైనవిగా చెప్పబడుతున్నాయి. అసమానతలను, వైషమ్యాలను పెంచి పోషించే సనాతన మత సాంస్కృతిక వారసత్వాన్ని, ఆధునిక గుత్త పెట్టుబడుల బహుళజాతి ఆర్థిక ప్రయోజనాలను కలగలిపి పాలకవర్గాలు రూపొందించుకున్న విధానాలకు సామాజిక సమ్మతిని సంపాదించుకొనటం వర్తమాన రాజకీయ సమయం. దేశానికి స్వాతంత్ర్యం రావటానికి నాలుగేళ్ల ముందే అధికారం చేపట్టబోయే వర్గం స్వభావాన్ని వూహించాడా అన్నట్లుగా ఈ కథకు కొకు ఇచ్చిన ముగింపే స్వాతంత్ర్య అమృతోత్సవ కాల ముఖచిత్రం కావటం కళ్ళ ముందరి వాస్తవం. ❑

**'కొలిమి' సౌజన్యంతో**

---

# మతం ఒక అబ్నార్మల్ జెనిటికల్ మ్యుటేషన్

**29వ పేజీ తరువాయి**

రెండూ ప్రతిబంధకాలే. ప్రతీ వస్తువునూ వ్యాపారం చేయగలిగిన కాపిటలిజం కాలంలో మతం కొత్త వ్యాపారంగా ప్రజల ముందుకొచ్చింది. దైవ చింతన, మనన, ధ్యానం ఇపుడు లాభదాయక వ్యాపారాలు. దోపిడీ వర్గాలకు అందివచ్చిన నూతన మార్గాలు. కాలానుగుణంగా మతం తన దోపిడీ రూపాన్ని మార్చుకుంటూ మనిషిని తన సహజ పరిణామానికి దూరంగా ఉంచుతూనే ఉంది. మతం మానవుని పరిణామ దశను ముందుకు సాగనీయకుండా చేసే అబ్నార్మల్ జెనెటికల్ మ్యుటేషన్ (abnorma genetical mutation). దీనికి విరుగుడు తార్కిక చింతననే. తాము తార్కికులమనీ, ఆధునీకులమనీ, అభ్యుదయ వాదం మీద కూచున్న స్వేచ్ఛా పక్షులమనీ చెప్పే మహానుభావులు, మత భావనలను వదిలి పెట్టకుండా ఎలా తార్కికులయ్యారో చెప్పవలసి ఉంటుంది. వారి తార్కిక శక్తి ఏ పురాతన మత భావనలను నిలపటానికి ఉపయోగించుకుంటున్నారో ఆత్మ విమర్శ చేసుకోవలసి ఉంటుంది. ❑

పుస్తక
పరిచయం


## పాలగుమ్మి సాయినాథ్

# 'ఆఖరి పోరాటయోధులు'

- ఆర్వీ రామారావ్



మనకు 1947 ఆగస్టు 15న వచ్చింది స్వాతంత్ర్యమా, స్వేచ్ఛా అన్నది పెద్ద ప్రశ్న. స్వాతంత్ర్య సమరయోధులందరూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసమే పోరాడారు. మనకు స్వాతంత్ర్యం వచ్చిన మాట నిజమే. కాని స్వేచ్ఛ ఇప్పటికీ మృగ్యమే. ఉన్న కాస్తంత స్వేచ్ఛ గత పదేళ్ల మోదీ పాలనలో క్రమంగా అంతరించుకు పోయింది. ప్రసిద్ధ పత్రికా రచయిత పాలగుమ్మి సాయినాథ్ రాసిన 272 పేజీల "ది లాస్ట్ హీరోస్ : ఫుట్ సోల్జర్స్ ఆఫ్ ఇండియన్ ఫ్రీడం" గ్రంథంలో ప్రధానంగా చర్చించిన అంశం ఇదే. స్వాతంత్ర్య పోరాటానికి, మరో మాటల్లో చెప్పాలంటే గాంధీ, నెహ్రూ, పటేల్, మౌలానా అబుల్ కలాం ఆజాద్ లాంటి వందలాది మంది నాయకత్వం వహించిన మాట వాస్తవమే. ఇది జాతీయోద్యమంలో ప్రధాన స్రవంతి అన్నదీ నిజమే. కానీ చరిత్రకెక్కని అనేక మంది పోరాట యోధులు అసమానమైన త్యాగాలు చేశారు. వారి పేర్లు ఎక్కడా కనిపించవు. అలాంటి 16 మంది కొనసాగించిన పోరాటాన్ని సాయినాథ్ గ్రంథస్తం చేశారు. దీనికోసం ఆయన వందలాది మందితో మాట్లాడారు. ఈ గ్రంథంలో ఆయన ప్రస్తావించిన వారిలో అందరికన్నా తక్కువ వయసు కలిగిన వ్యక్తికి 92 ఏళ్లు. అందరికన్నా ఎక్కువ వయసున్న వ్యక్తికి 104 ఏళ్లు.




నాలుగు దశాబ్దాలపైబడిన పత్రికా రచన అనుభవం ఉన్న సాయినాథ్ ఎప్పుడూ పేదలు, దోపిడీ గురించే రాశారు. ఇది ఆయన రెండో గ్రంథం. మొట్టమొదటిది "ఎవ్రీబడీ లైక్స్ ఎ గుడ్ డ్రాట్". ఇది ఇప్పటికీ పునర్ముద్రితం అవుతూనే ఉంది. సాయినాథ్ తన వృత్తి జీవితంలో ఎక్కువ భాగం సామాన్యుల జీవితాలను, జీవిత విధానాలను చిత్రించడానికే కేటాయించారు. "ది లాస్ట్ హీరోస్"లో మాత్రం అసామాన్యుల పోరాట పటిమను చిత్రీకరించారు. మన దేశంలో పత్రికా రచనకు మొట్ట మొదటి సారి రామన్ మెగసేసే అవార్డు అందుకున్నది సాయినాథే.

కనీసం కొందరు స్వాతంత్ర్య పోరాట యోధుల కథలు చెప్పడానికి సాయినాథ్ ప్రయత్నించారు. ఈ కథలు ప్రస్తుత తరం చదివితే అపారమైన స్ఫూర్తి పొందుతారు. కానీ అలాంటి పాఠకులను వెతికి పట్టుకోవలసిన దుస్థితిలో ఉన్నాం.

ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీకి జాతీయ పోరాటంలో ఇసుమంత పాత్ర కూడా లేదు. పైగా స్వాతంత్ర్య పోరాటానికి 800 ఏళ్ల చరిత్ర ఉందని వీరు నమ్మబలుకుతుంటారు. స్వాతంత్ర్య అమృత మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వెబ్ సైట్‌లో ఇదే మాట చెప్పుకొచ్చారు. ఇందులో ముస్లిం వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోంది తప్ప స్వాతంత్ర్య స్ఫూర్తి మచ్చుకైనా లేదు. 1943లో బెంగాల్ కరువు కన్నా ముందు ఈ దేశంలో 31 సార్లు కరువు తాండవించిందని సాయినాథ్ అంటారు. ఈ కరువులన్నీ బ్రిటిష్ వలసవాదులు అనుసరించిన విధానాల ఫలితమేనంటారు. 1880 నుంచి 1920 మధ్య వచ్చిన కరువుల్లో కనీసం 165 మిలియన్ల మంది మరణించిన వాస్తవాన్ని సాయినాథ్ తెలియజేశారు. 800 ఏళ్ల వెనకకు స్వాతంత్ర్య పోరాటాన్ని తీసుకెళ్లడం ద్వారా బీజేపీ ప్రచారంలో పెట్టదలచుకున్నది ముస్లిం వ్యతిరేకత మాత్రమే.

అమృతోత్సవాల సందర్భంగా సిద్ధం చేసిన వెబ్‌సైట్లో బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ఆగడాల గురించి ఒక్క ముక్కైనా లేకపోవడం యాదృచ్ఛికం కాదు. బ్రిటిష్ వలస వాదులతో కుమ్మక్కైన చరిత్ర మాత్రమే ఉన్న బీజేపీ ఇంతకన్నా ఏం చేయగలదు కనక. అందుకే స్వాతంత్ర్య పోరాటాన్ని 800 ఏళ్లు వెనక్కు నెట్టి ముస్లిం వ్యతిరేకతను పెంపొందించే కుటిల యత్నం సాగుతోంది.

జాతీయ పోరాటంలో ఏ పాత్ర లేని వారికి అసత్య ప్రచారమే ఆలంబన. ఈ అసత్య ప్రచారం బీజేపీ చేతిలో పెద్ద ఆయుధం అయింది. దీన్ని ఎక్కడబడితే అక్కడ ప్రయోగిస్తూనే ఉన్నారు. ఈ కారణంగానే కరోనా మహమ్మారికి మన దేశంలో 40 లక్షల

మంది బలయ్యారని అంతర్జాతీయ సంస్థలు బయట పెట్టిన లెక్కలు మన దేశానికి వ్యతిరేకంగా పన్నిన కుట్ర అని బీజేపీ వాదించడంలో ఆశ్చర్యం లేదు. సాయినాథ్ రాసిన "ది లాస్ట్ హీరోస్" గ్రంథంలో కనిపించే శంకరయ్య, నల్ల కన్ను ఇప్పటికీ స్వేచ్ఛ కోసం పరితపిస్తూనే ఉన్నారు. శంకరయ్య, నల్లకన్ను కమ్యూనిస్టులు. శంకరయ్య గత సంవత్సరం నవంబర్ 15న 102 ఏళ్ల వయసులో ఊపిరి వదిలారు. నల్లకన్ను 98వ ఏడు పూర్తి చేసుకుని 99లోకి ప్రవేశించారు. వీరి ఆరాటం స్వాతంత్ర్య సముపార్జనతో పూర్తి కాలేదు. స్వేచ్ఛ కోసం ఆరాటమే వారిలో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. "ది లాస్ట్ హీరోస్" చదివితే జైలుకెళ్లిన వాళ్లు మాత్రమే స్వాతంత్ర్య పోరాట యోధులు కాదని ఆ పోరాటంలో పాల్గొన్న వారిలో రైతులు, కార్మికులు, వివిధ చేతి వృత్తుల వారు ఉన్నారని అర్థం అవుతుంది. అజ్ఞాతవాసం చేస్తున్న వారికి అన్నం వండి పెట్టిన వారు సైతం స్వాతంత్ర్య పోరాట యోధులే అని చెప్పడా నికే సాయినాథ్ ప్రయత్నించారు.

ఆయన గ్రంథం మొదటి అధ్యాయం గాంధీజీ మాటలను ఉటంకించడంతో మొదలవుతుంది. "ప్రపంచమంతటా గొప్ప వారు విప్లవాలకు కారణంగా కనిపిస్తారు. నిజానికి విప్లవాలు తీసుకొచ్చేది సామాన్యులే" అంటారు గాంధీజీ. ఈ దృష్టితో చూస్తే దెమరి దెయ్ సబర్ "సలిహాన్" స్వాతంత్ర్య పోరాట యోధుల జాబితాలో చేరరు. సలిహాన్ ఆమె గ్రామం. ఆమె ఎన్నడూ జైలుకు వెళ్లలేదు. కనీసం భారత ప్రభుత్వం తయారు చేసిన స్వాతంత్ర్య సమర యోధుల జాబితాలో ఆమె పేరు కనిపించదు. కానీ పదహారేళ్ల వయసులో ఆ గిరిజన బాలిక మరో నలభై మందితో కలిసి కేవలం లాఠీలతో బ్రిటిష్ వారిని ఎదిరించారు. శాసనోల్లంఘన ఉద్యమంలో, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనకపోయినా వారూ స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములేనంటారు సాయినాథ్. సలిహాన్ గ్రామంలో ఓ శిలా ఫలకంపై 17 మంది స్వాతంత్ర్య యోధుల పేర్లు నమోదై ఉన్నాయి. అందులో దెమరీ దే సబర్ పేరు లేదు.

స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వారిలో మిగిలే వారు మరో రెండు, మూడేళ్లలో ఎవరూ మిగలకపోవచ్చు. భవిష్యత్ తరాల వారికి ఈ యోధులను కలుసుకోవడానికి, వారి మాటలు వినడానికి, మాట్లాడడానికి అవకాశమే ఉండదు. సాయినాథ్ ఈ పుస్తకం రాస్తున్న క్రమంలోనే అంటే 2021 మే తర్వాత ఆరుగురు స్వాతంత్ర్యయోధులు మరణించారు. కేంద్ర ప్రభుత్వం దగ్గర వున్న జాబితాలో కనీసం 23 వేల మంది ఇలాంటి యోధుల పేర్లున్నాయి. ఇంకా వేలాది మంది పేర్లు ఈ జాబితాలోకి ఎక్కనే లేదు. అజ్ఞాతంగా ఉండి పోరాడిన వందలు, వేల మంది పేర్లు కూడా ప్రభుత్వ లెక్కల్లో చేరలేదు. వీరిలో ఎక్కువమంది శాంతియుత సమరంలో కాకుండా విప్లవ కార్యకలాపాల్లో పాల్గొన్న వారే. తుపాకీ ఉపయోగించడంలో శిక్షణ పొందిన వారిలో అనేక మంది ఒక్క తూటా కూడా పేల్చే అవకాశం రానివారే. అంతమాత్రం చేత వారు పోరాట యోధులు కాకుండా పోరు. అజ్ఞాతవాసంలో ఉండి పోరాడిన చాలా మందికి స్వాతంత్ర్య యోధుల పింఛన్ కూడా రాలేదు. విప్లవ కార్యకలాపాల్లో పాల్గొన్న వారు అనేకులు అజ్ఞాతంగానే ఉండిపోయారు. పింఛన్ల విషయంలో కూడా వీరు అజ్ఞాతంగా ఉండిపోయిన వారే. 1947 తరవాత జన్మించిన వారు, ఇంకా చాలా కాలం తరవాత పుట్టిన వారికి ఈ గాథలు తెలియజేయడానికే సాయినాథ్ ఈ గ్రంథం రాశారు. ఇలాంటి వృత్తాంతాలు తెలుసుకుంటే మన భవిష్యత్తును సవ్యంగా తీర్చిదిద్దుకోవచ్చు. ఈ గ్రంథం రాయడానికి సాయినాథ్‌కు కనీసం రెండు దశాబ్దాలు పట్టింది. ఒక్కొక్కరిని అనేకసార్లు కలుసుకోవలసి వచ్చింది. ఈ గాథల్లో కొన్ని ఇంత విస్తారంగా కాకపోయినా సంక్షిప్తంగా "ది హిందూ"లో ప్రచురితమైనాయి. పీపుల్స్ ఆర్కైవ్స్ ఆఫ్ రూరల్ ఇండియా (పీఏఆర్ఐ) లోనూ వెలువడ్డాయి. ప్రతి కథనం కింద ఒక క్యూ.ఆర్. కోడ్ ఇచ్చారు. దాన్ని స్కాన్ చేసి చూస్తే సవివరమైన కథనాలు, వీడియోలు కనిపిస్తాయి. ❑




**2023 డిసెంబరు 23 'ఖమ్మం ఈస్తటిక్స్ సంస్థ కథల పోటీ సంకలనం ఆవిష్కరణ - రచయితలకు పురస్కారాలు' సభలో మాట్లాడుతున్న సంస్థ వ్యవస్థాపకులు పోపూరి రవిమారుత్ (తర్వాత పేజీలో 2023 కథా సంకలనంపై సమీక్షను ఇస్తున్నాం).**


పుస్తక పరిచయం

# ఖమ్మం ఈస్తటిక్స్ 2023 కథల సంపుటి



- ఎస్.కాంతారావు

ఇది ఖమ్మం ఈస్తటిక్స్ వారు నిర్వహించిన రెండో విడత కథల పోటీలో బహుమతులు పొందిన కథలతోపాటు నిర్వాహకుల దృష్టికొచ్చిన మరికొన్ని మంచి కథలను కలిపి వెలువరించిన కథా సంకలనం. ఇందులో మొత్తం పద్నాలుగు కథలున్నాయి. వీటిల్లో రెండు కథలు ఇటీవల మణిపూర్ పాశవిక ఘటనల నేపథ్యంలో రాసినవి కాగా మిగిలిన పన్నెండు కథలు పన్నెండు విభిన్న సామాజిక అంశాలను కథాంశాలుగా తీసుకుని ఆయా రచయితలు రాసిన మంచి కథలను ఓ గుచ్ఛంగా కూర్చి పాఠకులకు అందించిన ఖమ్మం ఈస్తటిక్స్ వారి సాహిత్యాభిరుచి ఎంతేని ప్రశంశనీయం. ఇక కథల విషయానికొస్తే.. పోటీల్లో ప్రథమ, ద్వితీయ పురస్కారాలను అందుకున్న కథలు శ్రీ ఊహ రాసిన 'లడాయ్', స్వర్ణ కిలారి రాసిన 'ఆరోతనం' కథల్లో కథకురాళ్ళు ఎంచుకున్న వస్తువులు ఇంతకుముందు చాలామంది రచయితలు, చాలాసార్లు కథలుగా మలిచిన, పదుగురు మెచ్చినవే. అయితే ఈ ఇద్దరు యువ రచయిత్రులు ఇంతకు ముందటి కథకులకంటే విభిన్నమైన కథన శైలితో ఆరంభం నుండి ఆఖరి వరకు బిగిసడలకుండా కథలను నడిపించిన తీరు పాఠకుల చేత సాహో అనిపిస్తుంది. శ్రీ ఊహ ఎంచుకున్న కందిరీగల తుట్టెలాంటి కథాంశం 1970 దశకంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రాడికల్ విద్యార్థి ఉద్యమనేత జార్జిరెడ్డి హత్యోదంతం నేపథ్యంగా మల్చుకున్నది. అంత సంక్లిష్టమైన అంశాన్ని అంతే కథన నైపుణ్యంతో పాఠకులను అక్షరాల వెంట పరుగులు తీయించే ఆవిడ సామర్థ్యాన్ని గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆవిడకు అభినందనలు. ఇక రెండోకథ 'ఆరోతనం' ఆ నాటి వీరేశలింగం పంతులు గారి కాలం నుండి ఈనాటి వరకు ఎందరో సంఘ సంస్కర్తల సంస్కరణలకు ఆయువుపట్టు లాంటి అంశాల్లో ఒక అంశం, పునిస్త్రీని వితంతువుగా మార్చే హృదయ విదారక తంతును కథా వస్తువుగా ఎంచుకున్న స్వర్ణ గారి తెగువ కూడా ఎంతో ప్రశంశనీయ మైనదనే చెప్పుకోవాల్సివుంది. కథలో ప్రధాన పాత్ర స్వరూప పాత్ర. ఆ పాత్ర మాధ్యమంగా ఉత్తమ పురుష కథన రీతిలో కథను నడిపిన తీరు ఎంతో విలక్షణంగావుంది. తమదైన సమయం వచ్చినప్పుడు ప్రతి సాధారణ స్త్రీ కూడా ఒక అసాధారణ స్త్రీగా మారిపోతుంది. అనాదిగా తమ స్త్రీ జాతి మీద ఆచారం పేరుతో జరుగుతున్న అమానుష కృత్యాల్లో ఒకటైన పుణ్యవతిని వితంతువుగా మార్చేతంతు కూడా ఒకటి. భర్తను కోల్పోయిన స్వరూప పెద్దమ్మను వితంతువుగా మార్చతలపెట్టిన కార్యక్రమాన్ని తన సమీప బంధువులైన స్త్రీల సాయంతోనే స్వరూప ఎదుర్కొన్న తీరు పాఠకులను ఆకట్టుకుంటుంది.




**పేజీలు : 189 - ధర : 150/-**
**పుస్తకం కోసం.. 98941 13469**

ఇక సంకలనంలో మరో మంచికథ పి.శ్రీనివాస్ గౌడ్ గారి 'నా కొడుకు లచ్చిమి' ఒకటి. ఇందులో ఒక పేదరాలికి, ఒక పాడి గేదెకు మధ్య అల్లుకున్న అనుబంధపు సుగంధ పరిమళానికి కొండొకచోట పాఠకుల కళ్ళు ఆర్ద్రంగా చెమర్చుతాయి. కథా గమనానికి బలమైన సన్నివేశాల కల్పన ఎంత హృద్యంగా వుండాలో అంతే నేర్పును ప్రదర్శించిన గౌడ్ గారు అభినందనీయులు. ఈ మధ్య కథకుడుగా ఓ వెలుగు వెలుగుతున్న మంచి కథకుడు హుమాయూన్ సంఘీర్ గారి కథ 'సుగంధ' మరో విలక్షణ కథ. కథా వస్తువు ఈ మధ్యకాలంలో చాలామంది కథకులు తడుముతున్న మూడో జండర్ నేపథ్యంలో నడుస్తుంది. వారు ఎదుర్కొంటున్న అంతులేని దుఃఖాన్ని, విషాదాన్ని హృద్యంగానూ ప్రశంశనీయం గానూ చెప్పి పాఠకులను మెప్పించిన తీరు రచయిత సామర్థ్యాన్ని పట్టిచూపేలా వుంది. ఒక సమర్థుడైన స్వర్ణకారుడు గీటురాయి మీద సొక్కం బంగారాన్ని నిగ్గు తేల్చినట్టు ఖమ్మం ఈస్తటిక్స్ బృందం వారు మంచి కథలను ఎంపిక చేసి, వాటికి పట్టం కట్టారు. ❑

పుస్తక పరిచయం

# నల్లి ధర్మారావు నవల.. వీర గున్నమ్మ కళింగ సివంగి



-వి.విజయకుమార్

స్త్రీ ఆది పరాశక్తి అంటూ పొగడ్తలతో అణిచేయడంతోనే చరిత్ర ముడిబడింది. అడుగడగునా అదృశ్య కచ్చడాలు ధరించే, భరించే స్వాతంత్ర్యమర్వాత లేని సమాజ నేపథ్యంలో గట్టిగా మాట్లాడితే నాన్నా, ఎదురు తిరిగితే అమ్మా, లేటైతే అన్నా, రోడ్డు మీద అబ్బాయితో మాట్లాడితే పొరుగువాడూ, పైట సరిగ్గా వేసుకోపోతే ఇంట్లో పనోడూ శాశించ గలిగే వెసులబాటును కల్పించిన ఈ సమాజంలో కొందరైనా గొంతు విప్పి ప్రశ్నించే స్థాయికి ఎదగడానికి తోడ్పడే అంశాలు యేవీ అని తరిచి చూస్తే, అది ఒక నికార్సైన చైతన్య స్థాయే అని చెప్పక తప్పదు. ఝూన్సీ రాణి పోరాట స్ఫూర్తి లో స్వాభిమానం, ఆత్మ గౌరవం, హక్కులను తిరస్కరించే విదేశీ దురా క్రమణ దారుడిపై ఏవగింపూ, నేలను కాపాడుకోవడం కోసం ప్రాణాలకైనా తెగించే వీరోచితత్వం కనబడితే - గున్నమ్మ నీ, ఐలమ్మనీ నడిపిన చైతన్యం వేరు. నిరుపేద కుటుంబాలకు చెంది, సామాజికంగా అట్టడుగు వర్గాలకు చెందిన అతి సామాన్యులు వీళ్ళు. గున్నమ్మ వెనక పున్నమ్మా, మహాలక్ష్మి, కౌసల్యా, తులశమ్మా అందరూ అలగా జనమే. ఈ వంటింటి కుందేళ్ళకు సివంగిలా గర్జించడం నేర్పిన చైతన్యం ఎక్కడిది ? తలెత్తి భర్తని చూసే అలవా టు కూడా నేర్వని ఈ మనుధర్మచారిణి, కుమా రీ శతకాల్ని వంట బట్టించుకున్న ఈ పొయ్యి లో పిల్లికి చిరుతలా చీల్చే శక్తి నిచ్చిన చైతన్యం ఎక్కడిది? ఈ దుంపలోవి పిల్లతో, రైతు నాయకుడు చక్రపాణి తమ్ముడు చిన్నారాయణ, పంతుళ్ళ గురించి ఇలా అంటాడు, - "పంతుళ్ళందరికీ శాస్త్రాలు తెలిసినా, రాజు చేసింది తప్పని తెలిసినా, అది చెప్పలేరమ్మా! గుడులూ మఠాలూ కట్టి, కృష్ణా, గోదావరి ప్రాంతాల నుంచి శాస్త్రాలు తెలిసిన పంతుళ్ళ కుటుంబాలను రప్పించి, వాళ్లు సుఖంగా బతకడానికి మాన్యాలు ఇచ్చారు రాజులు. ఆ మాన్యాలు దున్ని, పంటలు పండించి, వాళ్ళ గాదెల్లో పోసింది మన రైతులూ, కూలోళ్లే! చెమట చుక్క కింద పడకుండా, నెయ్యి చుక్కలతో సన్నబియ్యం ముద్ద దిగుతుంటే, వాళ్ళు ఎందుకు చెబుతారమ్మా బుద్ధులు?" ఇదుగో ఇటువంటి నారాయణలో, చక్రపాణీలో నింపిన ఈ చైతన్యమే ఈ మగువల్ని సివంగుల్ని చేసింది. రైతు ఉద్యమాలను నడిపే నాయకుల చైతన్యం గడీల్లో, కోటల్లో వున్నవాళ్లను ప్రశ్నించడం నేర్పింది. తెలంగాణా రైతాంగ పోరాటం ఎందరో ఇటువంటి వీర వనితల ధీరోదాత్త, సాధారణ మహిళల చైతన్యాన్ని శిఖరాయమానంగా చూపిం ది. వడిశలలూ, రోకలి బండలు, కారం పొడితోనే ప్రాణాలకు తెగించి పోరాడిన మహిళల్ని తయారుచేసింది. గడీలను కూల్చిన మహోగ్రపు ఆవేశాన్ని రుచి చూపింది, దుర్భేద్యమైన కోటగోడల్ని ఛిద్రం చేసింది.






గుడ్డి ద్వేషంతోనో, వ్యక్తి పగలతోనో, శత్రు సంహారం చేసే అపరిపక్వ సెల్యులాయడ్ చైతన్యంతో కాకుండా, కనీస హక్కులకోసం, బతుక్కోసం, మట్టి కోసం, చెట్టుకోసం ప్రాణాలకు తెగించి పోరాటం చేయడంలో ముందుకురికిన ఈ మగువల తెగింపు వెనుక, వారి పోరాట పటిమ వెనుక, ఒక సుశిక్షిత చైతన్యం వుంది. చల్లపల్లి, మందస, ముసునూరు గడీలు ఇవ్వాళ ప్రాణం లేని రాళ్ల కుప్పలు, శిథిలమై పోయి, గడ్డిదుబ్బులు మొలిచి, అహంకారపు మూలుగులు వినిపించే, పీడనకు సమాధులు కట్టిన ఆనవాళ్లు. ఇదంతా యేం చెబుతోంది? ఒక జాతిని ఇంకో జాతీ, ఒక మనిషిని ఇంకో మనిషీ పీడించే న్యాయం ఇక చెల్లదని. 1940 - 50 మధ్య ఆంధ్ర ప్రాంతాల్లో వెల్లివిరిసిన చైతన్యంలో, ప్రధానంగా కమ్యూనిస్టు పార్టీ, సామాన్య ప్రజల్లో పోరాట పటిమకు అక్షరాభ్యాసం చేసింది. తలదించుకోవడానికి అలవాటు పడిన అర్భక ప్రాణాలకు ఏకంగా తలెత్తి ఎదురు తిరగడాన్ని నేర్పించింది, **(మిగతా 42వ పేజీలో)**

# పారదర్శక ఎన్నికల కోసం 'సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ'




విజయవాడ, డిసెంబర్ 13 : 'ప్రజా ప్రతిఘటన ద్వారానే నియంతృత్వ పాలకులను ఎదుర్కోగలం. రాజ్యాంగాన్ని, ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు పోరాడాల్సిన బాధ్యత పౌరులపైనే ఉంది. వివిధ వ్యవస్థల వైఫల్యం కారణంగానే చట్టబద్ధపాలన పక్కదారి పడుతోంది. రాష్ట్రంలో, దేశంలో పౌరులకు వ్యతిరేకంగా పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్న తీరు అత్యంత బాధాకరంగా ఉంది' అని విశ్రాంత డీజీపీ ఎం.వి.భాస్కరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు వ్యవస్థ పనితీరుపై సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో డిసెంబరు 13వ తేదీ విజయవాడ బెంజ్ సర్కిల్‌లోని ఒక హోటల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. అమరావతి రైతు ఉద్యమకారులు, సామాజిక హక్కుల కార్యకర్తలు, న్యాయవాదులు, వివిధ రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. 'రాష్ట్రంలో సామాన్య పౌరులు, ప్రతిపక్ష రాజకీయ నాయకులు, కార్యకర్తలు, దళిత, మైనారిటీ, ప్రజలు, మహిళలు తదితరులపై పోలీసులు చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. సెక్షన్ 30, 144 వంటి వాటిని నిరవధికంగా కొనసాగిస్తున్నారు. అసభ్య పదజాలంతో, లాఠీలతో విరుచుకుపడుతున్నారు. అక్రమ కేసులు బనాయిస్తున్నారు' అని పలు సంఘటనలను ఉదాహరిస్తూ త్రిసభ్య కమిటీ దృష్టికి తీసుకు వచ్చారు. సమావేశానికి అధ్యక్షత వహించిన భాస్కరరావు మాట్లాడుతూ.. 'రాజ్యాంగాన్ని, చట్టాలను ఖాతరు చేయకుండా పరిపాలన కొనసాగడం మొత్తం వ్యవస్థల వైఫల్యమే. బాధితుల అనుభవాలు వింటుంటే హృదయ విదారకంగా ఉన్నాయి. పాలకులు నియంతల మాదిరి తయారై, ఇష్టారాజ్యంగా పోలీసు వ్యవస్థను ఒక పనిముట్టుగా వినియోగించుకుంటున్నారు. ఇది ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే పరిమితమైన ధోరణి కాదు. దేశమంతటా పౌరుల ప్రాథమిక హక్కుల పరిస్థితి ఇలానే ఉంది. బీహారులో మద్య నిషేధం పేరుతో ఐదు లక్షల మంది ప్రజలను కటకటాల వెనక్కి పెట్టారు. ప్రశ్నించే వారి నోరు నొక్కడానికి మద్య నిషేధ చట్టాన్ని అడ్డగోలుగా ప్రయోగిస్తున్నారు. పోలీసు అధికారులు రాజ్యాంగ నియమాలను ఉల్లంఘించడం చట్ట విరుద్ధం. అందుకు తగిన శిక్ష ఉంటుంది. సీనియారిటీని పక్కన పెట్టి డీజీపీలను ఎంపిక చేయడం, ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియ రాజకీయ నేతల చేతుల్లో ఉండటం పోలీసు వ్యవస్థ పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఇలాంటి ధోరణులు ఎల్లకాలం కొనసాగవు. బ్రిటిష్ హయాంలోను నియంతృత్వానికి వ్యతిరేకంగా మేధావులు, న్యాయవాదులు గళం విప్పారు. అప్పటి పాలకులను మేధావులు నిర్భయంగా ప్రశ్నించారు. అందుకు ఎన్నో ఇబ్బందులు పడినా జంకకుండా ప్రజలను పోరాటాలకు సమాయత్తం చేశారు. అంతిమంగా నియంతలు తలొగ్గాల్సి వచ్చింది.

నియంతలకు కాలం చెల్లింది. పోరాడితే మార్పులు వచ్చి తీరుతాయి. తెలంగాణలోను పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేసినందుననే అక్కడి ప్రభుత్వాన్ని ప్రజలు మార్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని మరికొన్ని జిల్లాలలో త్రిసభ్య కమిటీ పర్యటించి పోలీసు వ్యవస్థ పనితీరును, పౌరులకు జరుగుతున్న అన్యాయాలను, అక్రమ కేసులను పరిశీలిస్తాం. సమస్యలకు తగిన పరిష్కారాలను సూచిస్తాం' అని భాస్కరరావు తెలిపారు.

సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ మాట్లాడుతూ 'పోలీసుల వ్యవహార శైలిపై, అక్రమ కేసులు పెడుతున్న తీరుపై దృష్టి సారించాలని పలువురు కోరిన మీదట తిరుపతిలో జరిగిన కార్యవర్గ సమావేశంలో త్రిసభ్య కమిటీ ఏర్పాటుచేశాం. ప్రజల పట్ల, రాజ్యాంగం పట్ల నిబద్దత కలిగిన పెద్దలు సభ్యులుగా ఉండేందుకు అంగీకరించారు. కమిటీ రాష్ట్రంలో పర్యటిస్తుంది. వాస్తవాలను పరిశీలించి ఒక నివేదిక ఇస్తుంది. దీనిని మా సంస్థ తరపున రాష్ట్ర గవర్నర్‌కు అందజేస్తాం. రాష్ట్రంలో స్వేచ్ఛాయుత పారదర్శక ఎన్నికలు జరిగేందుకు వీలుగా మేం కృషి చేస్తున్నాం. పౌరసమాజ సంస్థలతో, ప్రజాస్వామ్యవాదులతో కలిసి సి.ఎఫ్.డి. తన కృషి కొనసాగిస్తుంది' అని తెలిపారు.


ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు డా.ఎన్.తులసిరెడ్డి, సీపీఐ కేంద్ర కమిటీ సభ్యులు అక్కినేని వనజ, బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్ర ప్రసాద్, డా.సమరం, డా.కే.ఎల్ రావు తనయుడు కే.విజయారావు, సిద్దార్థ లా కళాశాల ప్రిన్సిపాల్ డా. దివాకరబాబు తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో పౌర హక్కులను, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ చొరవను అభినందించారు. తమ వంతుగా సంస్థకు తోడ్పాటు ఇస్తామని తెలిపారు. సామాజిక మాధ్యమం ద్వారా ఒక పోస్టును ఫార్వర్డ్ చేసినందుకు పోలీసు వేధింపులకు గురై, కేసులో ఇరుక్కున్న పూందోట రంగనాయకమ్మ మాట్లాడుతూ ఆ కేసు తర్వాత తన వ్యక్తిగత జీవితం దుర్భరమైందని, దాని నుంచి ఇంకా కోలుకోలేదని చెప్పారు. రాష్ట్రంలో ఒక అభిప్రాయం చెప్పడమే నేరంగా మారిపోవడం దారుణమన్నారు. అమరావతి రాజధాని పరిరక్షణ కోసం పోరాడుతూ పలు కేసుల్లో కోర్టు వాయిదాలకు తిరుగుతున్న కంభంపాటి శిరీష, మార్త పావని, కొమ్మినేని వరలక్ష్మి, కామినేని గోవిందమ్మ మాట్లాడుతూ నాలుగేళ్ళుగా పోలీసులతో తాము ఎదుర్కొన్న వేధింపులను వివరించారు. అమరావతి రైతు ఉద్యమ నేత గద్దె తిరుపతిరావు మాట్లాడుతూ ఇప్పటికే రెండు వేల మందిని కేసుల్లో పెట్టారని, ఇంకా ఎంత మందిని పెడతారో తెలియదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫారూక్ షుబ్లీ, మైనార్టీ హక్కుల కార్యకర్త ముల్లా మహమ్మద్ హుసేన్, కుల నిర్మూలనా పోరాట సమితి నాయకుడు కృష్ణ, హైకోర్టు న్యాయవాదులు నర్రా శ్రీనివాస్, ఉమేష్‌చంద్ర తదితరులు మాట్లాడారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ సహాయ కార్యదర్శి వి.లక్ష్మణ రెడ్డి వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ సభ్యులు పూర్వ అడిషనల్ అడ్వకేట్ జనరల్ ఏ.సత్యప్రసాద్, ది హిందూ దినపత్రిక విజయవాడ ఎడిషన్ పూర్వ రెసిడెంట్ ఎడిటర్ వెంకటేశ్వర్లు, సి.ఎఫ్.డి. కార్యవర్గ సభ్యులు విజయవాడ పూర్వ మేయర్ డా. జంధ్యాల శంకర్, నాగార్జున విశ్వ విద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ ప్రొ.రంగయ్య, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ తదితరులు పాల్గొన్నారు. ❑

# వీర గున్నమ్మ కళింగ సివంగి

**40వ పేజీ తరువాయి**

ఈ నేపథ్యంలో, శ్రీకాకుళం మందస ప్రాంతాల్లో, ముఖ్యంగా జాతాపు సవరలు వంటి గిరిజన తెగలు ఎక్కువగా ఉండే అటవీ భూముల్లో, భూస్వాముల, పెత్తందారీ వర్గాల దాష్టీకాలు అంతూ పొంతూ లేకుండా పోతున్న తరుణంలో, జమీందారీ గడీల పెత్తనాన్ని ఎదిరించి నిలబడిన వీర మహిళ గున్నమ్మ పోరాట స్ఫూర్తిని, ఒక డాక్యుమెంటరీగా, అదే సమయంలో, ఒక వాస్తవిక చారిత్రక గాథను, నవలా శిల్పంతో పఠితల హృదయాన్ని కట్టిపడేసే రీతిలో రాసిన తీరు అద్భుతం. నవల ఆసాంతం చివరి కంటా చదివే వరకూ పఠితలను ప్రశాంతంగా ఉండనివ్వదు. నిజంగా జరిగిన సందర్భాల్ని నవలలో ఇమిడ్చిన తీరు ప్రశంసాపాత్రం. ఇందులో తారసిల్లే నాయకులూ, ఉద్యమ దృశ్యాలూ, సంఘర్షణలు, పోరాటాలూ నిజ జీవిత సందర్భాలు.

ఒక గొప్ప చారిత్రక నేపథ్యాన్ని నవలికగా, సజీవంగా అక్షర బద్ధం చేసిన నల్లి ధర్మారావు గారి కృషి అనన్య సామాన్యం. ఉత్తరాంధ్ర భాషా సొబగుల్ని జీర్ణించుకున్న ధర్మారావు గారు పాత్రోచిత సంభాషణలో ఆ మధురిమలు ఎంత చక్కగా పొదవి పట్టుకున్నారంటే మీరు ఉత్తరాంధ్రవాసులైతే ఇట్టే కనెక్ట్ అయిపోతారు. కారా మాస్టారి కథలూ అప్పలనాయుడు గారి కథలూ చదివే సాహితీ ప్రియులైతే ఈ నవల మిమ్మల్ని రంజిల్ల చేస్తుంది. అన్నింటికీ మించి ఒక చారిత్రక నేపథ్యంలో ఒక తెగువ కలిగిన మగువ పోరాట చైతన్యాన్ని మనస్ఫూర్తిగా ఆహ్వానించే వారైతే ఈ నవల మీ హృదయాన్ని గాఢంగా తాకుతుంది. ❑




ఛాతి ఎంత పెరిగినా.. !




నరేంద్రాయణం





న్యాయానికే న్యాయం

కార్టూన్స్ : సతీష్ ఆచార్య


RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)
Vol : 2 - Issue No : 4 January 2024

# కొత్త పుస్తకాలు స్వీకారం




వెల : 540

ప్రతులకు..
వై.వి.రమణారావు
ఫోన్ : 94418 16881





వెల : 325




ప్రతులకు..
కల్లూరి భాస్కరం
ఫోన్ : 9703445985

వెల : 450




ప్రతులకు..
ప్రజాశక్తి బుక్ హౌస్
విజయవాడ

if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatal Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.